

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 91 | విజయవాడ, శనివారం 1 నవంబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 1 November 2025 | Rs

Extreme Poverty Free Kerala
కేరళ తీవ్ర పేదరికాన్ని అంతం చేసింది.


Extreme Poverty Free Kerala

Information & Public Relations Department
Government of Kerala

# కేరళ తీవ్ర పేదరికాన్ని అంతం చేసింది.

## భారతదేశ వృద్ధి గాథకు నాయకత్వం వహిస్తుంది.



నేడు, 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, కేరళ ఏ ఇతర రాష్ట్రం సాధించనిది – తీవ్ర పేదరికం నుండి విముక్తిని సాధించింది. కరుణ, సమ్మిళితత్వం మరియు సామూహిక పాలన ద్వారా మార్గనిర్దేశం చేయబడిన రాష్ట్రం ప్రతి పౌరుడికి గౌరవం, అవకాశం మరియు భరోసాను కల్పిస్తుంది.

సానుభూతి మరియు ఉమ్మడి ఉద్దేశ్యంతో మొదలైన ఈ ప్రయాణం 2021లో తీవ్ర పేదరిక నిర్మూలన ప్రాజెక్ట్ (EPEP)తో ప్రారంభమై మరియు 64,006 కుటుంబాలకు సానుకూలమైన పరిష్కారాలను అందించింది. గిరిజన గ్రామాల నుండి తీరప్రాంత సమాజాల వరకు, ఏ ఒక్కరూ వెనుకబడిపోకుండా కేరళ చూసుకుంది.

**శ్రీ. పినరయి విజయన్**
గౌరవనీయ కేరళ ముఖ్యమంత్రి

### గృహనిర్మాణం
**ఇళ్ళ నిర్మాణంతో గౌరవం**

- 4677 కుటుంబాలకు కొత్త ఇళ్ళు లభించాయి
- 2713 కుటుంబాలకు భూమి మరియు ఇళ్ళు లభించాయి.
- 5646 కుటుంబాలు గృహ పునరుద్ధరణకు ఆర్థిక సహాయం పొందినవి
- లైఫ్ మిషన్ ద్వారా, గుర్తించబడిన ప్రతి కుటుంబానికి శాశ్వత, సురక్షితమైన ఇల్లు లభించింది
- అత్యంత దుర్బలమైన పరిస్థితుల్లో జీవనం గడుపుతున్న గిరిజన, తీరప్రాంత ప్రజలకు స్థిరత్వాన్ని అందించేందుకు ప్రభుత్వ జోక్యం

### ఆరోగ్యం
**అందరికీ భరోసా... అందరికీ అందుబాటులో**

- EPEP పేద కుటుంబాలకు ఆహారం మరియు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చింది.
- 29,427 అత్యంత పేద కుటుంబాలలో 85,721 మంది వ్యక్తులకు వైద్యం మరియు చికిత్స
- 5777 మంది వ్యక్తులకు ఉపశమన సంరక్షణ చికిత్స అందించబడింది
- ఏడుగురు అత్యంత పేద వ్యక్తులకు అవయవ మార్పిడి శస్త్రచికిత్స
- 3615 కుటుంబాలు ఆరోగ్య బీమా పొందాయి
- 345 మంది అంగవైకల్య కార్డులను పొందారు
- కేరళ యొక్క ప్రత్యేకమైన మానవ అభివృద్ధి నమూనా ఆరోగ్య సమానత్వాన్ని నిర్ధారిస్తుంది

### ఆహారం
**ఆకలి నిర్మూలన, పోషకాహారం హామీ**

- 20,648 కుటుంబాలకు రోజువారీ ఆహారం హామీ
- 2,210 మందికి వండిన భోజనం వడ్డించారు
- 5132 అత్యంత పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయబడ్డాయి
- కొట్టాయం, కన్నూర్ మొదటి తీవ్ర పేదరిక రహిత జిల్లాలుగా నిలిచాయి

### జీవనశైలి
**సంక్షేమం నుండి సాధికారత వరకు**

- 4394 కుటుంబాలకు స్వయం ఉపాధి మరియు జీవనోపాధి కోసం ఉద్యోగాలకు మద్దతు అందించబడింది
- 584 కుటుంబాలు కుటుంబశ్రీలో సభ్యులుగా మారాయి
- 1455 కుటుంబాలకు ఉపాధి కార్డులు లభించాయి
- 1043 కుటుంబాలకు బ్యాంకు ఖాతాలు అందించబడ్డాయి
- విస్తృత శ్రేణి సూక్ష్మతరహా వ్యాపారాలను స్థాపించారు
- డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాలు అమలు చేయబడ్డాయి

# సులభ్ కాంప్లెక్సే దిక్కు!

- 46 మందికి ఒక్క స్నానపు గది, ఒక్క మరుగుదొడ్డే
- ఆరు గదుల్లో 280 మంది విద్యార్థులు
- 'అనంత' నడిబొడ్డున ఉన్న హాస్టల్ విద్యార్థుల దీనావస్థ



అనంతపురంలోని న్యూటౌన్ కళాశాల పోస్టుమెట్రిక్ బిసి హాస్టల్



అధ్వానంగా ఉన్న స్నానపు గది, తలుపు దెబ్బతిన్న టాయ్‌లెట్

**ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి**

రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలో పేదరికం అధికం. నిరుపేదలు తమ పిల్లలను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతుల కల్పనపై పాలకులు దృష్టి సారించడం లేదు. దీంతో, సమస్యలతో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. అనంతపురం జిల్లా కేంద్రం నడిబొడ్డున న్యూటౌన్ కళాశాల ఆవరణలో పోస్టు మెట్రిక్ బిసి హాస్టల్ ఉంది. ఇందులో 280 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరు బస చేయడానికి కేవలం ఆరు గదులే ఉన్నాయి. దీంతో, ఒక్కో గదిలో 46 మంది ఉండాల్సి వస్తోంది. ఇంతమంది ఒకేచోట పడుకోవడానికి ఇబ్బంది అవుతుండడంతో కొంతమంది ఆరుబయటే నిద్రిస్తున్నారు. ఇంతమందికి కలిపి ఆరు స్నానపు గదులు, ఆరు టాయిలెట్లు మాత్రమే ఉన్నాయి. 46 మందికి ఒకటి చొప్పున మాత్రమే ఉండడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థులు క్యూకట్టాల్సి వస్తోంది. దీంతో, కొంతమంది పక్కనున్న సులబ్ కాంప్లెక్సును ఐదు రూపాయలు చెల్లించి వినియోగించుకుంటున్నారు. స్నానాలు బయటే చేస్తున్నారు. ఈ సమస్యలపై విద్యార్థి సంఘాల నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, రూ.11 లక్షల నిధులు కొత్త మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరయ్యాయి. పనులు మధ్యలోనే నిల్చిపోయాయి. దీంతో, సమస్య పరిష్కారం కాలేదు. తాడిపత్రి పట్టణ శివార్లలోని బిసి పోస్టుమెట్రిక్ హాస్టల్ పరిస్థితి కూడా ఈ విధంగానే ఉంది. ఇక్కడ ఇంటర్, డిప్లొమో విద్యార్థులు 120 మంది ఉన్నారు. ఇంతమందికి కలిపి రెండే గదులున్నాయి. బయట వంట చేసి క్యారేజీల్లో తీసుకొస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు.

**బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు**

ఆత్మకూరు మండల కేంద్రంలోని బిసి సంక్షేమ హాస్టల్ పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడ 140 మంది విద్యార్థులు ఉంటున్నారు. వర్షమొస్తే పైకప్పు కారుతుండడంతో ఆ సమయంలో నిద్రపోవడానికి భయపడుతున్నారు. ఇటీవల వర్షాలకు మరింత ఎక్కువగా కారుతుండడంతో ప్యాచ్ వర్కుల వంటి మరమ్మతులు చేపట్టారు. స్నానపు గదులు, మరుగుదొడ్లకు చాలావాటికి తలుపులు లేవు. హాస్టల్ కిటికీ అద్దాలు పగిలిపోయాయి. తలుపులు విరిగి ఉన్నాయి. రాత్రి సమయాల్లో చలిగాలి వణికిస్తోంది. అనంతపురం జిల్లాలో 51 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. 5,713 మంది విద్యార్థులు ఇక్కడ ఉన్నారు. 55 బిసి హాస్టళ్లు ఉండగా 7,881 మంది విద్యార్థులు వాటిలో ఉంటున్నారు. 11 గిరిజన సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. ఈ హాస్టళ్ల భవనాలు చాలా వరకు శిథిలావస్థలో ఉన్నాయి. 34 సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు రూ.5.70 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో 22 హాస్టళ్లలో మరమ్మతు పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన పనులు జరగాల్సి ఉంది.

**రూ.4.52 కోట్లతో మరమ్మతు లు**

బిసి హాస్టళ్లలో సమస్యలున్న చోట మరమ్మతులు చేపట్టేందుకు డిఎంఎఫ్ కింద రూ.3.57 కోట్లు, తమ శాఖ ద్వారా రూ.95 లక్షలు విడుదలయ్యాయి. న్యూటౌన్ కళాశాలలో పనులు జరుగుతున్నాయి. ఆత్మకూరులో మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. దీనితోపాటు మిగిలిన హాస్టళ్ల మరమ్మతు పనులు త్వరలో పూర్తి కానున్నాయి.

**-కుష్బు కొఠారి, బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, అనంతపురం**

## విడిఎ పాయింట్ల గెజిట్ విడుదల చేయాలి

- సిఐటియు డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వేరియబుల్ డియర్నెస్ అలవెన్స్ (విడిఎ) పాయింట్ల గెజిట్‌ను ఇప్పటికీ కార్మికశాఖ విడుదల చేయకపోవడం కార్మికులకు నష్టదాయకమైన చర్య అని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. తక్షణమే ఈ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల నిత్యావసర వస్తువులు ధరలతోపాటు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన నేపథ్యంలో.. పెరుగుతోన్న ధరలకు అనుగుణంగా విడిఎ పాయింట్స్ పెరగాల్సి ఉందని పేర్కొన్నారు. ఏడాదికి రెండు పర్యాయాలు ఏప్రిల్, అక్టోబరు నెలల్లో వినిమయ ధరల సూచిక ఆధారంగా విడిఎ పాయింట్లను విడుదల చేయాల్సి ఉందన్నారు.

అక్టోబరు నెల పూర్తవుతున్నా విడిఎ పాయింట్ల గెజిట్ విడుదల చేయకపోవడాన్ని సిఐటియు ఖండిస్తుందన్నారు. యాజమాన్యాలకు ప్రయోజనం చేకూర్చడానికే విడిఎ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడానికి ప్రధాన కారణంగా పేర్కొన్నారు.

# పోరాటాలే బాబూరావు ఊపిరి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలకు భౌతికకాయం అప్పగింత




అంతిమయాత్రలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

**ప్రజాశక్తి - భీమవరం**

తుదిశ్వాస విడిచే వరకూ పోరాటాలే ఊపిరిగా సిపిఎం సీనియర్ నేత చింతకాయల బాబూరావు జీవించారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మధ్యాహ్నం గుండె సంబంధిత సమస్యతో బాబూరావు మృతి చెందిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఉదయం తాడేపల్లిగూడెంలోని ఆయన స్వగృహం వద్ద నుంచి అశ్రునయనాల నడుమ అంతమ యాత్ర సాగింది. ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలకు భౌతికకాయం అప్పగించారు. అంతిమయాత్రలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల కార్మికులు, మహిళలు, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిపిఎం శ్రేణులు, వామపక్షాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. బాబూరావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని నివాళులు అర్పించారు.

తొలుత సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, బి. బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, జయరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, బాబూరావు భార్య శ్రీదేవి, కుమారుడు సిద్ధార్థ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, న్యూ డెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రసాద్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేతలు, తాడేపల్లిగూడెం పట్టణ ప్రముఖులు బాబూరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతిమయాత్ర డిఎస్‌చెరువు, శేషమహల్ థియేటర్, మెయిన్ రోడ్డు మీదుగా ఏలూరు రోడ్డులో కొత్త ఫ్లైఓవర్ వరకూ సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... సాధారణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించిన బాబూరావు తుదిశ్వాస విడిచే వరకూ పోరాటాలే ఊపిరిగా పని చేశారని కొనియాడారు. అంచెలంచెలుగా ఎదిగి జిల్లాల్లో ముఖ్యనేతగా, రాష్ట్రస్థాయిలో కార్మిక నేతగా వ్యవహరించిన తీరు అందరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. బాబూరావు ఆశయ సాధనకు కార్మికులు, రైతులు, ప్రజాసంఘాల కార్యకర్తలు కృషి చేసి, ఆయన స్ఫూర్తితో జిల్లాలో, తాడేపల్లిగూడెంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు బతికేది ప్రజల కోసమేనని, మరణానంతరం కూడా ప్రజల కోసమే ఉపయోగపడాలనే ముఖ్యోద్దేశంతో బాబూరావు తన భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించాలని గతంలోనే నిర్ణయించుకున్నారని, దానికి కుటుంబం సైతం సమ్మతి తెలిపిందని వివరించారు.

ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలలో బాబూరావు భౌతికకాయాన్ని అప్పగించిన తర్వాత సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ...కార్మికోద్యమ నేత బాబూరావు ఆకస్మిక మృతి జిల్లాలో కార్మికోద్యమం, సిపిఎం, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, ఎన్‌జిఒ యూనియన్ పూర్వ జిల్లా అధ్యక్షులు ఎల్‌వి.సాగర్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పార్టీ, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

## హెరిటేజ్ పనీర్‌తో 10 గ్రాముల బంగారం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

హెరిటేజ్ పనీర్ వినియోగం, వంటకాలపై నిర్వహించే పోటీల్లో పాల్గొని 10 గ్రాముల బంగారం పొందొచ్చని హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ మార్కెటింగ్ విపి పునీత్ కుసుంబియా తెలిపారు. దీనిపై శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్యకరమైన పోషకాహారం పనీర్‌ను ప్రతిరోజూ వంటకాల్లో భాగస్వామ్యం చేయాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. దీనికోసం అమ్మచేతి వంట పేరుతో ప్రాచుర్యం పొందిన ప్రముఖ ఇన్‌ఫ్లుయెన్సర్ భార్గవితో హెరిటేజ్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారు. 'ఎవ్రిడే యమ్మీ విత్ పనీర్' పేరుతో ప్రచారాన్ని ప్రారంభించిందన్నారు. 2025 డిసెంబరు వరకూ రాష్ట్రంలోని ముఖ్య పట్టణాలతోపాటు బెంగళూరు, హైదరాబాద్‌లోనూ ప్రత్యేక వంట కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ పోటీల్లో పాల్గొనేవారు వారి ఎంట్రీలను డిసెంబరు వరకూ పంపించొచ్చని తెలిపారు. హైదరాబాద్‌లో పోటీ ఉంటుందని, గెలుపొందిన వారు 10 గ్రాముల బంగారు కాయిన్ పొందొచ్చని వివరించారు. ప్రతి నగరం నుంచి విజేతలను ఎంపిక చేస్తారని, వారికి ఎయిర్‌ఫ్రయర్లు, కిచెన్ పాత్రల సెట్లు లభిస్తాయని తెలిపారు. డెయిరీ పరిశ్రమను ప్రోత్సహించాలనే ఆలోచన కూడా ఇందులో భాగమన్నారు.

## పంట నష్టం తగ్గించేందుకు చర్యలు

- మంత్రి అచ్చెన్నాయుడు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మొంథా తుపాను ప్రభావంతో నీటి ముంపులో ఉన్న పంటలకు నష్టం తగ్గించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు ఆదేశించారు. అన్ని జిల్లాల వ్యవసాయశాఖ జెడిలతో టెలీకాన్ఫరెన్స్‌ను ఆయన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి మండల వ్యవసాయాధికారి పంట నష్టం అంచనాలు కచ్చితత్వంతో సేకరించాలని, రైతులకు తక్షణమే ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో శాస్త్రవేత్తల సహాయంతో పంట రక్షణ పద్ధతులు అమలు చేయాలని సూచించారు. రైతుల సమస్యలు, నష్టాలపై అధికారుల నుంచి సమగ్ర నివేదిక అందించాలని, వాటిని త్వరగా ప్రభుత్వానికి సమర్పించి సాయం అందించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు నష్టం రాకుండా ప్రతి అధికారి నిబద్ధతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. పరిహారం పొందిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయరనే విషయాన్ని రైతులు తన దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులకు తగిన సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో ఎస్‌డిఆర్‌ఎఫ్ పరిహారం పొందిన వారికి ఈ ఇబ్బంది ఎదురైందని వెల్లడించారు. తుపాను ప్రభావంతో అనేక వరి పొలాలు నీట మునిగిన నేపథ్యంలో నష్టం తీవ్రతను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీరు తగ్గిన అనంతరం తెగుళ్లు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## కేంద్రం ప్రీమియం చెల్లించాక రైతులకు పరిహారం: వ్యవసాయ శాఖ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పంటల బీమా పథకాలకు కేంద్రప్రభుత్వం తన ప్రీమియం సబ్సిడీ వాటాను బీమా సంస్థలకు విడుదల చేసి, నిష్పత్తి ప్రకారం క్లెయిమ్ విడుదల చేయాల్సిందిగా ఆదేశించినట్లు వెల్లడించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ వెల్లడించింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో దిగుబడి ఆధారిత బీమా పథకం (పిఎంఎఫ్‌బివై)లో 4,52,404 మంది, వాతావరణ ఆధారిత బీమా పథకం (ఆర్‌డబ్ల్యుబిసిఐఎస్)లో 3,05,365 మంది రైతులు పంటలను బీమా చేయించుకున్నట్లు వ్యవసాయశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మొంథా తుఫాను వల్ల నష్టపోయిన పిఎంఎఫ్‌బివై పథకంలో నమోదైన రైతులకు పంట దిగుబడి అనంతరం వాస్తవ దిగుబడులు ఆధారంగా బీమా పరిహారం చెల్లించామని, వాతావరణ బీమాలో నమోదైన రైతులకు వాతావరణ హెచ్చుతగ్గుల ఆధారంగా బీమా పరిహారం చెల్లించనున్నట్లు తెలిపింది.

## 'వారికి' ప్రభుత్వమే పునరావాసం కల్పించాలి

- రాజధానికి ల్యాండ్ పూలింగ్‌లో భూమి కోల్పోవడంతో హైకోర్టు ఆదేశం

**ప్రజాశక్తి-అమరావతి**

గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, రాయపూడి గ్రామానికి చెందిన నెల్లూరి శేషగిరమ్మ, ఆమె మనవరాలు శ్యామలకు రాష్ట్ర ప్రభుత్వమే పునరావాసం కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. శేషగిరమ్మ మనవరాలు శ్యామల మానసిక వైకల్యంతో బాధపడుతున్నందున జీవించి ఉన్నంతకాలం ఆమె బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలంది. శేషగిరమ్మ కుటుంబ సభ్యుల నుంచి సిఆర్‌డిఎ తీసుకున్న భూమిలో ఉన్న బోర్ల ద్వారా ఆ కుటుంబం ఆదాయం పొందుతుందని గుర్తు చేసింది. భూమికి బదులు మరోచోట భూమి ఇస్తే సరిపోదని చెప్పింది. వారికి ఆదాయాన్ని చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. రాయపూడి గ్రామం పరిధిలో తమకున్న 5 సెంట్ల ఇంటి స్థలాన్ని నిరక్షరాస్యత కారణంగా పొరపాటున ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద సిఆర్‌డిఎకు అప్పగించామని, తిరిగి తమకు ఆ స్థలం ఇచ్చేలా సిఆర్‌డిఎకు ఉత్తర్వులివ్వాలంటూ 80 ఏళ్ల వయసు గల నెల్లూరి శేషగిరమ్మ, చెరుకూరి వెంకాయమ్మ, మనవరాలు చెరుకూరి శ్యామల పిటిషన్ వేశారు. శ్యామల 90 శాతం మానసిక వైకల్యంతో బాధపడుతున్నట్లు అధికారులు నిర్ధారించారని న్యాయవాది చెప్పారు. పిటిషనర్లలో ఒకరైన శేషగిరమ్మ కుమార్తె వెంకాయమ్మ పిటిషన్ వేసిన అనంతరం మరణించారని చెప్పారు.

## నష్ట పరిహారం పొందిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలి

- ఎపి కౌలు రైతు సంఘం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మొంథా తుపానుతో నష్టపరిహారం పొందిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పంట దెబ్బతిన్న భూమి సర్వే నెంబర్ల ఆధారంగా రైతులకు పరిహారం చెల్లించడంతోపాటు, పరిహారం పొందిన సర్వే నెంబర్లలో పండిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయదని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించడం సరైంది కాదని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోయిన రైతుల పేర్లు నమోదు చేస్తున్నారని, మిగిలిన పంటను రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిబంధనలను సడలించి ఉదారంగా ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కోనుగోలు చేయాలని కోరారు. ఒక పర్యాయం నష్టపరిహారం పొందిన సర్వే నెంబరు గల భూమికి, మరో తుపాను వల్ల పంట నష్టపోతే మరోసారి నష్టపరిహారం ఇవ్వకూడదనే నిబంధన సరైంది కాదన్నారు. రైతులు పంట వేసినప్పుడు నష్టపోతే అన్ని వేళల్లో ఆదుకోవాల్సిన ప్రభుత్వం రకరకాల నిబంధనలతో అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. అడ్డగోలు నిబంధనలను ప్రభుత్వం తొలగించి అర్హులైన ప్రతి కౌలు రైతుకూ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇ-క్రాప్‌తో నిమిత్తం లేకుండా వాస్తవంగా పంటలు సాగు చేసిన వారికే తుపాను నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పంటల బీమా చెల్లించినా, చెల్లించకపోయినా ప్రభుత్వమే బాధ్యత తీసుకుని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బీమా వాస్తవంగా సాగు చేసిన సన్న, చిన్నకారు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫోరెన్సిక్ అధికారి ఫణిభూషణ్‌కు అవార్డు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**



కేంద్ర ప్రభుత్వం 2025-26కు ప్రకటించిన ప్రతిష్టాత్మక 'కేంద్రీయ గృహ మంత్రి' అవార్డుకు రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎపిఎస్ఎఫ్ఎల్) డిఎన్ఎ విభాగంలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న బొమ్మకంటి ఫణిభూషణ్ ఎంపికయ్యారు. ఈ మేరకు డిజిపి హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. ఫోరెన్సిక్ విభాగంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, నిధులు, శాస్త్రీయ పరికరాల లభ్యత, నేరస్తుల పరిశీలన, మార్గదర్శకాలు, నైపుణ్య సహిత నివేదికలు, దీర్ఘకాలిక జాప్య నివేదికలను తక్షణమే నివేదించడం వంటివి ప్రస్తుతం సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ సంక్లిష్టమైన కేసుల పరిష్కారంలో దేశంలోనే ప్రథమ స్థానం సాధిస్తుందని డైరెక్టర్, ఐజిపి పాలరాజు తెలిపారు.

**కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై ఫోరెన్సిక్ బృందాలు వేగవంతమైన చర్యలు**

కర్నూలు జిల్లాలో ఇటీవల వి కావేరి బస్సు అగ్ని ప్రమాదానికి గురైన ఘటనలో మృతులను గుర్తించడం అత్యంత క్లిష్టంగా మారిన సందర్భంలో రాష్ట్ర ఫోరెన్సిక్ డైరెక్టర్ పాలరాజు నేతృత్వంలోని 16 బృందాలు వేగవంతంగా మృతులను గుర్తించేలా పనిచేయడం అభినందనీయమని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

## టిటిడి పరకామణిలో చోరీ కేసుపై విచారణ

**ప్రజాశక్తి-అమరావతి**

టిటిడి పరకామణిలో చోరీ కేసును తిరుపతి లోకాయుక్తలో రాజీ చేసుకోవడాన్ని సవాల్ చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణ చేపట్టింది. గతంలో ఎవిఎస్ఒగా చేసిన వై సతీష్ కుమార్, నిందితుడు రవికుమార్ ఉభయుల అంగీకారంతో కేసును లోకాయుక్త రాజీ చేయడానికి ఉన్న చట్టబద్ధత తేల్చుతామని చెప్పింది. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, తిరుపతి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, సిఐడి డిజి, టిటిడి ఇఒ, సివిఎస్‌వి, తిరుపతి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఒ, పరకామణి అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి వై సతీష్ కుమార్, నిందితుడు సివి రవికుమార్‌కు నోటీసులిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను నవంబరు 17కు వాయిదా వేస్తూ జస్టిస్ ఆర్ రఘునందన రావు, జస్టిస్ సుభేందు శమంతతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. కేసు రాజీ చేసుకోవడాన్ని తిరుపతి వార్త ఎడిటర్ ఎం శ్రీనివాసులు వేసిన పిటిషన్‌పై ఇప్పటికే సింగిల్ జడ్జి.. నిందితుడి ఆస్తులపై విచారణ చేయాలని ఎసిబిని ఆదేశించారు. కేసును లోకాయుక్తలో రాజీ చేసుకోవడాన్ని డివిజన్ బెంచ్ విచారించింది.

# ట్రాక్టర్ మట్టికి రూ.750 సీనరేజ్

- ఎఎంఆర్ బాదుడుపై జనాగ్రహం
- ఒంగోలు- కర్నూలు రహదారిపై రాస్తారోకో

**ప్రజాశక్తి - చీమకుర్తి (ప్రకాశం జిల్లా)**

ట్రాక్టర్ మట్టికి రూ.750 సీనరేజ్ కట్టాలని ఎఎంఆర్ సంస్థ ప్రతినిధులు ట్రాక్టర్‌ను నిలిపివేయడంతో ఆ సంస్థపై ప్రజాగ్రహం పెల్లుబికింది. ప్రకాశం జిల్లా చీమకుర్తి ప్రాంతంలో సీనరేజ్ వసూలును ఎఎంఆర్ కార్పొరేట్ సంస్థకు అప్పగించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానిక ఫ్యాక్టరీ, ట్రాక్టర్, ట్రాలీ యజమానులు, కార్మికులు, చేతివృత్తుల వారు శుక్రవారం ఒంగోలు- కర్నూలు రోడ్డుపై రాస్తారోకో చేశారు.

ఎల్లయ్య నగర్ సెంటర్‌లోని స్వాతి పెట్రోల్ బంకు సమీపంలో మట్టిని తీసుకొస్తున్న ట్రాక్టర్‌ను ఎఎంఆర్ చెక్‌పోస్ట్ వద్ద నిలిపివేశారు. మట్టికి సీనరేజ్ కట్టాలని ఒత్తిడి చేశారు. మట్టికి సీనరేజ్ కట్టడం ఏమిటని రైతు నిలదీశారు. ట్రాక్టర్ యజమానులు, కంకర్ మిల్లుల కార్మికులు, గ్రానైట్ తరలించే ట్రాలీ యజమానులు, కార్మికులు, ఫ్యాక్టరీ యజమానులు, కార్మికులు, గ్రానైట్ పరిశ్రమపై ఆధారపడి నడుస్తున్న వివిధ చేతివృత్తుల కార్మికులు అందరూ ఒక్కసారిగా రోడ్డెక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇల్లు కట్టుకోవాలంటే మట్టి కావాలి, కంకర కావాలి, రాళ్ల ముక్కలు కావాలి వీటన్నింటికీ సీనరేజ్ కట్టమనడం ఎంతవరకు సబబు? అని ప్రశ్నించారు. ట్రాక్టర్ మట్టి తోలుకుంటే 750 రూపాయలు కట్టాలా? కంకర తోలుకుంటే వెయ్యి రూపాయలు కట్టాలా? ఇది ఎక్కడి న్యాయం అని నిలదీశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటామని చెప్పి, ఇప్పుడు అదే పరిశ్రమ మూతపడడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. చివరకు ఎఎంఆర్ సంస్థ జిల్లా ప్రతినిధి జయప్రకాశ్ రెడ్డి వచ్చి ఆందోళనకారుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. తమ చేతిలో ఏమీ లేదని ఒంగోలుకు వచ్చి తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన చెప్పడంతో మేము ఒంగోలు వచ్చేది లేదు ఎవరైనా సరే మీరే వచ్చి సమస్యలు ఇక్కడే పరిష్కరించాలని, తాము సీనరేజ్ కట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. సీనరేజ్ కట్టకుండానే ట్రాక్టర్‌ను తీసుకువెళ్లారు. అనంతరం ఆందోళనను విరమించారు.



రహదారిపై బైఠాయించిన ట్రాక్టర్, ట్రాలీ యజమానులు, కార్మికులు

## 2న ఎల్‌విఎం3-ఎం5 ప్రయోగం

- ఇస్రో నుంచి మరో భారీ ఉపగ్రహ ప్రయోగానికి సర్వం సిద్ధం


**ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా):**

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) రెండో ప్రయోగవేదిక నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఎల్‌విఎం3-ఎం5 రాకెట్ ద్వారా సిఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. ఈ ప్రయోగానికి సంబంధించి అన్ని పరీక్షలు పూర్తిచేసి షార్‌లోని బ్రహ్మప్రకాష్లులో మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం నిర్వహించారు. లాబ్ ఛైర్మన్ ఇఎస్ పద్మకుమార్ ఆధ్వర్యంలో లాంచ్ రిహార్సల్స్ నిర్వహించారు. ఎల్‌విఎం3-ఎం5 రాకెట్ ప్రయోగాన్ని 16.09 నిమిషాల్లోనే ప్రయోగాన్ని పూర్తి చేసేలా శాస్త్రవేత్తలు డిజైన్ చేశారు. 43.5 మీటర్లు పొడవు కలిగిన ఎల్‌విఎం-3 రాకెట్ ప్రయోగ సమయంలో 642 టన్నుల బరువుతో భూమి నుంచి నింగిలోకి దూసుకెళ్లనుంది. 4,400 కిలోల బరువు కలిగిన సిఎంఎస్-03 ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఉపగ్రహంలోని అపోజి ఇంధనాన్ని మండించి మూడు, నాలుగు విడతల్లో భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహం భారత భూభాగంతో సహా విస్తృత సముద్ర ప్రాంతంలో సేవలను అందిస్తుంది. చంద్రయాన్-3 ప్రయోగానికి కీలకంగా పనిచేసిన మొదటి ఎల్‌విఎం-3 రాకెట్‌ను ఈ ప్రయోగంలో ఉపయోగించనున్నారు.



ప్రయోగానికి సిద్ధమవుతున్న ఎల్‌విఎం3- మిషన్

## ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రాయితీ బకాయిలు విడుదల చేయాలి : కెవిపిఎస్



**ప్రజాశక్తి-మంగళగిరి, అమరావతి బ్యూరో**

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు చెల్లించాల్సిన రాయితీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. మంగళగిరిలోని ఎపిఐఐసి కార్యాలయం వద్ద ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ నిరసనకు కెవిపిఎస్ నాయకులు మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. ప్రతి ఇంటిలో ఒకరిని పారిశ్రామికవేత్తను చేస్తామన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 8 వేల మంది ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు కేవలం రూ.500 కోట్లు రాయితీ బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎందుకు ఆ నిధులు విడుదల చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ఎస్‌సి, ఎస్‌టిలను గతంలో వైసిపి, నేడు కూటమి ప్రభుత్వం మోసం చేశాయన్నారు. ఐదేళ్లుగా రాయితీ బకాయిలు విడుదల చేయకుండా ఉండటం దుర్మార్గమైన కులదురహంకార చర్యగా పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టిస్తూ ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధం లేని రంగాలకు కేటాయించి ఖర్చు చేయడాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జొన్నకూడి నవీన్ ప్రకాష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## టెస్లాపై శామ్ ఆల్ట్‌మాన్ ఆగ్రహం

- ఏడేళ్లుగా కారు డెలివరీ చేయలేదని విమర్శ

వాషింగ్టన్ : ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా కార్ల కంపెనీలపై ఓపెన్‌ఎఐ సిఇఒ శామ్‌ఆల్ట్‌మాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018 జులైలో 50,000 డాలర్లతో టెస్లా రోడ్‌స్టర్ బుక్ చేసుకున్నారు. ఏడేళ్లయిన ఇప్పటికీ కారు డెలివరీ చేయలేదని ఆల్ట్‌మాన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తన డబ్బు కూడా రీఫండ్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన ఫోటోలను కూడా ఆయన పంచుకున్నారు. ఇందులో 2018 జులై 11న కారును బుక్ చేసినట్లు తెలుస్తోంది.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 91 | విజయవాడ, శనివారం 1 నవంబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 1 November 2025 | Rs



## ఆరోగ్యశ్రీ వైద్య సేవలు పున:ప్రారంభం

- నెట్‌వర్క్ ఆస్పత్రులతో చర్చలు సఫలం

8



## ఏలేరు కాలువకు గండి

6

- నీట మునిగిన వరి పంట
- ఉధృతంగా నల్లమడ వాగు
- శారద నదికి పడిన గండిని పరిశీలించిన హోం మంత్రి

# ఇండోసోల్‌కు సరుబుజ్జిలి?

## జెన్‌కో పేరుతో భూములు సేకరించేందుకు ప్రయత్నం • ప్రాజెక్టుకు వ్యతిరేకత ఉందని ఇంటిలిజెన్స్ నివేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇండోసోల్ కంపెనీకి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న ఎదురులేని పరిస్థితి నెలకొంది. ఈ కంపెనీ అడిగిన వెంటనే వేలకు వేల ఎకరాల భూములను ప్రభుత్వాలు అప్పనంగా కట్టబెడుతున్నాయి. ప్రజలు, రైతులు, గిరిజనులు వ్యతిరేకిస్తున్నా ఈ కంపెనీకి భూములు అప్పగిస్తున్నారు. సోలార్ పివి మ్యాడ్యుల్స్ తయారీ కోసం వైసిపి ప్రభుత్వం రామయపట్నం వద్ద సుమారు 5,500 ఎకరాల భూములను ఇండోసోల్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటిని రద్దు చేసి ప్రకాశం జిల్లా కరేడులో ఇండోసోల్‌కు సుమారు 8,200 ఎకరాలను కట్టబెట్టింది. అయితే అక్కడి ప్రజలు, రైతులు, గిరిజనులు ఉద్యమాల ద్వారా ఈ ప్రయత్నాన్ని అడ్డుకుంటున్నారు. ఇప్పుడు ఇదే ఇండోసోల్ కంపెనీకి శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలో ప్రతిపాదించిన థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం అప్పగించే ప్రయత్నం చేస్తునట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

అయితే ఎక్కడా కూడా ఇండోసోల్ కంపెనీ పేరు వినపడకుండా రాష్ట్రప్రభుత్వంతో పాటు ఇటు జెన్‌కో కూడా జాగ్రత్త పడుతోంది. కేవలం జెన్‌కో మాత్రమే ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తునట్లుగా పైకి చెప్పుకొస్తున్నాయి. అయితే ఇండోసోల్‌తో కలిపి జెన్‌కో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుందా? లేక పూర్తిగా ఇండోసోల్‌కే అప్పగిస్తుందా? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఇప్పటికే ఇండోసోల్‌కు, ఆ కంపెనీ మాతృసంస్థ అయిన షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌కు ఇబ్బడిముబ్బడిగా విద్యుత్ ప్రాజెక్టులు అప్పగించడంతో పాటు అవసరమైన భూములను కూడా ప్రభుత్వం అప్పగిస్తుందనే విమర్శలు ఉన్నాయి.



సరుబుజ్జిలి - పాలకొండ రహదారిపై నిరసన తెలుపుతున్న గిరిజనులు (ఫైల్)

### సరుబుజ్జిలిలోనూ వ్యతిరేకత...

సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస ప్రాంతంలో 3,200 మెగావాట్లతో ప్రతిపాదించిన ఈ ప్లాంట్‌కు సుమారు రూ.30వేల కోట్ల ఖర్చవుతుందని జెన్‌కో అంచనా వేసింది. సుమారు 2వేల ఎకరాల భూములు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేసిన జెన్‌కో, సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డిపిఆర్)ను దేశీఇన్ కంపెనీకి అప్పగించింది. ప్లాంట్‌కు అవసరమైన భూములను రైతుల నుంచి సేకరించాలని నిర్ణయించింది. అయితే ఈ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ అక్కడి ప్రజలు, రైతులు, గిరిజనులు తీవ్ర ఉద్యమాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి హానీ కలగడమే కాకుండా తమకు నీటి కొరత ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండోసోలకు అప్పగించాలన్న ప్రతిపాదనలపై అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈప్లాంట్‌కు అవసరమైన నీటిని హిరమండలం రిజర్వాయర్, వెన్నెల వలస ప్రాజెక్టుల నుంచి నదుల నుంచి తీసుకోవాలని జెన్‌కో పరిశీలిస్తోంది. వ్యవసాయానికి అవసరమయ్యే నీటిని విద్యుత్ ప్లాంట్‌కు తరలిస్తే తమకు నీటి కొరత రావడంతో పాటు ప్లాంట్ నుంచి వచ్చే కాలుష్యం వల్ల తమ పొలాలు నాశనమవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గామస్తులు రోజువారీ అవసరాలకు వాడుకునే నీటిని ఇండోసోల్ ప్రాజెక్టు కోసం ఎలా తరలిస్తారని హైకోర్టు గురువారం నెల్లూరు జిల్లాలోని చేవూరు, చెన్నాయపాలెం గ్రామస్తులు వేసిన పిల్ విచారణ సందర్భంగా ప్రశ్నించిన విషయం తెలిసిందే.

సరుబుజ్జిలి థర్మల్ ప్లాంట్‌కు అవసరమైన భూములను సర్వే చేసేందుకు వచ్చిన జెన్‌కో, స్థానిక రెవెన్యూ అధికారులను అక్కడి ప్రజలు అడ్డుకున్నారు. అయినా భూసార పరీక్షలను నిర్వహించేందుకు స్థానికులను ఏలాగైనా ఒప్పించాలని జెన్‌కో యాజమాన్యం సరుబుజ్జిలి ఎమ్మార్వోకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. మరో వైపు ఈ ప్రాజెక్టుపై ముందుకెళ్లొదని నిఘా వర్గాలు(ఇంటిలిజెన్స్) ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్లాంట్ వల్ల సురుబుజ్జిలి ప్రాంతంలో తీవ్ర ఉద్యమాలు వస్తాయని హెచ్చరించినట్లు తెలిసింది.



నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం, జాన్ వెస్లీ తదితరులు, ఇన్‌సెట్‌లో రామారావు(ఫైల్)

# సిపిఎం నేత సామినేని రామారావు దారుణ హత్య

- పథకం ప్రకారం కత్తులతో పొడిచి చంపిన దుండగులు
- నా భర్తను కాంగ్రెస్ గూండాలే హత్య చేశారు : స్వరాజ్యం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సిపిఎం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి సామినేని రామారావు (73)ను గుర్తు తెలియని వ్యక్తులు అత్యంత కిరాతకంగా కత్తులతో పొడిచి హత్య చేశారు. రామారావు కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు సామినేని రామారావు శుక్రవారం ఉదయం ఐదు గంటల సమయంలో నిద్ర లేచి, కాలకృత్యాలు పూర్తి చేసుకొని ఇంటి ముందు కొద్దిసేపు వాకింగ్ చేశారు. ఆ తర్వాత తన ఇంటి ఆవరణలోనే ఉన్న కొట్టంలో మిగతా 6లో

### సామినేని హత్యకు సిపిఎం పొలిట్‌బ్యూరో ఖండన

న్యూఢిల్లీ : ప్రముఖ రైతు ఉద్యమ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు సామినేని రామారావు దారుణ హత్యకు గురి కావడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. ఖమ్మం జిల్లాలోని ఆయన స్వగ్రామమైన పాతర్లపాడులో కాంగ్రెస్ గూండాలు శుక్రవారం ఉదయం రామారావుపై దాడి చేశారు. దుండగులు పదేపదే కత్తితో పొడవడంతో అక్కడికక్కడే ఆయన మరణించారని పొలిట్‌బ్యూరో తెలిపింది. సామినేని హత్యకు బాధ్యులైన వారిని పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, హేయమైన ఈ నేరానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టి తగు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేసింది. బాధిత కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలియజేసింది.

## పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

6

## తెలంగాణ రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

- సిఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరు

8

## 'వారికి' ప్రభుత్వమే పునరావాసం కల్పించాలి

- రాజధానికి ల్యాండ్ పూలింగ్‌లో భూమి కోల్పోవడంతో హైకోర్టు ఆదేశం

2

# తుపాన్ నష్టం పరిశీలనకు తక్షణమే కేంద్ర బృందాలు

- కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- 5,244 కోట్ల రూపాయల నష్టం జరిగిందని వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మొంథా తుపాన్ కారణంగా చోటుచేసుకున్న నష్టాన్ని పరిశీలించేందుకు తక్షణమే బృందాలను పంపాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రం కోరింది. ఈ మేరకు తుపాన్ నష్టానికి సంబంధించిన ప్రాథమిక అంచనాలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కేంద్రానికి నివేదిక పంపారు. ఈ నివేదికలో 5,244 కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. అయితే, ఇది ప్రాథమిక అంచనాల మేరకే అని, పూర్తి వివరాలు వస్తే నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఈ మేరకు శాఖల వారీగా ప్రాథమిక అంచనాలను వివరించారు. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉందని నివేదికలో వెల్లడించారు . రాష్ట్రంలోని 249మండలాల్లోని 14,34 గ్రామాలు, 48పట్టణాలపై తుపాన్ ప్రభావం పడినట్లు, 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు నివేదికలో తెలిపారు.

### 4794 కి.మీ దెబ్బతిన్న ఆర్ అండ్‌బి రహదారులు

కేంద్ర ప్రభుత్వానికి అధికారులు పంపిన నివేదిక ప్రకారం అత్యధికంగా రహదారులు, వ్యవసాయం-అనుబంధ రంగాల్లో నష్టం చోటుచేసుకుంది. 4,794 కిలో మీటర్ల మేర ఆర్ అండ్‌బి రహదారులు , 311 కల్వర్టులు,బ్రిడ్జీలు దెబ్బతిన్నాయని నష్టం సుమారుగా రూ.2,774 కోట్ల మేర ఉంటుందని అంచనా వేశారు. పంచాయతీరాజ్ శాఖకు రూ.454కోట్లు నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

### 1.38లక్షల హెక్టార్లలో పంటనష్టం

వ్యవసాయరంగానికి సంబంధించి 1.38లక్షల హెక్టార్లలోని 2.96లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిన్నాయని, రైతులు రూ.829కోట్ల వరకు నష్టపోయినట్లు నివేదికలో పేర్కొన్నారు. 12,215 హెక్టార్లలోని రూ.40కోట్ల మిగతా 6లో

## కేంద్రాన్ని తక్షణ సాయం కోరండి

- అధికారులకు సిఎం ఆదేశం

8

## బాలికపై అత్యాచారం

- జనసేన నాయకుని ఘాతుకం

ప్రజాశక్తి- ఐ.పోలవరం (డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం బాణాపురానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి తల్లి ఎస్పికి శుక్రవారం ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్పికి అందిన ఫిర్యాదు ప్రకారం... రాయపురెడ్డి సత్యవెంకట కృష్ణ (బాబి) జనసేన పార్టీలో చురుకుగా పనిచేస్తున్నాడు. ఐ.పోలవరం జడ్పి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వలంటీర్ డ్రిల్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విద్యార్థులకు ఆటలు నేర్పించే సమయంలో బాణాపురానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని తినుబండారాలు కొనిస్తూ మచ్చిక చేసుకున్నాడు. తన ఇంటికి సైతం తీసుకెళ్లేవాడు. గురువారం సాయంత్రం బాలిక ఇంటికి ఆలస్యంగా రావడం, తినుబండారాలు ఎక్కువగా ఉండడంతో ఆమె తల్లి నిలదీసింది. దీంతో, బాలిక జరిగిన విషయం చెప్పడంతో అత్యాచారం విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలిక తండ్రి ఏడాది క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి తల్లే కూలి పనులు చేసుకుంటూ చదివిస్తోంది.

## మేయర్ దంపతుల హత్య కేసులో..

# ఐదుగురికి ఉరి శిక్ష

- చిత్తూరు జిల్లా కోర్టు సంచలన తీర్పు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు నగర మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ హత్య కేసులో శుక్రవారం చిత్తూరు జిల్లా కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. నేరం రుజువు కావడంతో ఐదుగురు ముద్దాయిలకు ఉరిశిక్ష విధించింది. ఉరిశిక్ష పడిన వారిలో శ్రీరామ్ చంద్రశేఖర్ (చింటూ), వెంకటాచలపతి, ముల్బాగల్ వెంకటేష్, జయప్రకాష్‌రెడ్డి, తోటి మంజునాథ్ ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 2015 నవంబర్ 17వ తేదీ పట్టపగలు చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోనే నాటి నగర మేయర్ కఠారి అనురాధను, ఆమె భర్త కఠారి మోహన్‌ను బురకాలు ధరించిన వ్యక్తులు అత్యంత కిరాతకంగా హత్య చేయడం రాష్ట్ర వ్యాప్తంగా అప్పట్లో సంచలనం రేపింది. హత్య చేసింది తామేనంటూ వెంకటాచలపతి, వెంకటేష్, జయప్రకాష్‌రెడ్డి, తోటి మంజునాథ్, వెంకటేష్ హత్య జరిగిన 15 నిమిషాల వ్యవధిలోనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు. ఈ కేసులో పోలీసులు 23 మందిపై కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. నాటకీయ పరిణామాల మధ్య వారం రోజుల తర్వాత ప్రధాన నిందితుడు చంద్రశేఖర్ (చింటూ) జిల్లా కోర్టులో లొంగిపోయాడు. నాటి నుంచి దాదాపు పదేళ్లపాటు 130 మంది సాక్షులను కోర్టు విచారించింది. హత్య కేసులో నిందితులుగా పోలీసులు ఛార్జిషీట్‌లో నమోదు చేసిన 23 మందిలో శ్రీనివాస ఆచారికి ప్రమేయం లేదంటూ కేసు నుంచి కోర్టు ఆయనను తొలగించింది. కేసు విచారణ సమయంలో కాసారం రమేష్ మృతి చెందాడు. ఈ నెల 24న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి, ఆరో అదనపు కోర్టు ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు వాదోపవాదనలు విన్నారు. జంట హత్య కేసులో ఐదుగురికి ప్రత్యక్షంగా ప్రమేయం ఉన్నట్లు కోర్టు నిర్ధారించింది.

కేసు నమోదైన మొత్తం 23 మందిలో 18 మంది నిర్దోషులని తేల్చింది. 30వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ చేసిన జిల్లా కోర్టు తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఐదుగురు ముద్దాయిలకు ఉరి శిక్ష విధిస్తూ తొమ్మిదో అదనపు జడ్జి శ్రీనివాసరావు తీర్పు వెలువరించారు. ముద్దాయిలను పోలీసులు భద్రత నడుమ కడప సెంట్రల్ జైలుకు తరలించారు.



మేయర్ దంపతుల హత్య కేసులో ఉరిశిక్ష పడిన ముద్దాయిలు

# నవ కేరళ.. నవోదయం

**తీవ్ర పేదరికం లేని తొలి రాష్ట్రంగా ఘనకీర్తి**

**రాష్ట్ర అవతరణ దినోత్సవాన నేడు సగౌరవంగా ప్రకటన**

**'ప్రజాశక్తి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి విజయన్**



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - తిరువనంతపురం

ప్రపంచమంతా కేరళ వైపు చూస్తోంది. విద్య, వైద్యారోగ్యం, ఐటి, సహకార రంగం, పారిశ్రామిక ప్రగతి, మౌలిక సదుపాయాలు, ప్రజాసంక్షేమం, సామాజిక చైతన్యం ఇలా అన్ని రంగాల్లోనూ దేశానికి నవ కేరళ..నవోదయంగా కొత్త వెలుగునిస్తోంది. వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ప్రజా వికాసానికి అనేక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే తీవ్ర పేదరికాన్ని సంపూర్ణంగా పారద్రోలి దేశంలోనే ఈ ఘనత సాధించిన మొట్టమొదటి రాష్ట్రంగా కేరళ ఘనకీర్తి పొందుతోంది. ఈ మేరకు కేరళ రాష్ట్ర అవతరణ దినోత్సవాన (నవంబరు 1) ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటన చేయనున్నారు. పకడ్బందీ ప్రణాళికతో కూడిన పరిశోధన, సర్వే, జాగ్రత్తగా పరిశీలించి చేసిన కచ్చితమైన అమలు, ప్రజా ప్రాతినిధ్యం, వివిధ విభాగాలు సమన్వయంతో చేసిన కృషి.. ఫలితంగానే ఇది సాధ్యమైంది. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అద్వితీయమైన నవ కేరళ ప్రగతి ప్రస్థానంపై విజయన్ వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**తీవ్ర పేదరికం నుంచి విముక్త రాష్ట్రంగా కేరళను ప్రకటించడం ద్వారా ప్రపంచానికి ఇచ్చే సందేశం ఏమిటి?**

**సిఎం :** నవంబరు 1న కేరళను తీవ్ర పేదరికం లేని రాష్ట్రంగా ప్రకటించనున్నారు. తద్వారా స్థానిక స్వపరిపాలనా సంస్థలు, సమాజం, వివిధ ప్రభుత్వ శాఖల సమిష్టి కృషి, సహకారంతో దారిద్ర్యాన్ని, తీవ్ర పేదరికాన్ని కూడా ఒక ప్రాంతం నుండి పూర్తిగా పారద్రోలవచ్చని ప్రపంచానికి బలమైన సందేశాన్ని ఇస్తుందన్నారు. "పేదరికం, ఆకలి నుండి విముక్తి జరగాలన్న ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని పూర్తిగా సాధించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలవనుంది. ఎవరినీ వెనుకబడనివ్వకుండా అభివృద్ధి సాధించడం సాధ్యమేనన్న విషయాన్ని ఈ విజయం మనకు గుర్తు చేస్తుంది.

**ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం 2.0 తొలి కేబినెట్ తీసుకున్న ప్రధానమైన నిర్ణయాల్లో తీవ్ర పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడం ఒకటి. ఈ దిశగా గత నాలుగేళ్ల నుండి సాగిన ప్రయాణం ఎలా వుంది?**

**సిఎం :** తీవ్ర పేదరికంలో జీవిస్తున్న కుటుంబాలను కనుగొని, వారిని ఆ పరిస్థితుల నుండి బయటపడవేసే లక్ష్యంతో 2021లో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రారంభించింది. స్థానిక స్వ పరిపాలనా సంస్థలు సవివరమైన సర్వే నిర్వహించాయి. 64,006 కుటుంబాలను తీవ్రమైన పేదరికంలో జీవిస్తున్నవిగా సర్వే గుర్తించింది. ఆదాయం, ఆరోగ్యం, ఆహారం, ఇల్లు వంటి అంశాలను ప్రాతిపదికగా చేసుకుని ఈ సర్వే జరిగింది. తదనుగుణంగా ప్రతి ఒక్క కుటుంబానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. స్థానిక స్వపరిపాలనా సంస్థలు, కుటుంబశ్రీ, లైఫ్ మిషన్, ఆరోగ్యం, ఇతర ప్రభుత్వ విభాగాల మద్దతుతో ఈ సూక్ష్మ ప్రణాళికలను అమలు చేశారు. ఈ ప్రాజెక్టు తొలి ఏడాదిలో, సర్వే చేయబడిన జాబితాలోని 47.89 శాతం జనాభా దారిద్ర్యం నుండి బయటపడ్డారు. ఈ ఏడాది సెప్టెంబరు 16 నాటికి ఈ కార్యక్రమం వర్తింపచేసిన కుటుంబాల్లో 53,699 కుటుంబాలు (84 శాతం) దుర్భర దారిద్ర్యం నుండి బయటకు వచ్చాయి. దుర్భర దారిద్ర్యాన్ని గుర్తించే సమయంలో దుర్భర దారిద్ర్య రేఖ పరిధిలోకి వారిని చేర్చి ఆ తర్వాత మరణించిన వారిని, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్ళిన వారిని, జాబితాలో రెండుసార్లు పేర్లు వచ్చిన వారిని, సూక్ష్మ ప్రణాళిక అవసరం లేని వారిని దీన్నుండి మినహాయించారు. ఆ రకంగా 55861 కుటుంబాలు (96.13 శాతం) దుర్భర దారిద్ర్యం నుండి విముక్తి పొందాయి.

తొలి ఏడాదిలో, ఆహారం, ఆరోగ్య సంరక్షణ వంటి అత్యంత కీలకమైన, అనివార్యమైన కారణాలపై ప్రభుత్వం అధికంగా దృష్టి కేంద్రీకరించింది. దీనికి తోడు, అవకాశం అతివేగం క్యాంపెయిన్ కింద 21,263 మంది నిరుపేదలకు ఓటర్ ఐడి, ఆధార్, రేషన్ కార్డు, ఆరోగ్య బీమా, వికలాంగ గుర్తింపు కార్డులు, బ్యాంక్ అకౌంట్లు, ఉపాధి కార్డులు, ఎమర్జన్సీ సేవలు వంటి అవసరాలు, హక్కులను కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అంకిత భావంతో, సమిష్టిగా చేసిన కృషి వల్ల సామాజిక భద్రతా సంస్థలు, స్థానిక స్వ పరిపాలనా సంస్థలు ఆహారం, ఆరోగ్యసేవలు నిరంతరంగా అవసరం వున్న వారికి తమ మద్దతునందించాయి. అవసరంలో వున్న కుటుంబాలకు సామాజిక భద్రతా పెన్షన్ అందించారు. ఇళ్ళు లేని కుటుంబాలకు లైఫ్ మిషన్ గృహ నిర్మాణ పథకాన్ని అందించింది. కుటుంబశ్రీ అమలు చేసే ఉజ్జీవనం పథకం ద్వారా జీవనోపాధి, రెగ్యులర్ ఆదాయానికి హామీ కల్పించబడింది. చాలావరకు, లబ్దిదారులకు భూమి, ఇల్లు, లేదా ఇల్లు మరమ్మత్తులు అవసరంగా వున్నాయి. ఇప్పటివరకు కేవలం ఇల్లు మాత్రమే అవసరమైన 4677 కుటుంబాలకు ఇళ్ళు నిర్మించుకోవడానికి ఆర్థిక తోడ్పాటు అందచేశారు, ఆ ఇళ్ళు కూడా పూర్తయ్యాయి. ఇంటి స్థలం కూడా లేని 2713 కుటుంబాలకు స్థలం కేటాయించడమే కాకుండా ఇల్లు కూడా నిర్మించి ఇచ్చారు. 5646 ఇళ్ళను పునరుద్ధరించారు. ఇల్లు మరమ్మత్తులు చేసుకోవాల్సిన కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించారు.

**ఐక్యరాజ్య సమితి 2030కల్లా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి) సాధించాలని నిర్దేశించుకుంది. ఆర్థికంగా, సామాజికంగా, పర్యావరణపరంగా సుస్థిరమైన అభివృద్ధి సాధిస్తూనే అన్ని రూపాల్లోని దారిద్ర్యాన్ని, లేమిని అంతం చేయాలన్నది మొట్టమొదటి లక్ష్యంగా వుంది. దారిద్ర్యాన్ని నిర్మూలించడానికి బదులుగా తీవ్ర పేదరికం లేకుండా చేసేందుకు కేరళ ఎందుకు దృష్టి కేంద్రీకరించింది?**

**సిఎం :** దారిద్ర్యాన్ని నిర్మూలించడంలో కేరళ బృహత్తర పురోగతి సాధించింది. 1973-74లో దారిద్ర్యం 59.8 శాతంగా వుండేది. 2019-21లో ఇది 0.55 శాతానికి పడిపోయింది. అందువల్ల తదుపరి దశలో, సమాజంలోని అత్యంత నిరుపేద వర్గాల అభ్యున్నతిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. దుర్భరమైన దారిద్ర్యం నుండి వారిని బయటపడవేసేందుకు వారికి సాయమందించే చర్యలు తీసుకుంది. ఇది, 'దుర్భర దారిద్ర్యాన్ని నిర్మూలించే' లక్ష్యం వైపునకు దారి తీసింది.

**మొత్తంగా దీన్ని సాధించడానికి చేపట్టిన సన్నాహాలు ఏంటి ?**

**సిఎం :** తీవ్ర పేదరిక నిర్మూలనకు సన్నాహాలను వివిధ దశల్లో చేపట్టాం. మొదటగా, భయంకరమైన దారిద్ర్యంలో బతుకుతున్న వారిని గుర్తించేందుకు స్థానిక స్వపరిపాలనా సంస్థలు సవివరమైన సర్వే నిర్వహించాయి. తొలి దశలో, ప్రతి కుటుంబం ఆహారం,ఆరోగ్యం, ఆదాయం, ఇంటి అవసరాలను అంచనా వేయడం ద్వారా స్థానికంగా సమాచార సేకరణను నిర్వహించారు. ఇక రెండో దశలో, ప్రతి ఒక్క కుటుంబం అవసరాలను ప్రాతిపదికగా చేసుకుని స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇక మూడో దశలో ప్రాజెక్టు అమలు. స్థానిక స్వపరిపాలనా సంస్థలు, కుటుంబశ్రీ, లైఫ్ మిషన్, ఆరోగ్య శాఖ, ఎన్‌జిఓలు, రెసిడెంట్ అసోసియేషన్లు సహా వివిధ ప్రభుత్వ విభాగాల మద్దతుతో స్థానిక స్వపరిపాలన శాఖ ఈ ప్రాజెక్టును అమలు చేస్తోంది. ఈ ప్రాజెక్టులో ప్రధాన భాగం నిధులు. ఈ ప్రాజెక్టు మిగతా 6లో

సంపాదకీయం


# నిరాశాజనకం

కేంద్ర గణాంకశాఖ తాజాగా విడుదల చేసిన సెప్టెంబర్ 30తో ముగిసిన తొలి అర్థ సంవత్సరానికి సంబంధించిన పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) వివరాలు తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయి. దీర్ఘకాల ధోరణులను అర్థం చేసుకునేందుకు పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు దోహదం చేస్తాయి. ఈ గణాంకాల్లో అన్నీ ప్రతికూలం కాకపోయినా దృష్టి సారించాల్సిన అంశాలు మాత్రం చాలా ఉన్నాయి. ఆర్థిక సంవత్సరంలోని తొలి అర్ధభాగం (ఏప్రిల్ - సెప్టెంబర్ 2025) గణాంకాలను పరిశీలిస్తే, గత ఐదు సంవత్సరాలలో కనిష్ఠ స్థాయిలోనే పరిశ్రమల వృద్ధి నమోదైంది. కేవలం 3.2 శాతం మాత్రమే వృద్ధి నమోదవ్వడం ఆర్థికపరంగా ఆందోళన కలిగించే అంశం. సూచీలో కొలవబడిన 23 ప్రధాన తయారీ ఉపరంగాలలో సగానికి పైగా (అంటే ఎక్కువ భాగం) 2025 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో క్షీణతను నమోదు చేశాయి. ముఖ్యంగా, కార్మిక ఆధారిత రంగాలు దుస్తులు, చర్మ ఉత్పత్తులు, రబ్బరు ఉత్పత్తులు, ప్లాస్టిక్ ఉత్పత్తులు ఇవన్నీ సెప్టెంబర్ 2025 త్రైమాసికంలో కుదించుకుపోయాయి. అమెరికా చేస్తున్న సుంకాల యుద్ధం ప్రభావంతో మన దేశం నుండి ఎగుమతుల తగ్గుదల పారిశ్రామిక ఉత్పత్తిపైనా ప్రతికూల ప్రభావం చూపిందని విదితమవుతోంది. భారతదేశ ఇంధన భద్రత, వ్యూహాత్మక ఖనిజ భద్రతను బలోపేతం చేయాలంటే గనుల రంగాన్ని పటిష్ఠం చేయడం అత్యవసరం. కానీ గత ఏడాది సెప్టెంబర్‌లో 0.2 శాతం పెరుగుదల నమోదుకాగా ఈ ఏడాది 0.45 శాతం కుంచించుకుపోవడం గమనార్హం. ఇదీ ప్రతికూల సూచనే కదా!

అయితే మొదటి త్రైమాసికంలో 2 శాతం మాత్రమే ఉన్న వృద్ధి, రెండో త్రైమాసికంలో 4.1 శాతానికి చేరింది కనుక క్రమంగా మెరుగు పడుతుందని కొందరు భావించవచ్చు. కానీ ఈ మొత్తం పరిణామంలో కొద్దిగా మెరుగు అనిపిస్తున్న అంశం తయారీ (మాన్యుఫాక్చరింగ్) రంగం. త్రైమాసిక ప్రాతిపదికన చూస్తే, జూలై-సెప్టెంబర్ 2025 త్రైమాసికంలో తయారీ రంగం 4.9 శాతం వృద్ధి సాధించింది. ఇది 2023 డిసెంబర్‌లో ముగిసిన త్రైమాసికం తర్వాత నమోదైన అత్యధిక వృద్ధి రేటు. అర్ధ వార్షిక ప్రాతిపదికన కూడా ఈ రంగం కొంత పుంజుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరపు తొలి అర్ధభాగంలో 3.8 శాతానికి తగ్గిన వృద్ధి, 2025-26 ఆర్థిక సంవత్సరపు తొలి అర్ధభాగంలో (ఏప్రిల్-సెప్టెంబర్ 2025) మళ్లీ 4.1 శాతానికి చేరింది. తయారీ రంగం బలంగా కనిపిస్తున్న ఈ వృద్ధిని కూడా సూటిగా అర్థం చేసుకోవడం సరికాదు. గణాంకాలు చూపుతున్నదేమిటంటే ఈ వృద్ధి విస్తృతంగా అన్ని రంగాలలో జరగడం లేదు. కొన్ని పరిమిత రంగాలలో మాత్రమే కేంద్రీకృతమై ఉంది. వృద్ధి సాధించిన రంగాలు కొయ్య (వుడ్) ఉత్పత్తులు, ఖనిజ ఉత్పత్తులు, ప్రాథమిక లోహాలు, మరియు తయారుచేసిన లోహ ఉత్పత్తులు ఇవన్నీ అధిక పెట్టుబడి ఆధారిత రంగాలు. ఈ ధోరణి మాత్రమే కొనసాగితే, ఉపాధి సృష్టిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే ఈ అంశంపై ప్రత్యేక దృష్టి అవసరం. ఇంకో ఆందోళనకరమైన విషయం ఏమిటంటే నాన్-డ్యూరబుల్ వినిమయ సరుకుల సూచీ వరుసగా ఆరు త్రైమాసికాలుగా క్షీణిస్తోంది. ఉప్పు, వంట నూనెలు వంటి నిత్యావసర సరుకులు కూడా ఇందులో ఉన్నాయంటే పరిస్థితి ఎలా దిగజారుతోందో బోధపడుతోంది. అంటే ఒకవైపు ఉపాధి అవకాశాలు తగ్గుతుండగా మరోవైపు వినిమయం తగ్గిపోతోంది. ఇదే క్రమం కొనసాగితే...?

ప్రజల కొనుగోలు శక్తి లేక సరుకులకు డిమాండ్ మందగించడంతో వస్తూత్పత్తి క్రమంగా క్షీణిస్తోంది. అది మరింతగా ఉపాధిని దెబ్బ తీస్తుంది కనుక ఆర్థిక సంక్షోభం నానాటికీ తీవ్రమౌతోంది. పాలకులు అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల దుష్ఫలితమిది. సాక్షాత్తూ కేంద్రప్రభుత్వ మంత్రిత్వ శాఖలు విడుదల చేసిన గణాంకాల అద్దంలో చూసుకొనియైనా ఏలినవారు తమ తప్పు తెలుసుకొని దిద్దుకోవాలి. ఈ స్థితిని మార్చడానికి నిజమైన పరిష్కారం ప్రజల ఆదాయాలను పెంచడం మరియు యువతకు కొత్త ఉద్యోగాలను సృష్టించడం మాత్రమే. ఆ దిశగా ప్రభుత్వ విధానాలు మార్చేందుకు ప్రజా ఉద్యమాలు పెంపొందాలి.

మహనీయుల మాట



నువ్వు ధైర్యంగా ఒక అడుగు ముందుకేస్తే విజయం పది అడుగులు ముందుకొస్తుంది.

**- రవీంద్రనాథ్ టాగూర్,**
**విశ్వకవి.**

Rabindranath Tagore

---

వ్యాఖ్య

# అమెరికా తప్ప అన్యథా లేని విధానమా?


> **ట్రంప్ రెండవసారి అధికారం చేపట్టినప్పుడు మోడీ తానేదో ఆయనకు అత్యంత సన్నిహితుడనే భావనను సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నించారు. ఆయన గాఢ కౌగిలింతలు దౌత్యశక్తికి వనరుగా మోతమోగింది. వాషింగ్టన్‌లోని అనేకమంది విదేశాంగ విధానకర్తలు అమెరికాకు వ్యతిరేకంగా వుండటం ప్రమాదకరనీ, ఈ ఉత్తుత్తి కౌగిలింతలే ప్రాణాంతకంగా పరిణమించవచ్చునని చెప్పారు. అయితే మోడీ ప్రభుత్వం, ప్రధాన మంత్రి కూడా లెక్కలేనట్టు చెలరేగిపోయారు. దాంతో ట్రంప్ ప్రస్తుత భారత దేశ ప్రభుత్వాన్ని నిర్విరామంగా ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టాడు. రష్యన్ చమురు కొనుగోలు చేస్తున్నారనే పేరుతో ట్రంప్ తన టారిఫ్ టెర్రరిజంలో భాగంగా యాభై శాతం అదనపు శుంకాలు విధించారు. పశ్చిమాసియా, అమెరికాల నుంచి కొంటున్నదానికన్నా చాలా తక్కువకు వస్తున్నందున భారత్ ఈ చమురును కొనుగోలు చేసింది. చివరకు మోడీ భారత్ వల్లనే రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నదని ఆరోపించే వరకూ వెళ్లారు.**

శరవేగంగా మారిపోతున్న ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితిలో భారత ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడుతున్నట్టు కనిపిస్తుంది. ముఖ్యంగా విదేశాంగ విధానంలోనూ దౌత్యనీతిలోనూ ఈ చిక్కులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతమున్న పరిస్థితులలో దౌత్యనీతి, విదేశాంగ విధానం అంతకంతకూ ఆర్థిక వ్యవస్థతో ముడిపడిపోవడం జరుగుతున్నది. భారత దేశంలోనైతే ప్రభుత్వం, దాని కార్పొరేట్ మద్దతుదారులు, కార్పొరేట్ బడా మీడియా దీని అల్లిక చేస్తున్నారు. అంతులేనంత బిగ్గరగా దాన్ని వినిపిస్తున్నారు. ఈ విధంగా ఈ మొత్తం ప్రయత్నాలు తమ అల్లికలకే బందీలైనట్టు కనిపిస్తుంది.

పహల్గాం టెర్రరిస్టు దాడి తర్వాత పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణ సమయంలో ఇది అత్యంత ప్రస్ఫుటమైంది. భారత దేశ స్పందన, తర్వాత ఉపసంహారణలను మరెవరో గాక స్వయంగా డోనాల్డ్ ట్రంప్ హైజాక్ చేశారు. కాల్పుల విరమణ ప్రకటనకు ముందే అమెరికా అధ్యక్షుడు ఇలా జరగబోతున్నదని ప్రకటించారు. అంతటితో ఆగక పుండు మీద కారం చల్లినట్టుగా ట్రంప్ ఈ శతృత్వాలను సమాప్తం చేసిన ఘనత తనదేనన్నారు. అమెరికాతో భారత దేశ వాణిజ్య సమస్యలపై తను బెదిరించినందునే ఈ కాల్పుల విరమణ సాధించగలిగానని కూడా ట్రంప్ చెప్పుకున్నారు. ఈ ప్రకటనల వల్ల మోడీ సర్కారు దేశంలో తీవ్రమైన ఒత్తిడి తెచ్చిన మాట నిజమే. ఎందుకంటే ద్వైపాక్షిక వివాదాల పరిష్కారంలో మరీ ముఖ్యంగా పాకిస్తాన్‌కు సంబంధించి ఎలాంటి మూడో పక్షానికి చోటు వుండరాదన్నది దీర్ఘ కాలంగా భారత దేశం అనుసరిస్తున్న విధానం. ఆ మూల సూత్రమే ఇప్పుడు దెబ్బ తినిందన్న భావన ఇందుకు కారణమైంది.

**ట్రంప్ పరిష్వంగంలో...**

ఇది మోడీ ప్రభుత్వానికి ప్రత్యేకంగా ఇబ్బందికరం కావడానికి కారణం కూడా వుంది. ట్రంప్ రెండవసారి అధికారం చేపట్టినప్పుడు మోడీ తానేదో ఆయనకు అత్యంత సన్నిహితుడనే భావనను సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నించారు. ఆయన గాఢ కౌగిలింతలు దౌత్యశక్తికి వనరుగా మోతమోగింది. వాషింగ్టన్‌లోని అనేకమంది విదేశాంగ విధానకర్తలు అమెరికాకు వ్యతిరేకంగా వుండటం ప్రమాదకరనీ, ఈ ఉత్తుత్తి కౌగిలింతలే ప్రాణాంతకంగా




PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

పరిణమించవచ్చునని చెప్పారు. అయితే మోడీ ప్రభుత్వం, ప్రధాన మంత్రి కూడా లెక్కలేనట్టు చెలరేగిపోయారు. దాంతో ట్రంప్ ప్రస్తుత భారత దేశ ప్రభుత్వాన్ని నిర్విరామంగా ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టాడు. రష్యన్ చమురు కొనుగోలు చేస్తున్నారనే పేరుతో ట్రంప్ తన టారిఫ్ టెర్రరిజంలో భాగంగా యాభై శాతం అదనపు టారిఫ్ విధించారు. పశ్చిమాసియా, అమెరికాల నుంచి కొంటున్నదానికన్నా చాలా తక్కువకు వస్తున్నందున భారత్ ఈ చమురును కొనుగోలు చేసింది. చివరకు మోడీ భారత్ వల్లనే రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నదని ఆరోపించే వరకూ వెళ్లారు. ఎందుకంటే రష్యన్ చమురు కొనుగోళ్ల ద్వారా భారత్ ఆ దేశ యుద్ధ యంత్రాంగానికి నిధులు సమకూర్చిందనేది ఆయన వాదన.

ట్రంప్ సర్కారు ప్రారంభించిన టారిఫ్ టెర్రరిజం ఆర్థికాంశాలను దాటి చాలా దూరం వెళ్లిందనేది బాగా స్పష్టం. నిజానికి అది భౌగోళిక రాజకీయ లక్ష్యాలు సాధించుకోవడం కోసం టారిఫ్‌లను ఆయుధాలుగా మార్చుకోవడమే. బ్రెజిల్‌పై అదనంగా యాభై శాతం టారిఫ్‌లు విధించడం మాజీ మితవాద అధ్యక్షుడు జైర్ బోల్సనారో పై చట్టపరమైన కేసులు నడిపించడం కోసమే. రష్యన్ భద్రతకు భంగం కలిగించేందుకు యూరప్ చేసిన ప్రయత్నాల ఫలితంగానే ఉక్రెయిన్ యుద్ధం వచ్చిందనేది కూడా ఇప్పటికే బయటికొచ్చింది. ఇందుకు అమెరికా నాటోల పూర్తి మద్దతుతోనే ఇది జరిగింది.

**బ్రిక్స్ విస్తరణ, నూతన మార్గాలు**

ఈ విధంగా ట్రంప్ నాయకత్వంలో అమెరికా చేపట్టిన ఏకపక్ష దురాక్రమణ పోకడల ఫలితంగానే బ్రిక్స్ మరింత సంఘటితం కావలసిన పరిస్థితి ఏర్పడింది. అదిప్పుడు బ్రిక్స్ ప్లస్‌గా ఇంకా విస్తరించింది. బ్రిక్స్ విస్తరణతో వాస్తవానికి పేద దేశాల మధ్య కారిడార్లు, మార్కెట్లు ఏర్పడి అంతర్జాతీయ వాణిజ్యంలో మార్పులు తెస్తున్నాయి. బ్రిక్స్ దేశాల మధ్య కరెన్సీ వైవిధ్యం వల్ల రవాణాలో సంక్లిష్టత ఏర్పడి షిప్పింగ్ కంపెనీలు ఈ క్రమంలో కేవలం డాలర్ అనే పరిధిని దాటి బహుళ విధాలైన కరెన్సీతో కాంట్రాక్టులు, చెల్లింపులను నిర్వహించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆఫ్రికా లాటిన్ అమెరికాలోనూ పశ్చిమాసియాలోనూ సరఫరా గొలుసు కొత్త రూపం తీసుకుంటున్నది. అమెరికా పట్టును సవాలు చేసే విధంగా కొత్త వాణిజ్య మార్గాలకు దారితీస్తున్నది. బ్రిక్స్ విస్తరణ కేవలం భౌగోళిక రాజకీయ పరిణామం మాత్రమే కాదు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ఏకధృవ నేతృత్వానికి సవాలు విసిరే సామర్థ్యం దానికి వుంది. ప్రస్తుతం అంతర్జాతీయ ఉత్పత్తిలో జి7 వాటా 28 శాతానికి తగ్గిపోగా బ్రిక్స్ వాటా 35 శాతానికి పెరుగుతున్నది.

తాజాగా రెండు రష్యన్ చమురు కంపెనీల మీద ఆంక్షలను విధించడం పరిస్థితిని తీవ్రతరం చేసింది. తన టెలిఫోన్ సంభాషణలో ప్రధాని మోడీ రష్యా నుంచి భారత్ చమురు కొనబోదని నిర్ధారించారని డోనాల్డ్ ట్రంప్ చెబుతున్న దానిపై భారత పాలక వ్యవస్థ ఎలాంటి నిర్దిష్ట వ్యాఖ్య చేయలేదు. కానీ ప్రభుత్వం తరపున కొంతమంది అజ్ఞాత అధికారులు, అలాగే అంబానీ రిలయన్స్‌కు సంబంధించిన వారు మాట్లాడిన దాన్నిబట్టి చాలా ఒత్తిడిలో వున్నట్టు కనిపిస్తున్నది. ముడిచమురు సరఫరాలతో సంబంధం వున్న ప్రైవేటు శుద్ధి కర్మాగారాలు, అలాగే ప్రభుత్వ రంగ కంపెనీలు, మొత్తం పెట్రోలియం ఉత్పత్తుల చిల్లర ధరల వ్యవస్థలపై ఈ ఒత్తిడి వుంటున్నది. వ్యవసాయ రంగం ప్రత్యేకించి ఆహారధాన్యాలు, పాడి ఉత్పత్తుల రంగాలకు కూడా ఈ వేడి సోకుతున్నది.

చివరగా జరిగేదేంటో ఈ దశలో మేము నిర్దిష్టంగా చెప్పలేము. అయితే అమెరికా, చైనా లు రెండూ ఒక అంతిమ చట్రంలో కుదుర్చుకున్నాయి. అమెరికా వాణిజ్య కార్యదర్శి స్కాట్ బిసెంట్ అదనంగా మరో రెండు శాతం టారిఫ్‌లు విధించే ప్రసక్తి ఎగిరిపోయిందని చెప్పారు. అమెరికా, చైనా సంప్రదింపులు ట్రంప్, సీ జిన్‌పింగ్ శిఖరాగ్ర సమావేశానికి సన్నాహంగా జరిగాయనీ, ఉభయ తారక ఫలితాలు పరస్పర ప్రయోజనాల కోసం చూడవచ్చునని చైనా ఉప ప్రధాని హీ లిఫెంగ్ కూడా తెలిపారు.

**చైనా అనుభవం-భారత్‌కు పాఠం**

వాణిజ్యంలో టారిఫ్‌ల విషయంలో అమెరికా ఆధిపత్య దురాక్రమణను ఎదుర్కోవడానికి చైనా ఎంత పకడ్బందీగా సమాయత్తమైందనే దానిపై ప్రధాన చర్చ కేంద్రీకృతమైంది. తన పరాధీనతను తగ్గించుకోవడం, స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసుకోవడం కోసం చైనా వ్యవహరించడం వాస్తవం. అరుదైన మట్టి నమూనాల ఉత్పత్తిలోనూ అంతర్జాతీయ రక్షణ సెమీ కండక్టర్ పరికరాల తయారీలోనూ చైనా సాధించిన ఆశ్చర్యకరమైన విజయాలు బాగా తెలిసినవే. జీవన గతిని మార్చే కీలక సాంకేతిక రంగాలలో సాధించిన అమోఘ ప్రగతి వాస్తవమే తప్ప కల్పన కాదు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో చైనా వ్యూహాత్మక స్వతంత్రాన్ని కాపాడుకోవడం కోసం వారు దీర్ఘకాలిక దార్శనికతతో ఎంతో పటిష్ఠంగా సన్నద్ధమయ్యారు. అమెరికా కజ్జాకోరు పోకడలు, ఏకపక్ష ధోరణుల వల్లనే బ్రిక్స్ ప్రక్రియ సంఘటితమవుతున్నది.

అందువల్ల భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం ఎలాగూ భారత ప్రజలకు చాలా వ్యతిరేకంగానే తయారవుతుందనేది స్పష్టం. అయినా ఆ ఒప్పందం అంతిమ ఫలితం కోసం నిరీక్షిస్తూనే మనం, అలాగే దేశ సార్వభౌమత్వం కాపాడుకోవాలని కోరే వారందరూ ట్రంప్ టారిఫ్ టెర్రరిజాన్ని, ఏకపక్ష ఒత్తిళ్లతో పాటు మన ప్రభుత్వ లొంగుబాటును కూడా వ్యతిరేకించాలి. ప్రధానమంత్రి వ్యక్తిగత దౌత్యశైలికి ప్రభుత్వం ఎంతగానో బలవుతున్నది. దౌత్య రంగంలో విదేశీ సంబంధాలలో ఈ వ్యక్తిగత లక్షణాలు పెద్ద ప్రభావం చూపిస్తాయనే భ్రమ పెట్టడంలో జరుగుతున్నది. మన గుడ్లన్నీ ఒకే అమెరికా బుట్టలో పెట్టడం వల్ల మనం కుప్పకూలిపోతున్నాం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ బహుళ ధృవ రూపం తీసుకుంటున్న సన్నివేశంలో ఇది ఏ మాత్రం పొసగని ఒక అసందర్భ వ్యవహారం.

> **భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం ఎలాగూ భారత ప్రజలకు చాలా వ్యతిరేకంగానే తయారవుతుందనేది స్పష్టం. అయినా ఆ ఒప్పందం అంతిమ ఫలితం కోసం నిరీక్షిస్తూనే మనం, అలాగే దేశ సార్వభౌమత్వం కాపాడుకోవాలని కోరే వారందరూ ట్రంప్ టారిఫ్ టెర్రరిజాన్ని, ఏకపక్ష ఒత్తిళ్లతో పాటు మన ప్రభుత్వ లొంగుబాటును కూడా వ్యతిరేకించాలి. ప్రధానమంత్రి వ్యక్తిగత దౌత్యశైలికి ప్రభుత్వం ఎంతగానో బలవుతున్నది. దౌత్య రంగంలో విదేశీ సంబంధాలలో ఈ వ్యక్తిగత లక్షణాలు పెద్ద ప్రభావం చూపిస్తాయనే భ్రమ పెట్టడంలో జరుగుతున్నది. మన గుడ్లన్నీ ఒకే అమెరికా బుట్టలో పెట్టడం వల్ల మనం కుప్పకూలిపోతున్నాం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ బహుళ ధృవ రూపం తీసుకుంటున్న సన్నివేశంలో ఇది ఏ మాత్రం పొసగని ఒక అసందర్భ వ్యవహారం.**

**(అక్టోబర్ 29 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)**

★

---

విశ్లేషణ

# గూగుల్ డేటా సెంటర్-ప్రచార హోరు-వాస్తవాలు



**డా॥ బి. గంగారావు**



విశాఖలో రూ.87,520 కోట్ల పెట్టుబడితో వెయ్యి మెగావాట్ల సామర్థ్యంగల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్‌తో చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ డేటా సెంటర్‌లో అదానీ, ఎయిర్‌టెల్ కూడా భాగస్వాములుగా ఉంటారని గూగుల్ ప్రకటించింది. గూగుల్ రాకతో అంతర్జాతీయ ప్రైవేట్ పెట్టుబడుల చిత్రపటంలో విశాఖపట్నం చోటు సంపాదించిందని, దీంతో విదేశీ ఐటీ దిగ్గజాలు తరలి వచ్చి బలమైన ఐటీ ఎకో సిస్టమ్ విశాఖలో ఏర్పడి అతి తక్కువ కాలంలో ఐటీతో పాటు కృత్రిమ మేధస్సు హబ్‌గా ఆంధ్ర రాష్ట్రం మారుతుందని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు ఐటీ రంగంలో వస్తాయని చెబుతున్నది. ఇది తీవ్ర నిరాశలో ఉన్న నిరుద్యోగ యువతలో ఆశలు రేకెత్తిస్తున్నది.

విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌ను రప్పించటం కూటమి ప్రభుత్వ ఘనకార్యంగా కూటమి పార్టీలు చెప్పుకుంటున్నాయి. కాదు మా పాలనలోనే డేటా సెంటర్‌కి పునాది పడిందని వైసిపి వాదిస్తున్నది. ఈ వాదప్రతివాదాల మధ్య గూగుల్ వచ్చిన నేపథ్యాన్ని ఈ పార్టీలు మరుగు పరుస్తున్నాయి. గత కొంత కాలంగా అమెరికాలో డేటా సెంటర్లకు వ్యతిరేకంగా అక్కడి నివాసితులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచంలో ఉన్న డేటా సెంటర్ల సామర్థ్యంలో 50 శాతానికి పైగా అమెరికాలోనే ఉన్నాయి. ఈ డేటా సెంటర్ల వల్ల ఆ ప్రాంత నివాసితులకు మంచినీరు, విద్యుత్ కొరత ఏర్పడటం, వీటి చార్జీలు పెరగడం, ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రత పెరగడంతో పాటు ఇతర పర్యావరణ సమస్యలు ఉత్పన్నం కావటంతో అక్కడి ప్రజలు ఆందోళనబాట పట్టారు. ఈ నిరసనల వల్ల సుమారు 64 బిలియన్ డాలర్లు విలువగల డేటా సెంటర్ల పెట్టుబడులు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల రద్దయ్యాయి. గూగుల్ కొత్తగా పెట్టబోయే డేటా సెంటర్లు కూడా కొన్ని ఆగిపోగా, కొన్నింటిని రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఉదాహరణకు గత సెప్టెంబర్‌లో ఇండియానాపోలిస్ కౌంటీలో గూగుల్ ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ పెట్టాలని అక్కడి మెట్రోపాలిటన్ అభివృద్ధి రీజియన్ నుండి అనుమతులు పొందింది. 468 ఎకరాల భూమిని కూడా కేటాయించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు ఆందోళనకు దిగారు. ఫలితంగా సెప్టెంబర్ 22వ తేదీన ఇండియానాపోలిస్ మున్సిపల్ కౌన్సిల్ గూగుల్ ఏఐ డేటా సెంటర్‌ను రద్దు చేసింది. దీంతో ఆఘమేఘాల మీద అదేరోజున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ లెటర్ రాసింది. ఆ తరువాత అన్నీ చకచకా జరిగిపోయాయి.

ఈ నేపథ్యంలోనే భారత దేశంలో ఏఐ డేటా సెంటర్లు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో విశాఖలో ఏర్పాటు కాబోయే గూగుల్ ఏఐ డేటా సెంటర్‌తో మొత్తం ఆంధ్ర రాష్ట్రం ఐటీ రంగానికి, ఏఐ కి గేట్‌వే గా మారుతుందనే కూటమి ప్రభుత్వ ప్రచారంలో వాస్తవికత కనిపించడంలేదు.

> **విశాఖలో వచ్చే ఏఐ డేటా సెంటర్ వల్ల 5 వేలకు మించి ఉద్యోగాలు రావని స్పష్టమౌతున్నది. ఇదే ప్రపంచ అనుభవం కూడా. విశాఖలో వస్తున్నది ఏఐ హబ్‌తో కూడిన డేటా సెంటర్ కనుక లక్షల్లో ఉద్యోగాలు సృష్టించబడతాయని ప్రభుత్వ వాదన. అలాగే గూగుల్ అంతర్జాతీయ అతి పెద్ద టెక్ కంపెనీ కనుక శక్తి వంతమైన ఐటీ, ఏఐ ఎకో సిస్టమ్ ఏర్పడుతుందని ప్రచారం. ప్రభుత్వమే కాదు, కొంతమంది మధ్యతరగతి వర్గంలో కూడా ఈ భావన ఉంది. ఆ విధంగా వస్తే మంచిదే. రాష్ట్రానికి ఎంతో ఉపయోగం కూడా జరుగుతుంది.**

గూగుల్ ఉద్యోగాల సృష్టిపై పెద్ద చర్చ నడుస్తున్నది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్.టి.పి.ఐ) ప్రకారం 2025 మార్చి నాటికి దేశంలో 67 ప్రధాన నగరాల్లో మాత్రమే ఐటీ, ఐటీ సంబంధిత కార్యకలాపాలు జరుగుతున్నాయి. మొత్తం ఈ నగరాల్లో ఐటీ సేవల ద్వారా 2024-25లో 283 బిలియన్ డాలర్లు ఆదాయం రాగా ఇందులో 224 బిలియన్ డాలర్లు (82 శాతం) ఎగుమతుల ద్వారా సమకూరింది. 94 శాతం సాఫ్ట్‌వేర్ ఎగుమతులు లేదా ఐటీ రంగ మొత్తం కార్యకలాపాలకు కేవలం ముంబయి, పూనే, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా వంటి 7 మెట్రోపాలిటన్ నగరాలే ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. డేటా సెంటర్లు లేకపోయినా ఈ నగరాలు ఐటీ కి కేంద్ర నగరాలుగా మారాయి. దేశంలో ఐటీ సేవల్లో ప్రస్తుతం పనిచేస్తున్న 56 లక్షల ఉద్యోగుల్లో కూడా 95 శాతానికి పైగా ఈ నగరాల్లోన్నే ఉన్నారు. మిగిలిన టైర్ 2 టైర్ 3 నగరాల్లో కేవలం 2.90 లక్షలు మాత్రమే ఉన్నారు.

నేడు ప్రపంచంలో ముఖ్యంగా పెట్టుబడిదారీ దేశాల్లో జరుగుతున్న పరిణామాలు చూస్తే భవిష్యత్తులో కూడా టైర్ 2,3 నగరాలకు ఐటీ కార్యకలాపాలు పెద్దఎత్తున విస్తరణ అయ్యేందుకు అవకాశాలు లేవు. ఎందుకంటే మన ఐటీ ఎగుమతుల్లో 65 శాతం అమెరికాకు వెళుతుండగా ఆ తరువాత బ్రిటన్ (17 శాతం), యూరోప్ (11 శాతం), ఆసియా పసిఫిక్ (8 శాతం) ప్రాంతానికి ఎగుమతి అవుతున్నాయి. అమెరికాలో నిరుద్యోగం పెరగడం, ఆర్థిక సంక్షోభం నుండి బయటపడలేక పోవడంతో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం నేడు తీవ్ర రక్షణవాద చర్యలకు పాల్పడుతున్నది. ముఖ్యంగా అమెరికా ఆదేశంలోని ఐటీ, ఇతర వాణిజ్య సంస్థలు అమెరికా వెలుపల దేశాల్లో ఔట్ సోర్సింగ్ చేసిన ఉద్యోగులపై 25 శాతం పన్ను విధించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. అందుకు హాల్టింగ్ ఇంటర్నేషనల్ రీలక్సేషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ (హైర్ యాక్ట్) బిల్లును తీసుకు రావటానికి రిపబ్లికన్లు అమెరికా సెనేట్‌లో ప్రయత్నం కూడా చేశారు. ఈ చట్టం వస్తే అమెరికా కంపెనీలు భారీగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఖర్చు తగ్గించుకోవలసి ఉంటుంది. ఈ చర్యలు భారత ఐటీ రంగాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తాయి. ఈ రంగంలో మన దేశంలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తొలగింపులకు గురౌతారు. కొత్తగా ఐటీ అవుట్‌సోర్సింగ్ ఒప్పందాలు కూడా తగ్గిపోతాయి.

విశాఖలో వచ్చే ఏఐ డేటా సెంటర్ వల్ల 5 వేలకు మించి ఉద్యోగాలు రావని స్పష్టమౌతున్నది. ఇదే ప్రపంచ అనుభవం కూడా. విశాఖలో వస్తున్నది ఏఐ హబ్‌తో కూడిన డేటా సెంటర్ కనుక లక్షల్లో ఉద్యోగాలు సృష్టించబడతాయని ప్రభుత్వ వాదన. అలాగే గూగుల్ అంతర్జాతీయ అతి పెద్ద టెక్ కంపెనీ కనుక శక్తివంతమైన ఐటీ, ఏఐ ఎకో సిస్టమ్ ఏర్పడుతుందని ప్రచారం. ప్రభుత్వమే కాదు కొంతమంది మధ్యతరగతి వర్గంలో కూడా ఈ భావన ఉంది. ఆ విధంగా వస్తే మంచిదే. రాష్ట్రానికి ఎంతో ఉపయోగం కూడా జరుగుతుంది.

నేడు కృత్రిమ మేధస్సు టెక్నాలజీ ప్రవేశంతో ఐటీ రంగం అతలాకుతలం అవుతున్నది. ఐటీ దిగ్గజాలు భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఐటీ రంగంలోనే కాదు భవిష్యత్తులో ఇతర సేవా రంగాలు, పారిశ్రామిక రంగలో కూడా వచ్చే ఉద్యోగాలు కన్నా తొలగించే ఉద్యోగాలే ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఏఐ నైజమే ఇది. పెట్టుబడిదారులు ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకొని ఉత్పత్తి వ్యయంలో కార్మికుల వేతనాలపై పెట్టే వ్యయ నిష్పత్తిని బాగా తగ్గించుకొని లాభాలు పెంచుకుంటున్నారు. దీనివల్ల ఉత్పత్తి కార్యకలాపాలు పెరిగినా అంతిమంగా ఆర్థిక వ్యవస్థలో వినిమయం తగ్గి పెద్ద ఎత్తున నిరుద్యోగం పెరుగుతుంది. కనుక ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లు 5 లక్షల ఐటీ ఉద్యోగాలు ఈ ఐదేళ్లలో వస్తాయనేది ఆచరణలో సాధ్యమయ్యేది కాదు. మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్ వంటి టెక్ సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభిస్తాయి అని పాలకులు చెబుతున్నారు. భూములు కూడా ఎకరా 99 పైసలు చొప్పున కేటాయించారు. ఇప్పటికీ ఆ సంస్థల నుండి చర్యలు కనిపించడం లేదు.

ఇక గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు కీలకంగా అవసరమయ్యే విద్యుత్, మంచి నీటి సమస్య ముందుకొచ్చింది. ఈ సమస్య చాలా పెద్దది. 1000 మెగావాట్ల విద్యుత్‌ను అంతరాయం లేకుండా సరఫరా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. హైడ్రో, సౌర వంటి పునరుత్పాదక విద్యుత్ శక్తిని సరఫరా చేయాలని ఒప్పందంలో పేర్కొన్నారు. 1000 మెగావాట్లు అంటే నెలకి సగటున 200 యూనిట్లు వినియోగించే 5 లక్షల ఇళ్ల విద్యుత్ వినియోగానికి సమానం. అంటే సుమారుగా విశాఖ నగరంలో నివాస గృహాలకు సరఫరా చేస్తున్న విద్యుత్‌కు సమానం. ఈ విద్యుత్ ఎక్కడ నుండి సరఫరా చేస్తారో బయటికి చెప్పటంలేదు.

ఇక్కడ ఉష్ణోగ్రత ఎక్కువ కాబట్టి రోజుకి సుమారు 50 మిలియన్ గ్యాలన్ల (ఎం.జి.డి) నీరు డేటా సెంటర్‌కి అవసరం అంటున్నారు. ఇది విశాఖ నగరంలోని 25 లక్షల మది ప్రజలు వాడుతున్న నీటికి సమానం. ప్రస్తుతం రెండే మార్గాలు ఉన్నాయి. గూగుల్ నిర్మాణం పూర్తి చేసేలోపు అనగా ఈ మూడేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తయి ఎడమ కాలువ ద్వారా విశాఖకు మంచినీరు సరఫరా అయితే ఇబ్బంది ఉండదు. అది పూర్తి కాకపోతే రైతుల సాగునీటి రిజర్వాయర్లైన తాటిపూడి, రైవాడ వంటి అనేక వాటి నుండి రైతులకు అన్యాయం చేసి గూగుల్‌కి నీటి సరఫరా చేయాల్సి ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా గూగుల్‌కి రూ 22 వేల కోట్లు రాయితీలు ఇస్తున్నది. ఇందులో 480 ఎకరాల భూ సబ్సిడీ లేదు. మార్కెట్ రేటు ప్రకారం అదో 3 వేల కోట్లు ఉంటుంది. అంతేకాక విద్యుత్ సరఫరాకు ప్రత్యేక హై టెన్షన్ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు, నీటి సరఫరా లైన్లు, మంచినీటి నిరాటక సరఫరాకు అవసరమైన భారీ రిజర్వాయర్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ.10 వేల కోట్లు పైనే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొత్తంగా చూస్తే పైకి రూ.22 వేల కోట్లు రాయితీలుగా కనిపిస్తున్నా మొత్తం రూ.35 వేల కోట్లు పైగానే ప్రభుత్వం భరించాల్సి వస్తుంది. ఇదంతా ప్రజలు చెల్లించే పన్నుల నుండే గూగుల్‌కి ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. డేటా సెంటర్‌ను ఏకంగా విశాఖ జనావాసాల మధ్య పెట్టటానికి నిర్ణయించారు. దీనివల్ల ఆ చుట్టూ వేడి వాయువులు విస్తరించడం, ఇతర పర్యావరణ సమస్యలు కూడా తలెత్తతానికి అవకాశం ఉంది.

గూగుల్ నుండి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం పెరిగే చర్యలు కూడా ఒప్పందంలో పేర్కొనలేదు. పైపెచ్చు నీటి సరఫరాలో 25 శాతం రాయితీ ప్రకటించారు. అంటే కేవలం కిలో లీటర్ 15 రూపాయలకే సరఫరా చేస్తుంది. ఇప్పుడు పరిశ్రమలకు జి.వి.ఎం.సి 70 రూపాయలకు, అపార్ట్‌మెంట్ వాసులకు 30 కిలోలీటర్లు దాటితే కిలో లీటర్ 30 రూపాయలకు సరఫరా చేస్తున్నది. ఇంత భారీ తగ్గింపు వల్ల జి.వి.ఎం.సి ఏడాదికి రూ.350 కోట్లు పైనే నష్టపోతుంది. విశాఖ నగర వాసులకు ఉచిత డేటా, ఉచిత హాట్ స్పాట్‌లు వంటి సదుపాయాలు కూడా గూగుల్ నుండి ప్రభుత్వం రాబట్టే ప్రయత్నం చేయలేదు.

స్థూలంగా గూగుల్ ఏఐ డేటా సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఐటీతో ఏఐ హబ్‌గా మారుతుందో లేదోగానీ గూగుల్‌కు మాత్రం తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవటానికి విశాఖ నగరం అంతర్జాతీయ సబ్ సీ గేట్‌వే గా ఉపయోగపడుతుంది. అంతేగాక భారత దేశ తూర్పు తీరం చుట్టూ బహుళ సముద్ర గర్భ కేబుల్ ల్యాండింగ్‌లతో అనుసంధానం చేసి దేశంలో కూడా తన మార్కెట్‌ను పెంచుకొని లాభపడుతుంది.

**/ వ్యాసకర్త సెల్ : 9490098792 /**

**మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :**
editpageps @ gmail.com

## రాష్ట్రానికి ఐదు 'దక్షతా పదక్' పురస్కారాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ పూర్వ ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ అందజేసే 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్' పురస్కారాల్లో ఐదు అవార్డులు ఆంధ్రప్రదేశ్‌కు లభించాయి. తెలంగాణకు నాలుగు పురస్కారాలు దక్కాయి. ప్రత్యేక ఆపరేషన్లు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్ తదితర విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఈ పురస్కారాలను అందజేస్తారు. దేశ వ్యాప్తంగా మొత్తం దాదాపు 1,466 మంది పోలీసు సిబ్బందికి అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు హోంశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇందులో ఏపి నుంచి ఐదుగురికి, తెలంగాణ నుంచి నలుగురు పోలీసులు అవార్డులను అందుకోనున్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి

ఇన్వెస్టిగేషన్ విభాగంలో అద్నాన్ నయీం అస్మి (ఎస్‌పి), వి భీమారావు (అడిషనల్ ఎస్‌పి), ఆర్‌జి జయసూర్య (డిప్యూటీ ఎస్‌పి), మహ్మద్ నజిరుల్లా (సబ్ ఇన్‌స్పెక్టర్), ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో ఫణి భూషణ్ బి (అసిస్టెంట్ డైరెక్టర్)కు దక్షతా పురస్కారాలు లభించాయి. తెలంగాణ నుంచి ఇన్‌స్పెక్టర్లు నగరి చంద్రశేఖర్, ఉపేందర్‌రావు జల, తిరుపతి వాసాల, హెడ్ కానిస్టేబుల్ ఆకెపోగు లక్ష్మణరావులు అవార్డులను అందుకోనున్నారు.

# తమిళనాడుపై విషం కక్కిన మోడీ

- బీహార్ వలస కార్మికులపై డిఎంకె వేధింపులకు పాల్పడుతోందని అభాండాలు
- తీవ్రంగా ఖండించిన ఎంకె స్టాలిన్
- శత్రుత్వాన్ని రెచ్చగొట్టే బదులు సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు
- ప్రధాని వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్, సిపిఎం




ముజఫర్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

**న్యూఢిల్లీ :** తమిళనాడుపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోమారు విషం కక్కారు. బీహార్‌కు చెందిన వలస కార్మికులపై తమిళనాడులోని అధికార డిఎంకె వేధింపులకు పాల్పడుతోందని ఆయన విద్వేష వ్యాఖ్యలు చేశారు. ఇరు ప్రాంతాల ప్రజల మధ్య చిచ్చురాజేసేందుకు ప్రయత్నించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మోడీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మహాగట్‌బంధన్‌కు చెందిన పార్టీలు బీహార్‌కు చెందిన వలస కార్మికులపై వివక్షకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి బీహార్ ప్రజలను తమ రాష్ట్రంలోకి అనుమతించమని బహిరంగంగా ప్రకటించారని మోడీ చెప్పారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ నాయకులు కూడా బీహార్ ప్రజలను అవమానించారని అన్నారు. తమిళనాడులోని డిఎంకె కూడా ఇదే చేస్తోందని వ్యాఖ్యానించారు. బీహార్ నుంచి వచ్చిన వలస కార్మికులను డిఎంకె వేధిస్తుందని అంటూ విష బీజాలను నాటడానికి మోడీ ప్రయత్నించారు. బీహారీలను అవమానించి, వేధించిన నాయకులను ఇప్పుడు మహాగట్‌బంధన్ తరుపున ప్రచారానికి తీసుకొస్తున్నారని మోడీ అన్నారు. ప్రధాని మోడీ వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. ప్రజల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టే బదులు, దేశ సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో స్టాలిన్ పోస్టు చేశారు. అలాగే మోడీ ప్రసంగాన్ని కూడా స్టాలిన్ షేర్ చేశారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే ప్రధాని ఆ వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. విద్వేషాగ్ని రాజేసి ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. ఎన్నికల కోసం తమిళ ప్రజలపై బిజెపి "దురుద్దేశం" ప్రదర్శిస్తోందని, ఇలాంటి 'చౌకబారు రాజకీయాలు' చేయడం మోడీ మానుకోవాలన్నారు. ఈ దేశ ప్రజలందరికీ ప్రధానమంత్రిగా గౌరవనీయమైన స్థానంలో ఉన్న మోడీ.. ఇలాంటి వ్యాఖ్యల ద్వారా తన బాధ్యతకు తగిన గౌరవాన్ని ఇవ్వకపోగా..దిగజార్చుకునేలా వ్యవహరిస్తున్నారని, ఈ విషయాన్ని తరుచూ మరిచిపోతూనేవున్నారని స్టాలిన్ విమర్శించారు. 'బహుళ సంస్కృతులు, భిన్నత్వంలో ఏకత్వం గురించి గర్వించే గొప్ప భారతదేశంలో హిందువులు, ముస్లింల మధ్య శత్రుత్వాన్ని పెంపొందించడం, తమిళులు, బీహార్ ప్రజల మధ్య శత్రుత్వాన్ని సృష్టించే విధంగా ప్రవర్తించడం వంటి చౌకబారు రాజకీయాలను తక్షణమే ఆపాలని, దీనికి బదులుగా దేశ సంక్షేమంపై సారించాలని స్టాలిన్ పునరుద్ఘాటించారు. బీహార్‌లోని మహాగట్బంధన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తామని ఆయన తెలిపారు.

ప్రధానిమంత్రి వ్యాఖ్యలను కాంగ్రెస్, సిపిఎం కూడా తీవ్రంగా ఖండిచాయి. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తమిళనాడు ప్రజలపై బిజెపి నాయకులు నిందలు వేయడం సహజంగా మారిందని కాంగ్రెస్ నాయకులు, విరుదునగర్ ఎంపి బి.మాణికం ఠాగూర్ విమర్శించారు. మధురైలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని తన విద్వేష వ్యాఖ్యలకు గాను తమిళనాడు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను విభజించడం అనేది ఆర్‌ఎస్‌ఎస్ డిఎన్‌ఎలోనే ఉందని, ఓట్ల కోసం బిజెపి నాయకులు ఎంతకైనా తెగిస్తారని విమర్శించారు.

మోడీ వ్యాఖ్యలను తమిళనాడు ప్రజలపై విద్వేషపూరిత, అవమానకరమైన వ్యాఖ్యలుగా సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి షణ్ముగం విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'బీహార్‌లో రాజకీయ లబ్ధి కోసమే మోడీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ప్రకటనలో తెలిపారు. 'బిజెపి ప్రభుత్వ వైఫల్యాల నేపథ్యంలో ఓట్లు అడగలేని స్థితిలో ప్రధాని మోడీ ఇలాంటి విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. కొన్నిసార్లు ముస్లింలపై, కొన్నిసార్లు క్రైస్తవులపై, ఇప్పుడు తమిళలపై. ఈ రకమైన వ్యాఖ్యలు ఆయన నిర్వహిస్తున్న ప్రధాని పదవికి తగనిది' అని పేర్కొన్నారు. ప్రధాని మోడీపై ఎన్నికల కమిషన్ చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.






## డబుల్ ఇంజిన్ నుంచి విముక్తి

- ప్రజలకు బృందాకరత్ పిలుపు


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి ప్రభుత్వముంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని అధికారంలోకి వచ్చి..బిజెపి, దాని భాగస్వామ్య పక్షాలు ప్రజలను నిలువునా వంచిచాయని సిపిఎం పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు బృందాకరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను కడగండ్లకు గురి చేస్తున్న ఈ 'డబుల్ ఇంజిన్'ను తక్షణమే విముక్తి సాధించాలని ఆమె పిలుపునిచ్చారు. బీహార్‌లోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం నాడు సిపిఎం, మహాగట్బంధన్ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజాగ్రహం ప్రతిబింబిస్తుందని తెలిపారు. బీహార్‌లో యువత ఉద్యోగాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కావలసినంత భూమి ఉన్నప్పటికీ, లక్షలాది మంది నిరాశ్రయులుగా, భూమిలేనివారిగా మిగిలిపోయారని, పేదలకు భూపంపిణీ చేయకుండా తమ అనుయాయులైన 'అదానీ' వంటి వారికి వేలాది ఎకరాలను ఎకరం రూపాయికే కట్టబెట్టేస్తున్నారని బృందాకరత్ ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో 'జంగిల్ రాజ్' నడుపుతున్న బిజెపి..బీహార్‌లో ఎన్‌డిఎ బదులు మహాగట్బంధన్ అధికారంలోకి వస్తే 'జంగిల్ రాజ్'ను ఏర్పాటు చేస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విభూతిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సమస్తిపూర్‌లో బృందాకరత్ సిపిఎం అభ్యర్థి అజయ్ కుమార్ తరపున ప్రచారం చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, నితీష్ అవినీతి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఇంటికెళ్లడం ఖాయమని అన్నారు. విభూతిపూర్ ప్రజలు తమ పోరాట వారసత్వాన్ని, అమరవీరుల త్యాగాలను కాపాడుకుంటారని పేర్కొన్నారు.

## బీహార్ యువతకు కోటి ఉద్యోగాలు!

- ఎన్‌డిఎ మేనిఫెస్టోలో హామీ

**పాట్నా :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్‌డిఎ మళ్లీ నయవంచన హామీలనే గుప్పించింది. ఈ ఐదేళ్లలో ఉద్యోగాల ఊసెత్తని ఎన్‌డిఎ నేతలు ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే యువతకు కోటి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించింది. పాట్నాలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో 'సంకల్ప పత్ర' పేరుతో ఈ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఈ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఎల్‌జెపి (రాంవిలాస్) పార్టీ చీఫ్ చిరాగ్ పాసవాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కోటి ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు . ప్రతి జిల్లాలో మెగా నైపుణ్య కేంద్రాల ఏర్పాటు, కేజీ టు పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య వంటి హామీలు ఇచ్చారు. ఏడాదికి రూ.లక్ష వరకు సంపాదించేలా కోటి మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా మారుస్తామని, మహిళలు వ్యాపారాలు ప్రారంభించేందుకు రూ.2 లక్షల వరకు ఆర్థికసాయం చేస్తామని కూడా హామీ ఇచ్చారు. అలాగే, ఇబిసిలకు రూ.10 లక్షల వరకు ఆర్థిక ప్రోత్సాహకాలు. రాష్ట్రంలో సామాజిక-ఆర్థిక పరిస్థితులను అంచనా వేసేందుకు సుప్రీంకోర్టు మాజీ జడ్జి అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు, ప్రతి రైతుకు ఏడాదికి రూ.9వేలు (మూడు విడతల్లో) పెట్టుబడి సాయం వంటి హామీలు ఉన్నాయి. అదేవిధంగా రాష్ట్రంలో ఏడు ఎక్స్‌ప్రెస్‌వేలు, నాలుగు నగరాల్లో మెట్రో రైలు సేవల ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశారు. గిగ్ వర్కర్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం కూడా ఇందులో ఉన్నాయి.



అజయ్ కుమార్‌తో కలిసి ప్రసంగిస్తున్న ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్

# మాస్కో ఆఫ్ సమస్తిపూర్

- ఎర్రజెండా కంచుకోటగా విభూతిపూర్
- భారీ మెజారిటీపై సిపిఎం సిట్టింగ్ ఎమ్మెల్యే అజయ్ ధీమా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో విభూతిపూర్ నియోజకవర్గం 'మాస్కో ఆఫ్ సమస్తిపూర్'గా పేరొందింది. హక్కుల పోరాటాలతో నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపిన నేల ఇది. 500 నుంచి 1000 ఎకరాలను కలిగి ఉన్న భూస్వాముల నుండి భూమిని స్వాధీనం చేసుకుని, దళితులు, వెనుకబడిన వర్గాలకు పంచే చారిత్రాత్మక పోరాటాలను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నిర్వహించింది. ఈ పోరాటంలో 26 మంది అమరులయ్యారు. ప్రస్తుత సిపిఎం సిట్టింగ్ ఎమ్మెల్యే, మహాగట్బంధన్ అభ్యర్థి అజయ్ కుమార్‌పై భూస్వాములు ఇదివరకే మూడుసార్లు దాడి చేశారు. ఆ దాడులను ఎదుర్కొని ఆయన ప్రజా పోరాటాలను ముందుకు నడిపిస్తున్నారు.

అందుకనే ఎర్రజెండాను ఇక్కడి ప్రజానీకం గుండెలకు హత్తుకొని నీరాజనాలు పలుకుతారు. 2020 ఎన్నికల్లో 40,500 ఓట్ల మెజారిటితో ఈ స్థానం నుంచి అజయ్ కుమార్ ఘన విజయం సాధించారు. ఈ దఫా అంతకు మించిన భారీ మెజారిటీతో తమ ప్రియతమ నేతను శాసనసభకు పంపాలని ఇక్కడి ప్రజానీకం ప్రతీన బూనుతోంది. ఐదు సంవత్సరాలుగా అసెంబ్లీ లోపల, వెలుపల ప్రజావాణిని వినిపించిన అజయ్..నియోజకవర్గ అభివృద్ధికి సైతం ఎనలేని కృషి చేశారు. కుండపోత వర్షం ఉన్నప్పటికీ మెహాతి గ్రామంలో ప్రచారానికి బయలుదేరిన అజయ్ కుమార్ భయ్యాను నిర్మలా దేవి అనే మహిళ ఆపి, 'ఈ సారి నేను మీకు ఎలా ఓటు వేయాలి?' అడిగింది. అజయ్ కుమార్ తన జేబులో నుండి బ్యాలెట్ పేపర్ మోడల్‌ను తీసి ఆమెకు వివరించారు. 'ఈసారి మొదటి పేరు అదే. పెద్ద కలర్ ఫోటో కూడా ఉంది. భయపడాల్సిన పని లేదు' అని చెప్పారు.

ఆయన మరొక ప్రదేశానికి చేరుకున్నప్పుడు, ఇంటి యజమాని జారే గోడ ఎక్కి, జామకాయను తెంపి అజయ్ కుమార్‌కు అందించాడు. రైతు కుటుంబం భోజనం కోసం వెన్నతో చేసిన చపాతీలు, బంగాళాదుంప కూర, తీపి లస్సీని తయారు చేసి అజయ్ కుమార్‌ను స్వాగతించింది. 2010, 2015లో విభూతిపూర్ నుండి గెలిచిన రామ్ బాలక్ సింగ్ రెండో భార్య రవీనా ఖుష్వాహా ఈసారి జెడియు అభ్యర్థిగా బరిలో ఉంది. రామ్ బాలక్ సింగ్ పెద్ద ఫోటో, పేరు పోస్టర్లు, ప్రచార వాహనాలపై ఉన్నాయి. డబుల్ మర్డర్ కేసులో నిందితుడిగా రాంబలక్ జైలులో ఉన్నాడు. అత్యాచారం ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ అశ్లీల వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అయింది. దీనితో, రాంబలక్‌కు జెడియు సీటు నిరాకరించింది. అయితే, తన భార్యకు సీటు ఇవ్వాలనే ఆయన పట్టుపట్టడంతో జెడియు సీటు ఇచ్చింది. బిజెపి రెబల్ అభ్యర్థి రూపాంజలి కుమారి కూడా పోటీలో ఉన్నారు.

# కష్టాల వేళ ఐక్యతే మార్గం

- ప్రజా కేంద్రీకృత మనస్తత్వంతోనే పురోభివృద్ధి
- అపెక్ సదస్సులో జిన్‌పింగ్




అపెక్ శిఖరాగ్ర సదస్సు తొలి సమావేశంలో కీలకోపన్యాసం చేస్తున్న చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్

**జియోంగ్జు :** ప్రపంచ కుగ్రామంగా మారిన ఆధునికయుగంలో పరిస్థితులు ఎంత ఎక్కువగా ఉంటే..అంతే ఎక్కువగా ప్రపంచ ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాల్సివుంటుందని చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. అమెరికా వివిధ దేశాల వస్తు, సేవలపైనా, చమురు ఉత్పత్తి దేశాలపైనా ఆంక్షలు, సుంకాలు విధిస్తున్న నేపథ్యంలో దక్షిణ కొరియాలోని జియోంగ్జులో ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార (అపెక్) దేశాల శిఖరాగ్ర సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిన్‌పింగ్ కీలక ఉపన్యాసం చేశారు. సార్వత్రిక ప్రయోజనకారిగా సమగ్ర ఆర్థిక ప్రపంచీకరణ, ఆసియా పసిఫిక్ అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఆయన ఐదు అంశాలను ప్రతిపాదించారు. ప్రజా కేంద్రీకృత సార్వత్రిక ప్రయోజన మనస్తత్వంతోనే పురోభివృద్ధి సాధ్యమని ఆయన నొక్కి చెప్పారు. అపెక్ ఆవిర్భావం మొదలుకొని మూడు దశాబ్దాలుగా ప్రపంచ అభివృద్ధిలో ఆసియా పసిఫిక్ ప్రాంత పురోభివృద్ధి ఎనలేని భాగస్వామ్యాన్ని కలిగివుందని ఆయన ప్రశంసించారు. ప్రపంచ వాణిజ్య యువనికలో అపెక్ అమోఘమైన పాత్ర పోషిస్తోందన్నారు. సార్వత్రిక ప్రయోజనాల లక్ష్యంగా ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్య పరిరక్షణకు తమ వంతు కృషిని చైనా సాగిస్తుందని హామీ ఇచ్చారు. పరిస్థితులు ఎంత ఇబ్బందికరంగా ఉంటే మనం అంత ఎక్కువగా కలిసి పనిచేయాలని సూచించారు. ప్రపంచం వేగంగా మార్పులకు లోనవుతోందని, అంతర్జాతీయంగా పరిస్థితి మరింత సంక్లిష్టంగా, అస్థిరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రీన్ ఇండస్ట్రీస్, క్లీన్ ఎనర్జీలో సహకారాన్ని విస్తరించడానికి ఇతర దేశాలతో కలిసి పని చేయాల్సిన అవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. 11 ఏళ్ల తరువాత తొలిసారిగా దక్షిణ కొరియా పర్యటనలో జిన్‌పింగ్ పాల్గొన్నారు. కాగా, ఈ శిఖరాగ్ర సదస్సులో జపాన్ ప్రధాని సనే తకైచి, కెనడా ప్రధాని మార్క్ కార్నీ, థాయ్‌లాండ్ ప్రధాని అనుతిన్ చార్న్ కూడా పాల్గొన్నారు. జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. శనివారం దక్షిణ కొరియా అధ్యక్షులు లీజే మ్యుంగ్, జిన్‌పింగ్ మధ్య సమావేశం జరగనుంది.

**జిన్‌పింగ్ ప్రతిపాదించిన ఐదు అంశాలు**

- మొదటిది, బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థ పరిరక్షణకు ఉమ్మడి కృషి జరగాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అంతర్జాతీయ ఆర్థిక మరియు వాణిజ్య నిబంధనలను నవీకరించాలని సూచించారు.
- రెండవది, ఆసియా-పసిఫిక్ స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతం అభివద్ధికి ప్రేరణనిచ్చేలా వాణిజ్యం మరియు పెట్టుబడి సరళీకరణను ప్రోత్సహించాల్సివుందని, ప్రాంతీయ ఆర్థిక సమైక్యతకు స్థిరంగా కషి చేయాలన్నారు. పరస్పర సమన్వయం మరియు సహకార పురోగతిని పెంపొందించాలన్నారు.
- మూడవదిగా, పారిశ్రామిక మరియు సరఫరా గొలుసులను స్థిరంగా మరియు సజావుగా ఉంచడానికి సభ్య దేశాలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. సభ్యులు విడిపోవడానికి బదులుగా చేతులు కలపాలన్నారు.
- నాల్గవది, వాణిజ్యంలో డిజిటల్ మరియు పర్యావరణ హితమైన గ్రీన్ టెక్నాలజీలను అభివృద్ధి చేయాలన్నారు.
- ఐదవది, సార్వత్రిక ప్రయోజనకరమైన, సమగ్రాభివృద్ధిని ప్రోత్సహించడానికి ఆసియా-పసిఫిక్ కలిసి పనిచేయాలని జిన్‌పింగ్ కోరారు. ప్రజా కేంద్రీకృత అభివద్ధి మనస్తత్వంతోనే పురోగతి సాధ్యమని, అభివృద్ధిలో అసమానతలు ఉండరాదని సూచించారు. ఈ దిశగా సాగించే అన్ని ప్రజా ప్రయోజనకర అభివృద్ధికర ఉమ్మడి కృషిలో చైనా భాగస్వామ్యం తప్పక ఉంటుందని తెలిపారు.

# ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలి : ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో శాంతి భద్రతల సమస్యలు ఎక్కువగా తలెత్తడానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్), బిజెపిలే కారణమని, అందుకే ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధించాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకుండా సర్దార్ వల్లభాయ్ పటేల్ కూడా నిషేధం విధించారని ఆయన గుర్తు చేశారు. శుక్రవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1948లో మహాత్మా గాంధీ హత్య తరువాత ఆర్‌ఎస్‌ఎస్‌పై సర్దార్ పటేల్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్ మధ్య విభేదాలున్నట్లు చిత్రీకరిస్తూ బిజెపి చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. అయితే నెహ్రూ, పటేల్ మధ్య చక్కటి సంబంధాలు ఉండేవని, ఇద్దరూ ఒకరినొకరు ప్రశంసించుకునే వారని తెలిపారు. దేశ ఐక్యతను పటేల్ తీర్చిదిద్దారని నెహ్రూ ప్రశంసించారని, దేశానికి నెహ్రూ ఆదర్శమని పటేల్ అభివర్ణించారని గుర్తు చేశారు. అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతి అయితే, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి అని, వీరిద్దరూ గొప్ప నేతలని ఖర్గే కొనియాడారు. పటేల్ ఉక్కు మనిషి అయితే, ఇందిరాగాంధీ ఉక్కు మహిళ అని, ఇద్దరూ దేశానికి ఎంతో సేవ చేశారని, దేశ ఐక్యతకు పాటుపడ్డారని అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి అక్కసు వెళ్లగక్కింది. ఆర్‌ఎస్‌ఎస్‌పై దాడికి కాంగ్రెస్ పటేల్ పేరును వాడుకుంటోందని బిజెపి ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళిలర్పిస్తున్న ఖర్గే

## కేంద్రం విధానాలతో సహజ వనరుల లూటీ

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు వల్ల సహజ వనరులు లూటీ అవుతున్నాయని, అటవీ సంపద, గిరిజనుల భూములను కార్పోరేట్లు అన్యాక్రాంతం చేస్తున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) ప్రధానకార్యదర్శి బి వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. జార్ఖండ్‌లోని రాంచిలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం) రెండు రోజుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను, సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టి ఆదివాసీల మనుగడకే కేంద్రం ముప్పు తెస్తోందని విమర్శించారు. అడవుల కార్పొరేటికరణకు వ్యతిరేకంగా బిర్సముండా పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మైనింగ్, సహజ వానరలన్నీటిని అదానికి అప్పగించడం కోసం అభివృద్ధి ముసుగుని తగిలించిందని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా లక్షల ఎకరాలు ముంపునకు గురవుతుంటే కాంట్రాక్టర్లకు నిధులు కుమ్మరిస్తున్నారే కానీ.. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని తప్పుబట్టారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు భూమి, పరిహారం, పునరావాసం కల్పించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు సిద్ధపడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నిర్దేశనంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గూగుల్‌కు రూ. 22 వేల కోట్ల రాయితీ ఇస్తున్నారని విమర్శించారు. ఆదివాసి ప్రాంతాలను కాపాడుకోవడం మొత్తం శ్రామిక ప్రజల కనీస బాధ్యతగా వ్యవసాయ కార్మిక సంఘం భావిస్తుందని అన్నారు. ఈ క్రమంలో రాబోయే మూడు నెలల పాటు జాతాలు, ప్రదర్శనలు, కలెక్టరేట్ ముట్టడిలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం బాబురావు, టిజిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పని ఒత్తిడితో సతమతం

- సర్వీసు అనంతరం అవకాశాలపై సందేహం
- అగ్నివీరుల మనోగతం

**న్యూఢిల్లీ :** సాయుధ దళాలలో స్వల్ప కాలిక సేవల కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకంపై ఇటీవల నిర్వహించిన ఓ సర్వే అనేక ఆసక్తికరమైన అంశాలను బయటపెట్టింది. పని ఒత్తిడి అధికంగా ఉంటోందని 72 శాతం మంది అగ్నివీరులు వాపోతున్నారు. ఈ పథకాన్ని ప్రతిపక్షాలతో పాటు యువత కూడా తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. డాక్టర్ శర్మిష్ట సోలంకీ పర్యవేక్షణలో ఎంఎస్ యూనివర్సిటీకి చెందిన ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థి మనీష్ జంగిడ్ ఈ సర్వేను నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 50 మంది అగ్నివీరులను ఆయన సర్వే చేశారు. పని ఒత్తిడితో సతమతమవుతున్నామని వారిలో సుమారు మూడో వంతు మంది ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల సర్వీసు పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయోనని 52 శాతం మంది ఆందోళన చెందుతున్నారు. అగ్నిపథ్ పథకంపై 60 శాతం మంది అసమ్మతి వ్యక్తం చేయడం గమనార్హం. నాలుగు సంవత్సరాల సర్వీసు పూర్తయిన తర్వాత దీర్ఘకాలం పనిచేయాలని 54 శాతం మంది కోరుకుంటుంటే 26 శాతం మంది పెద్దగా ఆసక్తి చూపడం లేదు. శిక్షణలో నాణ్యతపై 38 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా 40 శాతం మంది పెదవి విరిచారు. 22 శాతం మంది ఎటూ చెప్పలేదు. పని ఒత్తిడి ఉన్నదని అగ్నివీరులు కుండబద్దలు కొట్టారు. 48 శాతం మంది ఓ మాదిరి పని ఒత్తిడికి గురవుతున్నామని చెప్పగా 26 శాతం మంది అది అధికంగా ఉన్నదని చెప్పారు. 12 శాతం మంది మాత్రమే పని ఒత్తిడి లేదని తెలిపారు. సర్వీసు కాలాన్ని నాలుగు సంవత్సరాలకే కుదించడంతో ఉద్యోగంలో సంతృప్తి లోపించిందని మెజారిటీ అగ్నివీరులు అన్నారు.

## పాక్-ఆఫ్ఘన్ మధ్య కాల్పుల విరమణ పొడిగింపు

**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాలు తమ మధ్య కాల్పుల విరమణ పొడిగింపునకు అంగీకరించాయి. అలాగే తమ మధ్య ఉద్రిక్తలను నివారించుకోవడానికి వచ్చే వారం ఇస్తాంబుల్‌లో మరో దశ శాంతి చర్చలు జరపనున్నాయి. ఈ నెల ప్రారంభంలో ఇరు దేశాల మధ్య ఘర్షణలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇస్తాంబుల్‌లో బుధవారం, గురువారం శాంతి చర్చల్లో రెండు దేశాలు పాల్గొన్నాయి.

## అమెరికాది బాధ్యతారాహిత్యం : ఇరాన్

**టెహ్రాన్ :** అణుపరీక్షలను మళ్లీ ప్రారంభించాలనే అమెరికా నిర్ణయాన్ని ఇరాన్ తీవ్రంగా విమర్శించింది. ఈ నిర్ణయం 'తిరోగమనం, బాధ్యతారహిత్యం' అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి పేర్కొన్నారు. 'ఈ నిర్ణయం అంతర్జాతీయ శాంతి, భద్రతకు తీవ్రమైన ముప్పు' అని అన్నారు. తన అణు పరీక్షలను మళ్లీ ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్న ఇదే దేశం ఇరాన్ శాంతియుత అణు కార్యక్రమాన్ని మాత్రం 'భయంకరం'గా చూపిస్తోందని తెలిపారు.

## 4న జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలు

- అధ్యక్ష పదవికి బరిలో ఏడుగురు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు) లో ఈ నెల 4న విద్యార్థి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాలు సెంట్రల్ ప్యానెల్‌తో పాటు ఇతర పదవులకు అభ్యర్థులను ప్రకటించాయి. ఎన్నికల కమిటీ విడుదల చేసిన వివరాల ప్రకారం అధ్యక్ష పదవికి ఏడుగురు అభ్యర్థులు బరిలో ఉండగా, ఉపాధ్యక్ష పదవికి ముగ్గురు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులకు ఐదుగురు చొప్పున పోటీ పడుతున్నారు. ఈ సంవత్సరం 9,043 మంది విద్యార్థులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

**అభ్యర్థులు వీరే**

స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఎ), డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (డిఎస్ఎఫ్) మూడు సంఘాలు కలిపి వామపక్ష ఐక్యత (లెఫ్ట్ యూనిటీ) పేరుతో ప్యానెల్ ఏర్పడింది. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎ, డిఎస్ఎఫ్ ప్యానెల్ తరపున అధ్యక్ష పదవికి అదితి మిశ్రా, ఉపాధ్యక్ష



పదవికి కె గోపిక బాబు, జనరల్ సెక్రటరీ పదవికి సునీల్ యాదవ్, జాయింట్ సెక్రటరీ పదవికి డానిష్ అలీ పోటీ చేస్తున్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) కూడా ఎన్నికలకు అభ్యర్థుల జాబితాను కూడా ప్రకటించింది. అధ్యక్ష పదవికి వికాస్ పటేల్, ఉపాధ్యక్ష పదవికి తాన్య కుమారి, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్ కాంత్ దూబే, సంయుక్త కార్యదర్శిగా అనుజ్ డమారా ప్రకటించింది. నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యుఐ) తరపున అధ్యక్ష పదవికి వికాష్, బిర్సా అంబేద్కర్ పులే స్టూడెంట్స్ అసోసియేషన్ తరపున అధ్యక్ష పదవికి రాజ్ రతన్ రాజోరియా పోటీ ఉన్నారు. ఎన్నికలకు నాలుగు రోజులు మాత్రమే ఉండటంతో, క్యాంపస్ అంతటా ప్రచారం జోరుగా సాగుతోంది.

## అధిక చక్కెర ఓఆర్ఎస్‌పై నిషేధం సమర్థనీయమే

**న్యూఢిల్లీ :** అధిక చక్కెర కలిగిన పానియాలను ఓఅర్ఎస్ పేరుతో అమ్మడాన్ని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) దేశవ్యాప్తంగా నిషేధించిందిన సంగతి తెలిసిందే. దీన్ని ఢిల్లీ కోర్టు సమర్థిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించింది.. హైదరాబాద్ పిల్లల వైద్యురాలు డాక్టర్ శివరంజని సంతోష్ ఎనిమిదేళ్ల పోరాడిన అనంతరం ఓఅర్ఎస్ లేబుళ్లను ఎఫ్ఎస్ఎస్ఎఐ నిషేధించింది. జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి అనుభంధ సంస్థ అయిన జెఎన్‌టిఎల్‌కు చెందిన ఉత్పత్తులను ఉద్దేశించి కోర్టు ఈ ఉత్తర్వులు ఇచ్చింది.. ఇవి డబ్ల్యూహెచ్చ్ఓ ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేల్చి చెప్పింది. ముఖ్యంగా పిల్లల వీటిని ఉపయోగించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్న వాదనను అంగీకరించింది. ఏటా వీటి దుష్ప్రభావం 50 వేలమంది పిల్లలపై ఉండటం తీవ్రమైన విషయమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇటీవలే దగ్గుమంది తాగి పిల్లలు మృతి చెందిన విషయం తెలిసిందే. అనేక ఫిర్యాదుల అనంతరం ఎఫ్ఎస్ఎస్ఎఐ దేశవ్యాప్తంగా ఓఆర్ఎస్ పేరుతో అమ్మకాలను నిషేదించింది. దీనిలో అధికశాతం చక్కెర ఉందనే విషయాన్ని ఉత్పత్తులపై స్పష్టంగా పేర్కోవాలని ఆదేశించింది. ఈ తీర్పు ద్వారా పిల్లల ఆరోగ్యం కాపాడబడుతుందని, తప్పుదారి పట్టించే లేబులింగ్, అక్రమ అమ్మకాలను నిలువరించేందుకు దోహదపడుతుందని డాక్టర్ శివరంజని సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా తెలిపారు.

# ఏలేరు కాలువకు గండి

- నీట మునిగిన వరి పంట
- ఉధృతంగా నల్లమడ వాగు
- శారద నదికి పడిన గండిని పరిశీలించిన హోం మంత్రి

**ప్రజాశక్తి - యంత్రాంగం**

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెం వద్ద ఏలేరు కాలువకు గండి పడింది. వంద ఎకరాలకు పైగా పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఏలేరు రిజర్వాయర్‌కు శుక్రవారం 8,675 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో ఏలేరు కాలువకు వరద పోటెత్తింది. నీటి ఉధృతికి కిర్లంపూడి మండలం రాజుపాలెం వద్ద గట్టుకు గండి పడింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఇసుకబస్తాలతో గండిని పూడ్చారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. గతేడాది ఇదే సమయంలో రాజుపాలెంలోనే గండి పడింది. ఆ సమయంలో అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి చేతులు దులిపేసుకున్నారని, అందుకే నేడు మళ్లీ ఈ పరిస్థితి తలెత్తిందని రాజుపాలెం గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం గండిని పూడ్చేశారని, అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నారని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని జగ్గంపేట ఎమ్మెల్యే తెలిపారు.

అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలోని చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, బుచ్చయ్యపేట, పోలేపల్లి గ్రామాల్లో వరి, చెరుకు పంటలు ఇంకా నీట మునిగే ఉన్నాయి.

అనకాపల్లి మండలంలోని కొండపాలెం, మార్టూరు, దిబ్బపాలెం తదితర గ్రామాల్లో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాంబిల్లి మండలం రజాల అగ్రహారం వద్ద శారదానదికి గండి పడిన ప్రాంతాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంపి సిఎం.రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. గండి వల్ల సుమారు 400 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, తాత్కాలికంగా గండిపూడ్చివేత పనులు చేపడుతున్నామని, శాశ్వత పరిష్కారానికి 2.50 కోట్లతో నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు హోం మంత్రి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో 26,537 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని అధికారులు భావించి తొలిరోజు 4,150 ఎకరాలకు సంబంధించిన పంటనష్టం అంచనాలను నమోదు చేశారు. ఏలూరు జిల్లాలో 15,895 ఎకరాల్లో పంట నష్టం ఉంటుందని లెక్కతేల్చగా తొలిరోజు 3,670 ఎకరాలకు సంబంధించి పంటనష్టం నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. ఆదివారం నాటికి పంటనష్టం నమోదు లెక్కలు పూర్తికానున్నట్లు అధికారులు చెబుతున్నారు.



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

**బాపట్ల జిల్లాను చుట్టుముట్టిన వాగులు**

ఎగువన కురిసిన భారీ వర్షాల వల్ల వరద నీరు నల్లమడ వాగును ముంచెత్తింది. దీంతో, గత రెండు రోజులుగా వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. నల్లమడ అడవుల్లో ప్రారంభయ్యే ఈ వాగు గుంటూరు, పల్నాడు జిల్లాల మీదుగా ప్రవహించి బాపట్ల జిల్లా సూర్యలంక సమీపంలో సముద్రంలో కలుస్తుంది. జిల్లాకు ఎగువన మొదలయ్యే పలు వాగులు బాపట్ల జిల్లాలోకి ప్రవేశించే సమయానికి ఒకటిగా కలిసి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలోని వాగులు, డ్రెయిన్లు పొంగడంతో వరితో పాటు వేరుశనగ, మిరప, శనగ, మినుము, పత్తి, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి.

**పంట మునకతో ఆత్మహత్యకు యత్నించిన రైతు**

ప్రకాశం జిల్లా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌లోకి నీరు వచ్చి కటకానిపల్లి వద్ద గండ్లు పడ్డాయి. గండిపడడంతో రైతు రసూల్ సాగు చేసిన ఏడు ఎకరాల మిర్చి పంట నీటమునిగింది. భారీగా పెట్టుబడి పెట్టి.. తీవ్రంగా నష్టపోయానని రైతు మనోవేదనకు గురై పురుగుమందు తాగబోతుండగా స్థానిక రైతులు అడ్డుకున్నారు.

**నాగార్జున సాగర్ 12 గేట్లు ఎత్తివేత**

నాగార్జున సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. సాగర్‌కు 1,46,744 క్యూసెక్కుల నీరు రావడంతో శుక్రవారం సాయంత్రం 12 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 96,696 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది. సాగర్ జలాశయం మొత్తం నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 589.60 అడుగులకు చేరుకుంది.

**ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద**

విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. గురువారం 5.87 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శుక్రవారం ఉదయం వరద ప్రవాహం తగ్గిన నేపథ్యంలో రెండో ప్రమాద హెచ్చరిక రద్దు చేసి, మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో , అవుట్ ఫ్లో 4,43,808 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీ 70 గేట్లలో 69 గేట్లను ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు.

## పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార(పిఎసిఎస్) సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయడుకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు రుణాలు, ఎరువులు అందిస్తూ, ధాన్యం కొనుగోలు తదితర ముఖ్యసేవలను 7వేల మంది ఉద్యోగులు చేస్తున్నారని వివరించారు. ఈ

ఉద్యోగుల వేతనాలు తదితర సమస్యలు పరిష్కారం కాకుండా ఆరేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీనిపై జోక్యం చేసుకుని వారి సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. 2019లో తమ ప్రభుత్వం పిఎసిఎస్ ఉద్యోగుల వేతనాలను సవరిస్తూ 2019 మార్చి 1వ తేదిన 36 జిఓ ఇచ్చారని,వేతనాలు 2014 ఏప్రిల్ నుండి నోషనల్‌గా అమలులోకి వస్తాయని అందులో పేర్కొన్నారని వివరించారు. మోనిటరీ బెనిఫిట్ ఇంతవరకు అమలులోకి రాలేదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ

ఉద్యోగుల పదవీవిరమణ వయసుకు సమానంగా 62 ఏళ్లకు పెంచే అవకాశం 36 జిఓలో ఉన్నా అమలుకు తగిన ఆదేశాలు ఇవ్వలేదని తెలిపారు. వేతనాలు చెల్లించేందుకు అవసరమైన జిల్లాస్థాయి మద్దతు నిధి ఏర్పడలేదని పేర్కొన్నారు. 2019 మార్చి 1వ తేది తరువాత ఉద్యోగంలో చేరిన వారికి ఉద్యోగ భద్రత కల్పించి, ఈ జివోలను వారికి కూడా వర్తింపచేయాలని కోరారు. గత ప్రభుత్వం దీన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ఈసారైనా తమరు అమలు చేస్తారన్న విశ్వసంతో ఉన్న ఉద్యోగులను నిరాశపరచొద్దని కోరారు. వీటన్నింటికీ తోడుగా 2019, 2024 వేతన సవరణలు చేయాలని తెలిపారు.ఇన్ని సమస్యలు ఉన్నప్పుడు ఉద్యోగులలో అసంతృప్తి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వానికి పైసా ఖర్చు లేదని,బడ్జెట్‌లో భారం ఉండదని సూచించారు. సానుకూల ఆదేశాలు ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రిని కోరారు.



30ఏళ్ళ క్రితం ఉపయోగించిన అంబాసిడర్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబునాయుడు

## క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు

- పార్టీ నేతలతో చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పార్టీకి క్రమశిక్షణే బలమని, దానిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో పార్టీ విభాగాలతో శుక్రవారం సమావేశమయ్యారు. ముందుగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం పార్టీ నేతలతో మాట్లాడుతూ సిద్ధాంతాలు, క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మధ్య కాలంలో తలెత్తిన వివాదాలపై క్రమశిక్షణ కమిటీ ఆయా నేతలతో మాట్లాడి వివరణ తీసుకుని తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇక నుంచి వారానికి ఒకరోజు తప్పనిసరిగా పార్టీ కార్యాలయానికి వచ్చి శ్రేణులకు అందుబాటులో ఉంటానని చెప్పారు. మొంథా తుఫాను వల్ల ఎవరికీ ఏ ఇబ్బంది రాకుండా ప్రభుత్వ యంత్రాంగం, కూటమి పార్టీలు కలిసి పనిచేశాయని చెప్పారు. వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనని నాయకుల వివరాలను ఆయన తీసుకున్నారు. ప్రతి నాయకుడి పనితీరును నమోదు చేస్తున్నామని, వారి వ్యవహారశైలి ఆధారంగానే భవిష్యత్తులో గుర్తింపు ఉంటుందని చెప్పారు. పార్టీకోసం పనిచేసిన వారందరికీ పదవులు వస్తాయని, కష్టపడిపనిచేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని తెలిపారు.విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం ముందుంటే దుష్ప్రచారంలో వైసిపి నేతలు ముందున్నారని విమర్శించారు.

**'అప్పటి' అంబాసిడర్ కారు పరిశీలన**

మూడు దశాబ్దాల క్రితం ఉపయోగించిన అంబాసిడర్ కారుతో తన అనుబంధాన్ని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. 393 నెంబర్‌తో ఉండే ఈ కారు చంద్రబాబు సొంత వాహనం. ఉమ్మడి రాష్ట్రముఖ్యమంత్రిగా ఈ నెంబర్ ఉన్న అంబాసిడర్ కాన్వాయితో రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించేవారు. ఇప్పటి వరకు హైదరాబాద్‌లో ఉన్న ఈ కారును టిడిపి కార్యాలయంలో ఇకపై ఉంచనున్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన తిరిగి వెళ్తున్న సమయంలో ఆ కారును పరిశీలించి దాంతో తన ప్రయాణ స్మృతులను గుర్తుచేసుకున్నారు.

## బిడ్డతో సహా మహిళ నిర్బంధం

- వివాహేతర సంబంధం పెట్టుకోవాలని వేధించారని బాధితురాలు ఆరోపణ

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

చంటి బిడ్డతో సహా మహిళను ఆమె అత్త, మామలు, భర్త గత 13 రోజులుగా ఇంట్లో నిర్బంధించిన ఘటన శుక్రవారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డులో నివాసముంటున్న రంజిత్‌కు సుమారు 22 నెలల క్రితం వివాహమైంది. ఆ దంపతులకు ఎనిమిది నెలల బాబు ఉన్నాడు. బాబు పుట్టినప్పటి నుంచి తనను భర్త, అత్తమామలు, బావ వేధిస్తున్నారని అక్టోబర్ 16న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇరుపక్షాల కుటుంబాలను పిలిచి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి, పంపించేశారు. నాటి నుంచి చంటి బిడ్డతో సహా బాధితురాలిని ఆమె అత్త, మామ, భర్త, భర్త సోదరుడు కలిసి ఒక గదిలో బంధించారు. నాటి నుంచి ఇబ్బంది పడుతున్న బాధితురాలు ఎట్టకేలకు గురువారం విశాఖపట్నంలోని తన బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారంతా శుక్రవారం మధ్యాహ్నం జంగారెడ్డిగూడెం చేరుకుని మానవ హక్కుల సంఘం కార్యకర్త మన్నెం లక్ష్మి సాయంతో పోలీసులను ఆశ్రయించారు. వారంతా ఆ ఇంటికి చేరుకుని గది తాళం పగులగొట్టి బాధితురాలిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. తన భర్త సోదరుడు ప్రవీణ్ దంపతులకు పిల్లలు లేరని, ప్రవీణ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుని వాళ్లకు పిల్లలు లేని లోటు తీర్చాలని అత్తమామలు వేధిస్తున్నారని బాధితురాలు ఆరోపించారు. దీనికి తాను నిరాకరించడంతో బిడ్డతో సహా తనను నిర్బంధించారని చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి బాధితురాలి అత్తమామ, భర్త, భర్త సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు.

## అనకాపల్లి పుస్తక మహోత్సవం ప్రారంభం

- నవంబర్ ఏడు వరకు నిర్వహణ

**ప్రజాశక్తి - అనకాపల్లి**

అనకాపల్లి వేదికగా తొలి పుస్తకాల పండుగ మొదలైంది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఆధ్వర్యాన స్థానిక ఎన్‌టిఆర్ గ్రౌండ్, అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో 'అనకాపల్లి పుస్తక మహోత్సవం' పేరిట తలపెట్టిన ఈ కార్యక్రమానికి తొలి రోజు విశేష స్పందన లభించింది. ఈ పుస్తక మహోత్సవాన్ని శారద గ్రంథాలయ వ్యవస్థాపకులు కోరుకొండ బుచ్చిరాజు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా అనకాపల్లి జిల్లా ట్రెజరీ అధికారి వివిఎల్.సుభాషిణి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి జిఎస్.ప్రకాష్, జెవివి రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు రెడ్డి, జిల్లా అధ్యక్షులు వర్మ, అనకాపల్లి బుక్ ఫెయిర్ కన్వీనర్ ఉమామహేశ్వరరావు, అనకాపల్లి సాహితీ మిత్రుల సంఘం తరఫున కె.అప్పలరాజు, రంగబాబు, పద్యకవితా సదస్సు తరఫున మాధవి సనార, కవి ఎం.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ ఏడు వరకు ఉదయం పది గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు ఈ పుస్తక మహోత్సవం సాగనుంది. వందకుపైగా ప్రచురణకర్తలు (పబ్లిషర్లు) లక్షకు పైగా పుస్తకాలను ప్రదర్శనకు ఉంచారు. పుస్తక ప్రదర్శనలతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం ప్రతిరోజూ వివిధ పోటీలు, సాహిత్య చర్చలు నిర్వహించనున్నట్లు, పుస్తక ప్రదర్శన, సాహిత్య సంభాషణలు, విద్యార్థుల పోటీలులాంటి విశిష్ట కార్యక్రమాల ద్వారా పుస్తక ప్రియులందరికీ ఎంతో విశేష అనుభూతిని కలిగించే విధంగా ఈ మహోత్సవం నడవనుందని నిర్వాహకులు తెలిపారు.



పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న బుచ్చిరాజు

## సిపిఎం నేత సామినేని రామారావు దారుణ హత్య

(మొదటిపేజి తరువాయి)

కోళ్లను విడిచి పెట్టేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఆగంతకులు వెనుక నుంచి రామారావును కత్తులతో పొడిచారు. పొట్టపై పొడవడంతో పేగులు బయటకు వచ్చాయి. శరీరంపై సుమారు పది కత్తిపోట్లు ఉన్నాయి. హత్య సమయంలో రామారావుకు, హంతకులకు మధ్య జరిగిన పెనుగులాటలో హంతకుల్లోని ఒకరి షర్టు చిరిగి రామారావు చేతిలో ఉంది. ఆయన కేకలు వేయడంతో ఇంటి ముందు ఉన్న హోటల్ యజమాని అక్కడికి వచ్చేలోపే హంతకులు పరారయ్యారు. రామారావు రక్తపు మడుగులో పడి ఉండడాన్ని చూసి ఆయన భార్య స్వరాజ్యాన్ని స్థానికులు నిద్ర లేపి విషయం చెప్పారు. ఆమె వచ్చి చూడగా అప్పటికే రామారావు మృతి చెంది ఉన్నారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సుమారు మూడు గంటలపాటు విచారణ నిర్వహించారు. రాజకీయ హత్య కావడంతో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను రంగంలోకి దింపారు. తన భర్తను రాజకీయ కక్షతో కాంగ్రెస్ గూండాలు బొర్ర ప్రసాద్, కంచుమర్తి రామకృష్ణ, (ఆర్కే), మద్దిని నాగేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు (చిన్నబ్బాయి), తాండ్ర పిచ్చయ్య, మరి కొంతమంది కలిసి హత్య చేశారని సిపికి స్వరాజ్యం తెలిపారు. కంచుమర్తి రామకృష్ణ, బొర్ర ప్రసాద్ తన భర్త రామారావును, తనను చంపుతామని దసరా పండగ రోజున బెదిరించారని చెప్పారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, అధికార పార్టీ ఒత్తిడికి లొంగకుండా నిజాయితీగా, నిష్పక్షపాతంగా విచారణ చేసి తనకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్‌ను ఆమె కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ... హంతకులను పట్టుకొని చట్టపరంగా శిక్షిస్తామని, కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, రామారావుకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ భవనంపై హంతకుల చెప్పులు ఉన్నాయి.



సంతాపసభలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో జాన్ వెస్లీ, తమ్మినేని వీరభద్రం తదితరులు

**సిపిఎం తెలంగాణ, ఎపి నాయకుల నివాళి**

రామారావు భౌతికకాయానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.సాయిబాబు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఎం ఎపి రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, దడాల సుబ్బారావు తదితరులు రామారావు భౌతికకాయంపై పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సంతాప సభలో తమ్మినేని మాట్లాడుతూ గ్రామంలో బలమైన పార్టీగా సిపిఎంను రామారావు తీర్చిదిద్దారన్నారు. మచ్చలేని మహోన్నత వ్యక్తిని కాంగ్రెస్ గూండాలు అతి దారుణంగా హత్య చేశారని విమర్శించారు. ఆయన మృతి పార్టీకి తీవ్ర నష్టమన్నారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ హత్య రాజకీయాలకు పాల్పడేవారికి ప్రజలు కచ్చితంగా సమాధి కడతారని హెచ్చరించారు. రామారావు హత్యను డిప్యూటీ సిఎం, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ఖండిస్తూ ప్రకటన చేయడం కాదని, హంతకులను పట్టించాలని డిమాండ్ చేశారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి లొంగి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే హంతకులను తామే పట్టుకుంటామని హెచ్చరించారు.

**అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర**

పాతర్లపాడులో నిర్వహించిన సంతాప సభ అనంతరం ప్రజల సందర్శనార్థం రామారావు భౌతికకాయాన్ని ఖమ్మం సిపిఎం జిల్లా కార్యాలయంలో కొద్దిసేపు ఉంచారు. అనంతరం అక్కడి నుంచి గ్రామానికి తీసుకొచ్చి అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర నిర్వహించారు. గ్రామ శివారులో రామారావు కుమారుడు విజయ్ తన తండ్రికి దహన సంస్కారాలు నిర్వహించారు.

**సిపిఎం ఎపి రాష్ట్ర కమిటీ ఖండన**

రైతు సంఘం నాయకులు సామినేని రామారావును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎపి రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దుండగులపై తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రామారావు రైతు సంఘం నాయకులుగానూ, ప్రజాపోరాటాల్లోనూ రాటుతేలారని తెలిపారు. సౌమ్యుడని, రైతు సమస్యలపై అవగాహనున్న వ్యక్తని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు రాష్ట్ర కమిటీ తరుపున ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. రామారావు హత్య ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని పేర్కొన్నారు.

**ప్రజా సంఘాల ఖండన**

రామారావు హత్యను రైతు, కౌలురైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, కెవిపిఎస్, ఐద్వా, డప్పుకళాకారుల సంఘం, గిరిజన సంఘం, ప్రజానాట్యమండలి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సాహితీ స్రవంతి, జనవిజ్ఞాన వేదిక, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఎస్‌డబ్ల్యుఎఫ్, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, ప్రజారోగ్యవేదిక రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి.

**ఎఐకెఎస్ సంతాపం**

సామినేని హత్యను అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) తీవ్రంగా ఖండించింది. ఎఐకెఎస్ అనుబంధ రైతుసంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి అయిన రామారావు కేంద్ర కిసాన్ కమిటీ సభ్యులు కూడా. రైతులు, కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తూ తన జీవితాన్ని త్యాగంచేశారని ఎఐకెఎస్ పేర్కొంది. రామారావుకు ఘనంగా నివాళి అర్పిస్తూ వారికుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేసింది. సంతాపసూచకంగా కిసాన్‌సభ పతాకాన్ని అవనతం చేశారు.

## తూర్పు నావికాదళ అధిపతిగా సంజయ్ భల్లా

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**



తూర్పు నావికాదళ అధిపతి (కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్)గా సంజయ్‌భల్లా శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన కమాండ్ పరేడ్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాజేష్ పెంధార్కర్ ఉద్యోగ విరమణ చేయడంతో సంజయ్ భల్లా ఆ బాధ్యతలు చేపట్టారు. తొలుత ఆయన నావికాదళ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. 1989 జనవరి 1న ఇండియన్ నేవీలో నియమించబడిన వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా 36 ఏళ్ల తన కెరీర్‌లో కమాండ్ స్టాఫ్ బాధ్యతలు నిర్వహించారు. ఆయన నావికాదళ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఆఫ్ పర్సనల్‌గా పనిచేశారు. గతంలో ఐఎన్ఎస్ నిశాంక్, ఐఎన్ఎస్ తారగిరి, ఐఎన్ఎస్ బియాస్ నౌకలలో బాధ్యతలు నిర్వహించారు. ఇస్లామాబాద్‌లోని హైకమిషన్ ఆఫ్ ఇండియాలో నావల్ అడ్వైజర్‌గా పనిచేశారు. ఆయన కాలంలోనే ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్స్ ఫ్లీట్ రివ్యూ (పిఆర్ఎఫ్ - 22), మిలాన్ 22 నిర్వహించారు. రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుండి పట్టభద్రులైన ఆయన భారత ప్రభుత్వం నుండి అతి విశిష్ట సేవా పతకం, నౌ సేనా పతకాన్ని అందుకున్నారు.

## 70 కిలోల గంజాయి స్వాధీనం

**ప్రజాశక్తి - కశింకోట (అనకాపల్లి జిల్లా)**

కశింకోట జాతీయ రహదారిలో సరోజిని విల్లా సమీపంలో శుక్రవారం ఆటోలో తరలిస్తున్న 70 కిలోల గంజాయిని పోలీసు అధికారులు పట్టుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేశారు. ఆటోను, ఏడు ఫోన్లను, 35 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సిఐ అల్లు స్వామినాయుడు తెలిపిన కథనం మేరకు.. అల్లూరి జిల్లా జికె వీధి మండలం జర్రెల ప్రాంతం నుంచి గంజాయి తరలుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు తనిఖీలు నిర్వహించగా ఆటోలో గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. నిందితులైన కుమార్, కొర్రా సత్తిబాబు, పాంగి ధర్మరాజు, కొర్రా బొంజిబాబు, సిందేరి జక్రయ్య, సేనాపతి మాణిక్యంను అరెస్టు చేశారు.

## తుపాన్ నష్టం పరిశీలనకు తక్షణమే బృందాలను పంపండి

(మొదటిపేజి తరువాయి)

విలువైన ఉద్యానపంటలు దెబ్బతినడంతో 23,979 మంది ఉద్యాన రైతులకు నష్టం జరిగింది, ఆక్వా రంగంలో 32వేల ఎకరాల్లోని రూ.514 కోట్ల విలువైన పంటను రైతులు కోల్పోయారు. 2,261 పశుసంపదను నష్టపోయినట్లు కేంద్రానికి తెలిపారు.

**విరిగిన 2,817 విద్యుత్తు స్థంభాలు**

రాష్ట్ర వ్యాప్తంగా 2817 విద్యుత్తు స్థంభాలు నేలకొరిగాయని, 26,575డిటిఆర్‌లు ధ్వంసమయ్యాయి. 429 కిలో మీటర్ల మేర విద్యుత్తు తీగలు తెగిపడ్డాయని నివేదికలో పేర్కొన్నారు. దీంతో ఆ శాఖకు రూ.19కోట్లు నష్టం వాటిల్లింది. నీటిపారుదల శాఖకు రూ.234కోట్ల మేర నష్టం వాటిల్లింది. 23 జిల్లాల పరిధిలో 3045 ఇళ్ల ధ్వంసమైనట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలలు, సిహెచ్‌సిలు, పిహెచ్‌సిలు, చేనేత మగ్గాలు అన్నీ కలిపి రూ.122కోట్లు నష్టం వాటిల్లింది. సహాయక చర్యల కోసం ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం సుమారుగా రూ.32కోట్లు ఖర్చు పెట్టినట్లు అధికారులు కేంద్రానికి పంపిన ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

## నవ కేరళ.. నవోదయం

(మొదటిపేజి తరువాయి)

కోసం 2023-24, 2024-25 సంవత్సరాలకు రూ.50 కోట్లు చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులను ఆరోగ్యం, గృహ నిర్మాణం, జీవనోపాధి వంటి వాటికి వినియోగించారు. ఈ ఏడాది రూ.60 కోట్లు కేటాయించారు.

**మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ చర్యల మధ్య సమతూక పాలన కోసం ప్రభుత్వం అనుసరించే వ్యూహాలు ఏంటి ?**

**సిఎం :** తీవ్రమైన దారిద్ర్యాన్ని నిర్మూలించే ప్రాజెక్టులో మీరు చూసినట్టైతే, లైఫ్ మిషన్ ద్వారా గృహ నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పనకు, అలాగే ఆరోగ్యం, ఆహార పంపిణీ, విద్యాసాయం వంటి సంక్షేమ చర్యలు, ఉజ్జీవన పథకం ద్వారా ఉపాధి అవకాశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వబడింది. దీనితో పాటూ రోడ్ నెట్‌వర్క్స్, వాటర్ మెట్రో, కెఎస్‌ఆర్‌టిసి పునరుద్ధరణ వంటి అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. అభివృద్ధి పట్ల మేం సమగ్ర దృక్పథాన్ని కలిగి వున్నాం.

**ధర్మాధామ్ భారతదేశంలోనే తొలి దుర్భర దారిద్ర్య విముక్తి నియోజకవర్గంగా మారింది. ఆ నియోజకవర్గం ఎంఎల్ఎగా ఈ విజయాన్ని మీరు ఎలా చూస్తారు?**

**సిఎం :** తీవ్రమైన దారిద్ర్యం నుండి బయటపడిన తొలి నియోజకవర్గంగా ధర్మాధామ్ ఖ్యాతి నొందడమంటే.. ఇదేమీ వ్యక్తిగత విజయం కాదని నేను స్పష్టంగా చెప్పదలచుకున్నాను. అయితే, ఇదంతా సమాజంలోని అన్ని తరగతుల సమిష్టి కృషితో సాధించిన ఫలితమేనన్నారు. ఈ విజయంలో అత్యంత కీలకమైన అంశం ఏమంటే ఎల్ఎస్‌జిడి సంస్థల మద్దతుతో ఎల్ఎస్‌జిడి విభాగం సాగించే సమిష్టి కృషి, ఆరోగ్య, ఇతర విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, కుటుంబశ్రీ, లైఫ్ మిషన్, అన్నింటికంటే ఈ నియోజకవర్గ ప్రజలు. అత్యంత భయంకరమైన దారిద్ర్యం నుండి బయటపడిన రాష్ట్ర హోదాను సాధించేందుకు కేరళ సాగించిన ప్రయాణానికి ఇదొక అద్భుతమైన నమూనా. అలాగే ఇతర నియోజకవర్గాలకు, రాష్ట్రాలకు ఇది ఒక అదర్శప్రాయమైన నమూనా. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఇదొక ఉదాహరణ. అందరికీ ఆరోగ్యం, ఆహారం, జీవనోపాధి, ఇళ్ళు, విద్యకు హామీ కల్పించబడింది. ప్రజల జీవన ప్రమాణాల అభ్యున్నతికి, అలాగే అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా చూసేందుకు ప్రభుత్వం ఎలా కట్టుబడి వుందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

**మానవ వికాసంలో, ఇంకా అనేక అభివృద్ధి ప్రాధాన్యతల్లో కేరళ దేశంలోకెల్లా నెంబర్ వన్‌గా వుంది. కానీ, చాలా ప్రచార సంస్థలు డేటాను పట్టించుకోవడం లేదు. ఇందుకు ఉదాహరణ.. 'ది కేరళ స్టోరీ' చిత్రం, జాతీయ గుర్తింపు దృష్ట్యా దానికి వచ్చిన మద్దతు. దేశంలోకెల్లా కేరళను పెద్దగా అర్థం చేసుకున్నది తక్కువ అని మీరు అనుకుంటున్నారా?**

**సిఎం :** మానవ వికాస సూచీలో, ఇతర అభివృద్ధి ప్రాధాన్యతల్లో కేరళ దేశంలో కెల్లా నెంబవర్ వన్ స్థానంలో వుందన్నది వాస్తవం. అక్షరాస్యత, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, శిశు మరణాలు తక్కువగా వుండడం వంటి అనేక రంగాల్లో కేరళ ఉన్నత అధిరోహాలు సాధించింది. అయితే, జాతీయ స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించిన 'ది కేరళ స్టోరీ' చిత్రం వంటి కొన్ని ప్రచారాలు కేరళకు సంబంధించిన ఈ అభివృద్ధి ప్రచారాలకు ఏ మాత్రమూ సంబంధం లేకుండా నిర్దిష్ట వైఖరులను ప్రచారం చేసే ప్రయత్నాల్లో భాగం కావచ్చు. ఇందుకు రెండు కారణాలు వుండవచ్చు. మొదటిది, అభివృద్ధి నమూనాపై భిన్నమైన అభిప్రాయాలు. ఒక వర్గం ప్రజలు కేరళ అభివృద్ధి నమూనాను ఆమోదిస్తున్నారు. అదే సమయంలో మరొక వర్గం ప్రజలు దీన్ని అభివృద్ధి కోణంలో కాకుండా భిన్నమైన రాజకీయ లేదా సామాజిక కోణంలో చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రచార వ్యూహాల ప్రభావం మరో కారణం. సామాజిక మాధ్యమాలు, సినిమా వంటి కళా రూపాల ప్రభావం సమాజంలో చాలా ఎక్కువగా వుంటుంది. ఈ మాధ్యమాల ద్వారా వ్యాప్తి చెందే కథలు తరచుగా వాస్తవిక పరిస్థితుల కన్నా కూడా ప్రజల భావోద్వేగాలను ప్రభావితం చేస్తాయి. అటువంటి ప్రయత్నాలు జాతీయ స్థాయిలో కేరళను భిన్నంగా చూపించవచ్చు, కానీ అది వాస్తవికతకు చాలా దూరం. కేరళను సక్రమంగా దేశంలో అర్థం చేసుకున్నారా? లేదా? అంటే నేను నిర్దిష్టంగా సమాధానం ఇవ్వలేను. అయితే, అభివృద్ధి, వాస్తవికతలను మించి నిర్దిష్ట కథనాలు సమాజాన్ని ఏ రీతిన ప్రభావితం చేస్తాయనడానికి ఈ పరిస్థితి ఒక సూచిక.

**కుటుంబశ్రీ ఒక జాతీయ నమూనా. తీవ్రమైన దారిద్ర్యాన్ని పారద్రోలే లక్ష్యాన్ని సాధించడంలో కుటుంబశ్రీ పాత్ర ఏమిటి?**

**సిఎం :** భయంకరమైన పేదరికాన్ని సమూలంగా నిర్మూలించే ప్రయత్నాల్లో కుటుంబశ్రీ కీలక పాత్ర పోషించింది. కుటుంబశ్రీ మద్దతుతో ఉజ్జీవనం పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించాం. ఈ ప్రాజెక్టు ద్వారా తీవ్రమైన పేదరికాన్ని అనుభవిస్తున్న కుటుంబాలకు ఉపాధి శిక్షణ, మైక్రో ఫైనాన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సాయం అందచేయబడింది. జనకీయ హోటళ్ళ ద్వారా కుటుంబశ్రీ ఆహారాన్ని పంపిణీ చేసింది. కుటుంబశ్రీ ఉజ్జీవనం ప్రాజెక్టు ద్వారా 4394 కుటుంబాలకు ఆదాయ వనరు కల్పించబడింది.

**తీవ్రమైన పేదరికం అనేది కనిపించని దారిద్ర్యం. దీన్ని గుర్తించడం చాలా కష్టం. ఎక్కడా ఎప్పుడూ కూడా లెక్కలోకి రాని ఈ కనిపించని పేదలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడం ప్రభుత్వానికి ఎంత ముఖ్యం?**

**సిఎం :** తీవ్రమైన దారిద్ర్యంలో జీవిస్తున్నవారిని గుర్తించడమనేది నిజంగా ఒక సవాలు. అందుకే ప్రభుత్వం ఒక విశిష్టమైన పద్ధతిని ఆమోదించింది. నిరుపేదలను గుర్తించేందుకు కుటుంబాల స్థాయిలో డేటాను సేకరించాలని భావించింది. ఆరోగ్య సమస్యలు, పోషకాహార లోపం, ఆదాయ లేమి, తల దాచుకునే ఆశ్రయం లేకపోవడం వంటి దుర్భరమైన దారిద్ర్యానికి దారి తీసే కారణాల ప్రాతిపదికన ఇదంతా జరిగింది. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఆరోగ్య కార్డులు తదితర ముఖ్యమైన గుర్తింపు కార్డులను వేగంగా జారీ చేసేలా అతివేగంగా క్యాంపెయిన్ రూపొందించబడింది. ఈ కార్డులు వారికి ఇతర సంక్షేమ సేవలను సులభంగా అందుకునేందుకు సాయపడతాయి. ఆ రకంగా కంటికి కనిపించని దారిద్ర్యాన్ని ప్రభుత్వం పరిష్కరించింది.

## జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మదనపల్లి విద్యార్థిని

ప్రజాశక్తి–మదనపల్లె అర్బన్

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మదనపల్లె విద్యార్థిని తన్మయ ఎంపికైంది. సెప్టెంబర్ నెలలో నాయుడుపేటలో జరిగిన అండర్–16 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తన్మయ పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబర్చడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. నవంబర్ 18వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అనంతపురం ఆర్‌డిటిలో నిర్వహిస్తున్న టైర్1 జాతీయ జూనియర్ బాలికల ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున తన్మయి పాల్గొంటారని జిల్లా అధ్యక్ష కార్యదర్శి దిలీప్‌కుమార్, మురళీధర్, తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు మురళీమోహన్‌రాజు, విజయలక్ష్మి, స్కూల్ గేమ్స్ ఉపాధ్యక్షుడు జాన్ కమలేష్, జి.సాగర్, సంయుక్త కార్యదర్శులు మహేంద్రనాయక్, క్రీడా భారతి కార్యదర్శి నరేష్‌బాబు, కోచ్‌మహేంద్ర, అభిలాష్ అభినందించారు.

# అర్ధరాత్రి అంగన్‌వాడీ కేంద్రం కూల్చివేత

- గుర్తుతెలియని వ్యక్తుల బరితెగింపు

ప్రజాశక్తి– పొందూరు (శ్రీకాకుళం జిల్లా)

పొందూరు మండలం కొంచాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి కూల్చివేశారు. నిర్మాణ శిథిలాలు కూడా తరలించి ఆనవాళ్లు లేకుండా చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 45–22 ఎల్‌పిఎం నంబరు 953లో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. దశాబ్దాలుగా వినియోగించిన ఈ కేంద్రం శిథిలావస్థకు చేరడంతో, 2023లో గ్రామంలోని ప్రైవేటు భవనంలోకి మార్చారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని తొలగించాలని ఐసిడిఎస్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ ప్రాంతంలో నూతన అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇంతలో రాత్రికి రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఉదయం విధులకు వచ్చిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, విఆర్‌ఒ ప్రకాశరావు కూల్చివేసిన అంగన్‌వాడీ కేంద్రం ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామస్తులను ఆరా తీయగా ఎవరూ తెలీదని బదులిచ్చారు. ఈ ఘటనపై అధికారులు పొందూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


కూల్చివేసిన అంగన్‌వాడీ కేంద్ర స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



## పారిశ్రామిక ఎస్టేట్లలో తగ్గనున్న పచ్చదనం

- నిబంధనలు సడలించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** పారిశ్రామిక ప్రాజెక్టుల్లో చెట్లు, మొక్కల పెంపకానికి ఉద్దేశించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సడలించింది. పారిశ్రామిక ప్రాజెక్టులకు చెందిన భూభాగంలో 33 శాతం చెట్లు, అడవుల పెంపకం చేపట్టాలని గతంలో నిబంధనలు ఉండేవి. సవరించిన నిబంధనల ప్రకారం పారిశ్రామిక ఎస్టేట్లు 10 శాతం విస్తీర్ణంలో ప్లాంటేషన్ చేపడితే సరిపోతుంది. ఇక పరిశ్రమ అయితే తన ప్రాజెక్ట్ ప్రాంతంలో 15 శాతాన్ని గ్రీన్ బెల్ట్‌కు కేటాయించాల్సి ఉంటుంది. కొత్తగా ఏర్పాటు చేసే పారిశ్రామిక ఎస్టేట్లు, పార్కులు, పరిశ్రమలకు కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ గ్రీన్ బెల్ట్ విస్తీర్ణాన్ని కుదించింది. ఈ మేరకు గత నెల 29న ఆఫీస్ మెమొరాండం జారీ చేసింది. తాజా నిబంధనలు పాటించినప్పుడే వాటికి పర్యావరణ అనుమతులు మంజూరవుతాయి. మంత్రిత్వ శాఖ నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు 2006లో గ్రీన్ బెల్ట్ నిబంధనలను రూపొందించింది. నూతన నిబంధనల ప్రకారం పారిశ్రామిక ఎస్టేట్‌లో కనీసం పది శాతం విస్తీర్ణాన్ని కామన్ గ్రీన్ ఏరియాగా అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అంటే హెక్టారుకు కనిష్టంగా వేయి చెట్లను పెంచాలి. ఇండస్ట్రియల్ ఎస్టేట్ యజమాని వీటిని అభివృద్ధి చేయాలి. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పరిశ్రమ పెట్టే ప్రతి ఒక్కరూ కేటగిరీని బట్టి తమ ప్రాంగణంలో అదనంగా 10–15 శాతం గ్రీన్ బెల్ట్‌ను ఏర్పాటు చేయాలి. గ్రీన్ బెల్టును సాధ్యమైనంత వరకూ కాలుష్య వనరుకు సమీపంలో ఉంచాలి. పారిశ్రామిక ఎస్టేట్ వెలుపల పరిశ్రమలు నెలకొల్పే వారు తమ ప్రాజెక్టులో 10–25 శాతాన్ని గ్రీన్ బెల్ట్ కోసం కేటాయించాలి.

## మెరుగుపడినా.. 'పూర్' కేటగిరిలోనే గాలి నాణ్యతలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యతలు స్వల్పంగా కొంత మెరుగుపడ్డాయి. అయినా గాలి నాణ్యతలు అత్యంత తీవ్ర కేటగిరిలోనే ఉన్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) పేర్కొంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు 268 ఎక్యూఐ నమోదైంది. దీంతో ఎక్యూఐ స్థాయిల్ని 'పూర్' కేటగిరీగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వర్గీకరించింది.

## నేడు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవ సభ శుక్రవారం ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆలోచనా హాలులో జరగనుందని ఉపకులపతి పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కుటుంబ సంక్షేమ, ఆరోగ్యశాఖ సెక్రటరీ సౌరభ్‌గౌర్, అతిథులుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి, ఆయుష్ విభాగం డైరెక్టర్ దినేష్‌కుమార్, రాష్ట్ర వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ ఆర్.రఘునందన్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. దేశంలో వైద్య విశ్వ విద్యాలయాల్లో మొట్టమొదటిదిగానూ, అతి పెద్దదిగా చరిత్రలో నిలిచిందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నిరంతరం వైద్య రంగంలో వస్తున్న మార్పులను అన్వయించుకుంటూ నాణ్యమైన, పారదర్శకమైన, సృజనాత్మక వైద్య విద్యను అందిస్తున్నామని వివరించారు. యూనివర్సిటీ పరిధిలో 356 వరకూ అనుబంధ కళాశాలలు కూడా ఉన్నాయన్నారు. వీటిలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్, డాక్టోరల్, సూపర్ స్పెషాలిటీ, డెంటిస్ట్రీ, పిహెచ్‌డి వంటి 129 వరకూ కోర్సులు ఉన్నాయని వివరించారు. యుజిసి గుర్తింపుతోపాటుగా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సి), సెంట్రల్ కౌన్సిలర్ ఆఫ్ హోమియోపతి (సిసిహెచ్), సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ (సిసిఎం)తోపాటుగా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) ద్వారా గుర్తింపు పొందిన యూనివర్శిటీగా పేరుగాంచిందన్నారు. సుమారుగా 30వేల మంది వరకూ వైద్య విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు.

## వేటకొడవలితో విద్యార్థి హల్‌చల్

ప్రజాశక్తి – కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో బిటెక్ విద్యార్థి వేట కొడవలితో హాల్‌చల్ చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..బిటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలాజీ నాయక్, అజయ్ నాయక్‌లు స్నేహితులు. గురువారం ఉదయం వీరి మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణను మనసులో పెట్టుకుని నగరంలోని ఓ దుకాణంలో వేట కొడవలిని అజయ్ నాయక్ కొనుగోలు చేసి తన బ్యాగులో యూనివర్సిటీకి తీసుకువచ్చాడు. రాత్రి బాలాజీ నాయక్ హాస్టల్ గది దగ్గరకు వెళ్లి దాడికి యత్నించాడు. తోటి విద్యార్థులు గమనించి అజయ్ నుంచి కత్తిని లాగేసుకున్నారు. వెంటనే వర్సిటీ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం వర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు ఆదేశాలతో ఉన్నతాధికారులు కర్నూలు తాలూకా పోలీసులకు సమాచారం చేరవేశారు. అజయ్ నాయక్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు.

## శ్రీశైలం ఒక గేట్ ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి – శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి ఎగువ లోతట్టు ప్రాంతాల నుండి (లోకల్ ఎన్ క్యాచ్ మెంట్) మొంథా తుపాన్ కారణంగా నీటి ప్రవాహం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ఒక గేటును 10 అడుగుల మేర ఎత్తి సాగర్‌కు 27,937 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదన ద్వారా మాత్రమే 46,211 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 22,230 క్యూసెక్కులు, హంద్రీ నుండి 250 క్యూసెక్కులు వెరసి జరాశయానికి 68,691 క్యూసెక్కులు చేరుతున్నాయి. అదే సమయానికి జలాశయ నీటిమట్టం 885 అడుగులకు గాను 884.60 అడుగుల గరిష్ట స్థాయికి చేరువలో ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 అడుగుల టిఎంసిలకు గాను ప్రస్తుతం 213.4011 టిఎంసిలుగా నమోదైంది. అలాగే శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు, మహాత్మా కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నీటి విడుదలను నిలిపి వేశారు. హంద్రీ నీవా సుజల స్రవంతికి మాత్రమే 2,824 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటలలో తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 35,315 క్యూసెక్కుల నీటితో 16.9 85 మిలియన్ యూనిట్ల విద్యుత్తును, కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో 27,041 క్యూసెక్కుల నీటితో 9.720 మిలియన్ యూనిట్ల విద్యుత్‌తో దిగువ సాగర్‌కు 62,356 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## ఎస్‌వి జూ పార్క్‌లో వాలాబీ మృతి

ప్రజాశక్తి–తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్క్‌లో ఒక మగ వాలాబీ మరణించినట్లు జూక్యూరేటర్ సెల్వం తెలిపారు. గుజరాత్‌కు చెందిన రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుండి ఈ ఏడాది ఆగస్టు 27న ఒక జత మీర్‌కాట్స్, ఒక జత కామన్ మార్మోసెట్స్‌తో సహా ఒక జత ఎర్రమెడ గల వాలబీస్‌ను విరాళంగా ఇచ్చారన్నారు. ఈ వాలాబీకి ఆరోగ్యం బాగులేక పోవడంతో మృతి చెందిందన్నారు. ప్రోటోకాల్ ప్రకారం మృతదేహాన్ని సమగ్ర పోస్టుమార్టం పరీక్ష కోసం శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని పాథాలజీ విభాగానికి తరలించామన్నారు. మరణానికి కారణం టాక్సోప్లాస్మోసిస్ అని నిర్ధారించిన డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌మార్టం నిర్వహించారన్నారు. అనంతరం మృతదేహాన్ని తిరుపతిలోని ఎస్‌వి జూలాజికల్ పార్క్‌లోని పోస్ట్‌మార్టం కాంప్లెక్స్‌లో ఖననం చేయడం జరిగిందన్నారు.



# చరిత్ర పుటల్లో.. టీమిండియా అమ్మాయిలు

## • అదే జోష్‌తో టైటిల్ కొట్టాలి • 2న దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరు

ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళలజట్టు అంచనాలకు మించి రాణించింది. ముఖ్యంగా ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన సెమీస్ విజయమే ఇందుకు ఒక నిదర్శనం. ఈ విజయం టీమిండియాకు ఆషామాషీగా ఏమీ దక్కలేదు. డిఫెండింగ్, ఏడుసార్లు టైటిల్ విజేత ఆసీస్‌తో మ్యాచ్ అంటేనే ఏ జట్టుకైనా చెమటలు పడతాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా.. ప్రతి విభాగంలోనూ పటిష్టంగా ఉన్న ఆసీస్.. ఈ ప్రపంచకప్‌లో ఆడిన ఏడు మ్యాచుల్లో గెలుపుతో గ్రూప్ టాపర్‌గా నిలిచి దర్జాగా సెమీస్‌కు చేరింది. మరోవైపు టీమిండియా తొలి రెండు మ్యాచుల్లో నెగ్గినా.. ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచుల్లో ఓడి అభిమానుల ఆశలను అడియాశలు చేసింది. ఈ క్రమంలో న్యూజిలాండ్‌తో జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో గెలిచి సెమీఫైనల్‌కు చేరింది. అలాంటి జట్టు నిర్దేశించిన 339 పరుగుల భారీ లక్ష్యాన్ని హర్మన్ ప్రీత్ సేన ఛేదించడం వర్ణణాతీతం. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన త్వరగా పెవీలియన్‌కు చేరినా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ టీమిండియాను గెలుపు తీరాలకు చేర్చారు. వీరిద్దరూ కలిసి 3వ వికెట్‌కు ఏకంగా 167పరుగులు జతచేశారు. ధాటిగా ఆడే క్రమంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పెవీలియన్‌కు చేరినా.. జెమీమా రోడ్రిగ్స్ చివరి వరకు క్రీజ్‌లో నిలిచి టీమిండియాను గెలిపించింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 156 బంతుల్లో 167 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. హర్మన్ ప్రీత్ ఔట్ అయినా.. జెమీమా మాత్రం పట్టువదల్లేదు. ఆఖరి వరకు క్రీజులో నిలబడి భారత జట్టును మూడో సారిఫైనల్‌కు చేర్చింది.



**సెమీస్‌లో ఆస్ట్రేలియాపై సంచలన విజయం సాధించిన భారత మహిళల జట్టు ఒక ప్రపంచ రికార్డును తమ పేరిట లిఖించుకుంది. మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో భారీ లక్ష్యాన్ని(339పరుగులు) ఛేదించిన తొలి జట్టుగా రికార్డు పుటల్లోకెక్కింది. ఇంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియా(331 పరుగులు) పేరిట ఉండేది.**

తొలి వన్డే ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడేందుకు భారత మహిళల జట్టు అడుగు దూరంలో నిలిచింది. ఐసిసి మహిళల ప్రపంచకప్-2025 ఫైనల్లో భారత్ అడుగుపెట్టింది. గురువారం నవీ ముంబై వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన సెకెండ్ సెమీఫైనల్లో 5 వికెట్ల తేడాతో విజయం సాధించిన టీమిండియా తమ ఫైనల్ బెర్త్‌ను ఖారారు చేసుకుంది. నవంబర్ 2న నవీ ముంబయి వేదికగా జరిగే ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. 2005, 2017లలో ఫైనల్‌కు చేరిన టీమిండియా రన్నరప్‌తో సరిపుచ్చుకోగా.. ఈసారి ఎలాగైనా టైటిల్‌కొట్టాలనే దృఢ నిశ్చయంతో టీమిండియా అమ్మాయిలు చెమటోడ్చుతున్నారు.

**పడిలేచిన టీమిండియా అమ్మాయిలు..**

గ్రూప్ దశలో హర్మన్‌ప్రీత్ సేన ప్రదర్శన అభిమానుల అంచనాలను అందుకోలేకపోయింది. టోర్నీ ప్రారంభంలో శ్రీలంక, పాకిస్తాన్‌లపై గెలిచిన టీమిండియా.. ఆ తర్వాత జరిగిన మూడు మ్యాచుల్లో వరుసగా ఓటమిపాలైంది. న్యూజిలాండ్‌పై గెలిస్తేనే సెమీస్ బెర్త్ దక్కుతుందనుకున్న దశలో 53పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకున్నారు. టోర్నీలో ఆడిన ఏడు లీగ్ మ్యాచుల్లో తడబడ్డ భారత్.. కీలక సెమీస్ పోరులో మాత్రం అంచనాలకు మించి రాణించింది. నవీ ముంబయిలోని డాక్టర్ డివై పాటిల్ స్టేడియంలో గురువారం జరిగిన సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను 5వికెట్ల తేడాతో మట్టికరిపించి 8ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సగర్వంగా ఫైనల్ చేరింది. అంతకుముందు విశాఖపట్నం వేదికగా జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా జట్టు ఆస్ట్రేలియా ముందు 331 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచినా.. ఆ జట్టు 49ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. అలాంటి జట్టు టీమిండియా ముందు 339 పరుగుల లక్ష్యం ఉంచితే.. హర్మన్‌ప్రీత్ సేన మరో 9 బంతులు మిగిలి ఉండగానే ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఆసీస్‌పై బదులు తీర్చుకుంది.

**కోహ్లీ స్పందన..**

సంచలన విజయాలతో ఫైనల్‌కు చేరిన భారత మహిళలజట్టుకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ట్వీటం "(ఎక్స్)లో స్పందించాడు. ఆస్ట్రేలియాలాంటి బలమైన ప్రత్యర్థిపై మన జట్టు అద్భుతమైన విజయం సాధించింది. ఈ బిగ్ గేమ్‌లో జెమీమా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. అమ్మాయిలు గొప్ప ప్రదర్శన చేశారు. ధైర్యం, నమ్మకం, ఆత్మవిశ్వాసానికి ఇది నిజమైన ప్రతిరూపం. వెల్‌డన్, టీమ్ ఇండియా..!' అని పేర్కొన్నారు.

- స్పోర్ట్స్ డెస్క్

**2025 వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళలజట్టు ప్రదర్శన**

| | | |
|---|---|---|
| సెప్టెంబర్ 30 | : | శ్రీలంకపై 59పరుగుల తేడాతో గెలుపు |
| అక్టోబర్ 5 | : | పాకిస్తాన్‌పై 88 పరుగుల తేడాతో గెలుపు |
| 9(గురు) | : | దక్షిణాఫ్రికా చేతిలో 3వికెట్ల తేడాతో ఓటమి |
| 12(ఆది) | : | ఆస్ట్రేలియా చేతిలో 3వికెట్ల తేడాతో ఓటమి |
| 19(ఆది) | : | ఇంగ్లండ్ చేతిలో 4పరుగుల తేడాతో ఓటమి |
| 23(గురు) | : | న్యూజిలాండ్‌పై 53పరుగుల తేడాతో గెలుపు |
| 26(ఆది) | : | బంగ్లాదేశ్‌తో మ్యాచ్ వర్షంతో రద్దు |
| 30(శుక్ర) | : | సెమీస్‌లో ఆసీస్‌పై 5వికెట్ల తేడాతో గెలుపు |

**మహిళల వన్డే ప్రపంచకప్‌లో రికార్డు ఛేదనలు..**

| | | |
|---|---|---|
| 341 | : | ఇండియా – ఆస్ట్రేలియాపై 5వికెట్ల తేడాతో గెలుపు (నవీ ముంబయి) |
| 331 | : | ఆస్ట్రేలియా – ఇండియాపై 3వికెట్ల తేడాతో గెలుపు (విశాఖపట్నం) |
| 280 | : | ఆస్ట్రేలియా – ఇండియాపై 6వికెట్ల తేడాతో గెలుపు (అక్లాండ్) |
| 275 | : | దక్షిణాఫ్రికా – ఇండియాపై 3వికెట్ల తేడాతో గెలుపు (క్రైస్ట్‌చర్చ్) |
| 272 | : | ఆస్ట్రేలియా – దక్షిణాఫ్రికాపై 5వికెట్ల తేడాతో గెలుపు (వెల్లింగ్టన్) |

## ఆరోగ్యశ్రీ వైద్య సేవలు పున:ప్రారంభం

• నెట్‌వర్క్ ఆస్పత్రులతో చర్చలు సఫలం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ వైద్య (ఎన్‌టిఆర్ వైద్య) సేవలను పున:ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) అంగీకారం తెలిపింది. ఆశా ప్రతినిధులతో వైదారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం సచివాలయంలో చర్చలు జరిపారు. ప్రభుత్వ బకాయిలను వన్‌టైమ్ కింద చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి మంత్రి హామీ ఇచ్చారు. ఈ విధానంలో సమస్య శాశ్వత పరిష్కారానికి సిఎం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ విధానం అమల్లోకి వచ్చేలోగా మరో రూ.250 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. యూనివర్సిల్ హెల్త్ పాలసీ కింద తీసుకునే నిర్ణయాల్లో ఆశా ప్రతినిధులను భాగస్వాములను చేస్తామన్నారు. పెండింగులో ఉన్న ఆస్పత్రుల బిల్లుల పరిశీలనలకు యుద్ధ ప్రాతిపదికన సుమారు 50 మంది వైద్యులను నియమిస్తున్నట్లు చెప్పారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున రోగుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని వెంటనే వైద్య సేవలను కొనసాగించాలని తెలిపారు. ఈ మేరకు ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం కింద అన్ని సేవలనూ తక్షణమే పున:ప్రారంభిస్తామని మంత్రితో ఆశా ప్రతినిధులు చెప్పారు. యూనివర్సిల్ హెల్త్ స్కీం రూపకల్పన, అమలుకు ప్రభుత్వం, డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్‌తో కలిసి పనిచేస్తామన్నారు. ఈ చర్చల్లో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ సిఇఒ దినేష్, ఆశా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్ కుమార్, సిహెచ్ అవినాష్, కోశాధికారి నాగమల్లేశ్వరరావు, సలహా సభ్యులు వై రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న అజారుద్దీన్

## తెలంగాణ రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

• సిఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, లోక్‌సభ మాజీ సభ్యులు మహ్మద్ అజారుద్దీన్ (62) తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ వేదికగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అజహరుద్దీన్ చేత రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సహా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అజహరుద్దీన్ కుటుంబ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఈ స్థానానికి పోటీచేసిన అజహరుద్దీన్ 35.03 శాతం ఓట్లు సాధించినా రెండో స్థానానికి పరిమితమయ్యారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అజహరుద్దీన్ రానున్న తొమ్మిది రోజులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచారం చేయనున్నారు. జూబ్లీహిల్స్ ఉప నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా అజాహరుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడంపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు.

## నేటినుంచి విజయవాడలో 42వ సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలు

**ప్రజాశక్తి - విజయవాడ స్పోర్ట్స్**

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నేటినుంచి మూడ్రోజులపాటు 42వ సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలు జరగనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ-యన్.టి.ఆర్., విజయవాడ, చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తాయన్నారు. ది:01-11-2025 నుండి ది. 03-11-2025 వరకు ఐ.జి.యమ్.సి. స్టేడియంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ బాలురు-బాలికల విభాగాల్లో అంతర్ జిల్లాల ఆర్చరీ చాంపియన్ షిప్‌ను నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుండి సుమారు 200 మంది ఆర్చర్లు, అధికారులు పాల్గొంటారని, ఈ చాంపియన్ షిప్‌లో ఎంపికైన ఆర్చరీ జట్లు నవంబర్‌లో అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగే సబ్-జూనియర్ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.ఎ.ఎ. ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, గౌరవ కార్యదర్శి బెవర వెంకట రమ, కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వి.వేణుగోపాల్రావు(బుజ్జి), కార్యదర్శి చెరుకూరి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ వైద్యం

• ఉత్తర్వులు జారీ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ స్కీమ్‌లో చేరాలనుకునే వారు సింగిల్ పేమెంట్ కింద సూపరింటెండెంట్ కేటగిరి వారు రూ.38,572 జమ చేయాల్సి ఉంటుంది. అసిస్టెంట్ మేనేజరు ఆపై ర్యాంకు ఉన్నవారు రూ.51,492 జమ చేయాల్సి ఉంటుంది. వీరికి రిటైర్డు ఉద్యోగి, ఆయన సతీమణికి కూడా వైద్యసాయం అందిస్తారు. ఆర్‌టిసి హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యం, మందులు ఇస్తారు. ఒకవేళ ఆర్‌టిసి హాస్పిటల్స్‌లో దానికి సంబంధించిన వైద్యం అందుబాటులో లేకపోతే ప్రభుత్వం ఇహెచ్‌ఎస్ హాస్పిటల్స్‌కు.. ఆర్‌టిసి హాస్పిటల్స్ రిఫర్ చేయొచ్చని పేర్కొన్నారు. అత్యవసరమైన వైద్యంలో ప్రభుత్వ అనుమతి ఉన్న ఇహెచ్‌ఎస్ హాస్పిటల్స్‌లో వైద్యం చేసుకునే అవకాశం కల్పించింది. అనంతరం ఆర్‌టిసి ఆస్పత్రిలో అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ అత్యవసరమైన పరిస్థితిలో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటే వారికి రీయింబర్స్‌మెంట్‌కు ఆర్‌టిసి అనుమతితో అప్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. చలానా తదితర వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

**ముఖ్యమంత్రికి ఎపి కార్మిక పరిషత్ కృతజ్ఞతలు**

ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులకు వైద్య సౌకర్యం కల్పించాలని తాము సిఎంను కలిసి కోరిన వెంటనే ఇహెచ్‌ఎస్ గైడ్‌లైన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేయడం పట్ల ఎపిపిటిడి కార్మిక పరిషత్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌వి శేషగిరిరావు, జనరల్ సెక్రటరీ వై శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత కలకలం

**ప్రజాశక్తి - చంద్రగిరి (తిరుపతి జిల్లా) :**



శ్రీవారి మెట్టు మార్గంలో 150వ మెట్టు వద్ద సంచరిస్తున్న చిరుత

తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, శ్రీనివాస మంగాపురం నుండి తిరుమలకు వెళ్లే నడకదారి, శ్రీవారి మెట్టు మార్గంలో తాజాగా మళ్లీ చిరుత సంచారం యాత్రికులలో కలకలం సృష్టించింది. 150వ మెట్టు సమీపంలో శుక్రవారం ఉదయం యాత్రికులు చిరుతను చూసి భయాందోళనకు గురై కేకలు వేయడంతో అది అక్కడి నుంచి పారిపోయింది. టిటిడి సెక్యూరిటీ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. యాత్రికులను గుంపులు గుంపులుగా పంపుతున్నారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేసి, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సాధారణంగా, శ్రీవారి మెట్టు మార్గంలో రాత్రి ఆరు గంటల తర్వాత యాత్రికులను అనుమతించరు. వన్యప్రాణుల సంచారం కారణంగా ఈ నిబంధన అమలులో ఉంది. గతంలోనూ, ముఖ్యంగా సెప్టెంబర్ 2024, జూన్ 2025లో ఈ మార్గంలో చిరుతల సంచారం నమోదైంది. ఈ నేపథ్యంలో టిటిడి అధికారులు యాత్రికులకు తగిన జాగ్రత్తలు చెబుతూ, అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## మైనార్టీలకు ఉచిత టెట్ కోచింగ్

• మంత్రి ఎన్‌ఎమ్‌డి ఫరూక్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

విద్యాశాఖ నిర్వహించబోయే టెట్ పరీక్షకు హాజరయ్యే మైనార్టీ యువతకు ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎమ్‌డి ఫరూక్ తెలిపారు. ఎపి మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యాన సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సిఇడిఎం) సహకారంతో మైనార్టీ యువతకు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబరు 10 నుంచి టెట్ పరీక్షలు ఉండనున్నాయన్నారు. నవంబరు మొదటి వారం నుంచి మైనార్టీలకు ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇతర వివరాలకు సిఇడిఎం వెబ్‌సైట్‌ను షషష.ఖజూఎవసఎఎషు.శీతీస్ర సందర్శించాలన్నారు. భవానీపురంలోని సంస్థ కార్యాలయంలోనూ సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సంస్థ ఫోన్ నెంబరు 0866-2970567, 7386789966కు ఫోన్ చేయొచ్చన్నారు.

## ఇన్సూరెన్స్ కట్టకపోయినా పరిహారం

• టిడిపి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఇన్సూరెన్స్ కట్టకపోయినా నష్టపోయిన ప్రతి ఎకరాకూ పరిహారం ఇస్తామని, నష్టపోయిన పంటను కొంటామని టిడిపి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తెలిపారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆపద సమయంలో ప్రభుత్వానికి, ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ వ్యాఖ్యలు చాలా బాధ కలిగిస్తున్నాయని అన్నారు. తుపాను రావడం ప్రభుత్వ వైఫల్యం వల్లేనని చెప్పడం జగన్ కనీస ఆలోచనా రాహిత్యాన్ని చూపుతుందని విమర్శించారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో తుపానులు వచ్చినా, వేలాది ఎకరాల పంట నష్టం జరిగినా ఆయన ఎప్పుడూ పంట చేనులో కాలుపెట్టలేదని తెలిపారు. కేవలం రాజకీయ కోణంలోనే మాట్లాడుతున్నారని, ప్రభుత్వంపై నిరంతరం బురద జల్లి రాజకీయ ప్రయోజనం పొందాలనే ఆలోచన తప్ప, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన లేదని విమర్శించారు.

## కేంద్రాన్ని తక్షణ సాయం కోరండి

• అధికారులకు సిఎం ఆదేశం

**ప్రజాశక్తి -అమరావతి బ్యూరో**

మొంథా తుపాన్‌తో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని తక్షణ సాయం కోరాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. తుపాన్ తదనంతర చర్యలపై ఉన్నతాధికారు లతో ఆయన శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణ సాయం కోరడానికి వీలుగా ప్రాథమిక నివేదికను కేంద్రానికి అత్యవసరంగా అందచేయాలని చెప్పారు. అదే విదంగా క్షేత్రస్థాయిలో పరిశీలనకు కేంద్రబృందాన్ని ఆహ్వానించాలన్నారు. తుది నివేదిక సమర్పించేలోగా తక్షణ సహాయం కోరలని, అ మేరకు అవసరమైన అన్ని వివరాలను కేంద్ర ప్రభుత్వానికి అందించాలన్నారు. ఈ విషయంపై ప్రధాని మోడీతో తాను కూడా మాట్లాడుతానని చెప్పారు మొంథా తుపాన్ రక్షణ చర్యల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారిని సన్మానించాలని సూచించారు. నవంబరు1 ఉదయం 10 గంటలకు 100మందిని సన్మానించుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కృష్ణ వరద ఉధృతిపై అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. మొంథా తుపాన్‌తో నీటమునిగిన పంట పొలాల్లోని నీటి నిల్వలను యుద్ధప్రాతిపదికన మళ్లించి రైతాంగాన్ని కాపాడాలని సూచించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీటి మునిగాయో గుర్తించి శనివారం కల్లా నీటిని మళ్లించాలన్నారు. నియోజకవర్గాల వారీగా శాటిలైట్ చిత్రాలను విడుదల చేయడంతో పాటు ఎక్కడైతే నీళ్లనిలిచిపోయాయో అక్కడకి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఆయన స్పష్టం చేశారు. అందరూ కలిసి సమన్వయంతో పనిచేయడం ద్వారా క్షేత్రస్థాయిలో ఫలితాలు రాబట్టాలని సూచించారు.



సిఆర్‌డిఎ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## జాప్యం లేకుండా రాజధాని పనులు

• నిర్దేశించుకున్న సమయంలో పూర్తి చేయాలి • సిఆర్‌డిఎ సమీక్షలో సిఎం ఆదేశం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాజధాని నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని అధికారులు, కాంట్రాక్టు సంస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి కావాలన్నారు. సిఆర్‌డిఎపై శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి, బ్యూటిఫికేషన్, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై సమీక్షించారు. ఏయే నిర్మాణాలను ఎంతవరకు పూర్తి చేశారు, వర్కుఫోర్స్ ఎంతుంది, నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్, మెషినరీని ఆయా సంస్థలు ఏ మేరకు సమకూర్చుకున్నాయనే అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్దేశిత సమయంలోగా వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో వేగంతోపాటు, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ప్రతి 15 రోజులకోసారి సమీక్ష చేస్తానన్నారు. ప్రస్తుతం వర్షాల వల్ల జాప్యం జరిగినా వచ్చేకాలంలో భర్తీ చేయాలని సూచించారు. కొన్ని నిర్మాణ సంస్థలు వర్కుఫోర్స్, మెషినరీని పూర్తిస్థాయిలో కేటాయించలేదని, ఇలా ఉన్న సంస్థలు తమ పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. గ్రావెల్ సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. ఈ మేరకు గనులశాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం జరగకుండా చూసుకోవాలన్నారు. 2,471 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు అందించాలని, సాంకేతిక సమస్యల వల్ల అవి పెండింగ్‌లో పడ్డాయని పేర్కొన్నారు. అమరావతికి వరల్డ్‌క్లాస్ లుక్ రావాలంటే హైరైజ్ భవనాలు ఉండాలని అధికారులకు సిఎం తెలిపారు.

# దుకాణదారులపై పోలీసు జులుం

## వ్యాపారులు, కార్మికులపై లాఠీతో విరుచుకుపడిన ఎస్‌ఐ



కాలుపై లాఠీగాయాన్ని చూపుతున్న బాధితుడు

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (ఎన్‌టిఆర్ జిల్లా)**

దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు జులుం ప్రదర్శించారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వ్యాపారులు, కార్మికులపై కొండపల్లి సెక్టార్ నూతన ఎస్‌ఐ పురుషోత్తం లాఠీ ఝుళిపించారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై వాతలు తేలాలా కొట్టారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. దుకాణాలు మూసివేస్తున్నామని చెబుతున్నా ఎస్‌ఐ మాట వినడం లేదని, దుకాణాలు పెట్టుకుని జీవనం సాగించే తమపై ఎస్‌ఐ ఇలా ప్రవర్తించడం సరికాదని దుకాణ నిర్వహకులు వాపోయారు. ఎస్‌ఐ తమ ప్రతాపాన్ని సాధారణ పౌరులపై కాకుండా నేరస్తులపై, నకిలీ మద్యం, బూడిద, గ్రావెల్ రవాణా మాఫియాపై చూపితే ప్రజలు హర్షించే వారని పలువురు స్థానికులు పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్ అమల్లో భాగంగానే సమయం దాటిన తర్వాత షాపులు తెరిచి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఏది ఏమైనా ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించడం ఫ్రెండ్లీ పోలీస్‌కి తూట్లు పోడవడమేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బెల్ట్ షాపులపై కఠిన చర్యలు : మంత్రి కొల్లు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ మద్యం నిర్మూలనకు సురక్షా యాప్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. సురక్షా యాప్‌ను 1.69 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని, 4,60,415 బాటిళ్లను స్కాన్ చేసినట్లు తెలిపారు. ప్రతి మద్యం దుకాణం, బార్‌లలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వెయ్యి కరపత్రాలు పంపిణీ చేయడంతోపాటు, రెండు పోస్టర్లు ప్రదర్శిస్తున్నారని వివరించారు. యాప్ ద్వారా స్కాన్ చేసిన అనంతరమే మద్యం బాటిళ్లను విక్రయించాలని ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 25 జిల్లాలను ఇప్పటికే ఐడి లిక్కర్ రహితంగా ప్రకటించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ పేర్కొన్నారు. కల్తీ మద్యం కేసులో దర్యాప్తు కొనసాగుతుందని, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాన్నామని తెలిపారు.

**లక్ష్యాలకనుగుణంగా పని చేయాలి**

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గనులశాఖ అధికారులు పని చేయాలని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. సచివాలయంలో గనులశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,320 కోట్లు ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా, అక్టోబరు నాటికి రూ.1,617 కోట్లు లక్ష్యంగా ఉండగా, రూ.1,584 కోట్లు సాధించినట్లు తెలిపారు. మేజర్ మినరల్స్ నుంచి రూ.404 కోట్లు, మైనర్ మినరల్స్ నుంచి రూ.1,180 కోట్లు సాధించినట్లు పేర్కొన్నారు. లీజుల కోసం 6,500 పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 30 నుంచి 45 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. లీజుల్లో 15 శాతాన్ని వడ్డెర సంఘాలకు రిజర్వు చేసి, వారి ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు తోడ్పాటునందించాలన్నారు. ఈ సమీక్షలో గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎపిఎమ్‌డిసి ఎమ్‌డి ప్రవీణ్ కుమార్, డిఎమ్‌జి చంద్రశేఖర్, జెడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక లీజుకు ఆలయ స్థలాలు

• జిఓ ఆర్‌టి నెంబరు1323 విడుదల

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

దేవాదాయశాఖకు చెందిన పట్టణాల్లోని ఖాళీ స్థలాలను వినియోగించుకునేందుకు దీర్ఘకాలిక ప్రాతిపదికన లీజుకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 1323ని ఆ శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేసేందుకు నలుగురు అధికారులను ప్రభుత్వం నియమించింది. ఇందులో ప్రభుత్వ కార్యదర్శి (రెవెన్యూ (దేవాదాయ) శాఖ), దేవాదాయశాఖ కమిషనరు, చీఫ్ ఇంజినీరు (దేవాదాయశాఖ), ప్రధాన ఆలయాల విషయంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి/ఇతర ఆలయాల విషయంలో సంబంధిత మల్టీ జోన్ జాయింట్ కమిషనరు సభ్యులుగా ఉండనున్నారు.

## తల్లిని హతమార్చిన కుమారుడికి జీవితఖైదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తల్లిని హతమార్చిన కేసులో కుమారుడికి జీవితఖైదు పడింది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పడమర వీధికి చెందిన డొక్కు హరికృష్ణ మద్యానికి బానిసై గతేడాది మే ఒకటో తేదీన తన తల్లి కృష్ణవేణిని మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కర్రతో ఆమె తలపై కొట్టి ఈడ్చుకుంటూ తీసుకెళ్లి రోడ్డుపై పడేశాడు. ఈ ఘటనలో ఆమె మృతి చెందారు. దీనిపై అప్పటి ఒకటో పట్టణ ఎస్ఐ లక్ష్మణ్‌బాబు కేసు నమోదు చేయగా రాజశేఖర్ కేసును దర్యాప్తు పూర్తి చేశారు. ఈ కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏలూరు ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# విదేశీ మారకం నిల్వల్లో భారీ పతనం

- వారంలో 6.9 బిలియన్ డాలర్ల తగ్గుదల
- ఆర్‌బిఐ వెల్లడి

**ముంబయి :** భారతదేశ విదేశీ మారకం నిల్వల్లో భారీ తగ్గుదల చోటు చేసుకుంది. అక్టోబర్ 24తో ముగిసిన వారంలో ఏకంగా 6.9 బిలియన్ డాలర్లు తగ్గి 695.355 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తెలిపింది. ఇది ఇంతక్రితం వారంలో నమోదైన 702.28 బిలియన్లతో పోల్చితే తగ్గుదలను సూచిస్తుందని వెల్లడించింది. ఫారెక్స్ నిల్వలలో ప్రధాన భాగం అయినా విదేశీ కరెన్సీ ఆస్తులు సమీక్షా వారంలో 3.862 బిలియన్ డాలర్లు తగ్గి 566.548 బిలియన్లకు పరిమితమయినట్లు ఆర్‌బిఐ తెలిపింది.



ఈ ఆస్తులలో యూరో, యెన్, పౌండ్ వంటి కరెన్సీలు డాలర్‌తో పోలిస్తే విలువలో హెచ్చు తగ్గులు చెందడం ఈ తగ్గుదలకు కారణం. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడంతో ఈ విలువ తగ్గింది. అదే సమయంలో బంగారం నిల్వలు 3.01 బిలియన్లు తగ్గి 105.536 బిలియన్లకు చేరాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్) 58 మిలియన్లు తగ్గి 18.664 బిలియన్ డాలర్లకు తగ్గాయని వెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారతదేశ నిల్వలు 6 మిలియన్ డాలర్లు పెరిగి 4.608 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. భారత విదేశీ మారకం నిల్వలు తగ్గితే ప్రధానంగా రూపాయిపై ఒత్తిడి పెరగనుంది.



## రక్షణ ఒప్పందంపై భారత్-అమెరికా సంతకాలు

**న్యూఢిల్లీ :** భారత్-అమెరికా మధ్య శుక్రవారం కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. 10 ఏళ్ల పాటు ఉండే ఈ ఒప్పందం ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక, భద్రతా సహకారాన్ని బలోపేతం లక్ష్యంగా కుదిరింది. మలేసియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశం సందర్భంగా భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్‌లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రక్షణ ఒప్పందంపై ఇరువురు మంత్రులు సంతకాలు చేశారు. 10 ఏళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందని హెగ్సెత్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇది ఇరుదేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్తుందన్నారు. సమన్వయం, సమాచారంతో పాటు సహకారాన్ని పెంచుకుంటామని.. మా రక్షణ సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని ఆయన రాసుకొచ్చారు. ఈ సమావేశం నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్, హెగ్సేత్‌ల మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం.



## గోదావరిలో విషపూరిత జలాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట

గోదావరి కాలువలో పలు పరిశ్రమల నుంచి విచ్చలవిడిగా వస్తున్న పరిశ్రమల వ్యర్థ జలాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. విషపూరిత వ్యర్థ జలాలు కలవడం వల్ల పశుపక్షాదులు చనిపోవడంతో పాటు పంటలు పలు రకాల వ్యాధులకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో రైతు సంఘం నాయకుడు కంటే జగదీశ్ మోహన్ ఆధ్వర్యంలో పలువురు రైతులు పాల్గొని ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షులు కంటే జగదీశ్ మోహన్ మాట్లాడుతూ.. వేట్లపాలెంఎగువ ప్రాంతాల్లోని పలు పరిశ్రమల నుంచి విషపూరిత వ్యర్థ జలాలు గోదావరి కాలువలో కొద్ది నెలలుగా కలుస్తున్నాయని, దీంతో కాలువ నీరు విపరీతమైన దుర్గంధం వస్తోందని తెలిపారు. ఈ నీటిని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలకు చెందిన లక్షలాదిమంది ప్రజలు తాగునీటిగా వినియోగిస్తున్నారని, పశుపక్షాదులు కూడా ఇదే నీటిపై ఆధారపడి ఉన్నట్లు తెలిపారు.

## ఆదాయ టార్గెట్‌లో 93 శాతాన్ని చేరిన బిఎస్ఎన్ఎల్

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ బిఎస్ఎన్ఎల్ ఆర్థిక సంవత్సరం 2025-26 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నిర్దేశించుకున్న ఆదాయ లక్ష్యంలో 93 శాతం సాధించి.. రూ.5,347 కోట్లకు చేరుకుందని కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య శిండే తెలిపారు. సేవల నాణ్యతను వారాలు, నెలల బదులు రోజువారీగా పర్యవేక్షించేందుకు మరింత కఠినమైన ప్రమాణాలు అనుసరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి గంటలు, రోజుల గడువులు విధించాలన్నారు. బిఎస్ఎన్ఎల్ త్రైమాసిక సమీక్ష అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో బిఎస్ఎన్ఎల్ ఆదాయం రూ.11,134 కోట్లకు చేరిందన్నారు. ఆదాయ లక్ష్యాలకు దగ్గరగా ఉందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో బిఎస్ఎన్ఎల్ ఆదాయాన్ని 20 శాతం పెంచి రూ.27,500 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఖర్చులపై నియంత్రణ ఉంచాలని నిర్దేశించుకున్నామన్నారు.



## 8న 'పెద్ది' అప్‌డేట్ వస్తోంది..

**రా**మ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న గ్రామీణ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం శ్రీలంకలో షూటింగ్‌లో ఉంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి క్రేజీ అప్‌డేట్‌ను దర్శకుడు షేర్ చేశారు. ఆస్కార్ విజేత, సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించే 'ది వండర్‌మెంట్ హైదరాబాద్' మ్యూజిక్ కాన్సర్ట్‌లో 'పెద్ది' సినిమా ఫస్ట్ సింగిల్ విడుదల కాబోతుందని వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ వార్తలకు బలం చేకూరుస్తూ.. బుచ్చిబాబు తాజాగా ఒక పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌లో 'రెహమాన్ కన్సర్ట్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నా. ఆరోజు పెద్ది కూడా అప్‌డేట్ ఉండబోతుంది. అప్పటివరకు వెయిట్ చేయడం'టూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ చిత్రంలో కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు, బాలీవుడ్ నటుడు దివ్యేందు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.




## బిఒబికి రూ.4,809 కోట్ల నికర లాభాలు

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) రూ.4,809 కోట్ల నికర లాభాలను ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.5,238 కోట్ల లాభాలతో పోల్చితే 8 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. గడిచిన క్యూ2లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.35,026 కోట్లకు తగ్గింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.35,445 కోట్ల ఆదాయం నమోదయ్యింది. 2025 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.16 శాతానికి పరిమితమయ్యాయి. 2024 ఇదే కాలం నాటికి 2.50 శాతం జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. గడిచిన క్యూ2 ముగింపు నాటికి నికర ఎన్‌పిఎలు 0.60 శాతం నుంచి 0.57 శాతానికి దిగివచ్చాయి.







## మారి సెల్వరాజ్ ఆర్థిక సహాయం

**భా**రత అండర్ -18 మహిళల కబడ్డీ జట్టు వైస్ కెప్టెన్ కార్తీకకు తమిళ దర్శకుడు మారి సెల్వరాజ్ రూ. 5 లక్షలు ప్రోత్సాహకంగా అందజేశారు. తమిళనాడుకు చెందిన కార్తీక ఇటీవల బహ్రెయిన్‌లో జరిగిన ఆసియా యూత్ గేమ్స్‌లో భారత్ తరపున స్వర్ణం సాధించారు. ఇప్పటికే కార్తీక జట్టుకు ముఖ్యమంత్రి స్టాలిన్ రూ. 20 లక్షలు అందించారు. భారత్‌తో పాటు తమిళనాడు కీర్తిని ఆమె పెంచిందంటూ ప్రశంసించారు. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న కార్తీక కుటుంబం పేదరిక సమస్యలతో ఇబ్బంది పడుతోంది.

అమె తల్లిదండ్రులు పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. ఇరాన్‌పై భారత్ గెలుపులో కార్తీక కీలక పాత్ర పోషించారు. ఆపై ఆమె ఇంటికి వెళ్లి రూ. 5 లక్షల చెక్కును బహుమతికి ఇచ్చారు. కన్నగి నగర్ కార్తీక మరిన్ని విజయాలు సాధించాలని సెల్వరాజ్ కోరారు

## వివాహబంధంలోకి 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు

**'టూ**రిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో దర్శకుడిగా తొలి అడుగు వేసిన అభిషన్ జీవింత్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. శుక్రవారం ఉదయం తన ప్రియురాలు అక్కీలని ఆయన పెళ్లి చేసుకున్నారు. 'టూరిస్ట్ ఫ్యామిలీ' ప్రీ-రిలీజ్ వేడుకలో అభిషన్ తన ప్రియురాలు అక్కీలపై ప్రేమను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 'అక్టోబర్ 31న నన్ను పెళ్లి చేసుకుంటావా?' అంటూ ఆ సమయం లోనే ఆయన ప్రపోజ్ చేశారు. పెళ్లి చేసుకున్న ఈ జంటకి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపు తున్నారు. ఈ సందర్భంగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్ర నిర్మాత మాగేశ్ రాజ్ పాసిలియన్ తమ తొలి చిత్రానికి మెగా విజయాన్ని అందించినందుకు అభిషన్‌కి బీఎండబ్ల్యూ కారును వెడ్డింగ్ గిఫ్ట్‌గా అందించారు.






## సంజయ్ దర్శకత్వంలో సందీప్ కిషన్

దళపతి విజయ్‌కుమార్ సంజయ్ దర్శకత్వంలో కథానాయకుడు సందీప్ కిషన్ మరో కొత్త సినిమాలో నటించబోతున్నారు. గతేడాది విడుదలైన మజాకా సినిమా నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో వచ్చినప్పటికీ, ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ కుమారుడు సంజయ్ విజయ్ దర్శకత్వంలో సందీప్ కిషన్ కథానాయకుడుగా ఒక బైలింగ్వెల్ మూవీ (తెలుగు- తమిళం) చేయబోతున్నారు. సంజయ్ దర్శకత్వంలో ఇదే తొలి సినిమా. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇదే సమయంలో సందీప్ కిషన్ దర్శకుడు కృష్ణ చైతన్య దర్శకత్వంలో 'పవర్‌పేట' సినిమా చేయ బోతున్నారు. జనవరిలో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లే అవకాశం ఉంది.



## అమెరికాకు తగ్గిన ఇంజనీరింగ్ ఎగుమతులు

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై విధించిన అధిక టారిఫ్‌లు ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో అమెరికాకు ఇంజనీరింగ్ ఎగుమతులు సెప్టెంబర్‌లో 9.4 శాతం తగ్గాయి. ట్రంప్ వేసిన 50 శాతం అదనపు టారిఫ్‌లతో 1.45 బిలియన్ డాలర్లకు ఎగుమతులు పరిమితమయ్యాయి. మరోవైపు ఉక్కు, అల్యూమినియం రంగాలపై టారిఫ్‌ల ప్రభావం తక్కువగా ఉంది. సెప్టెంబర్‌లో ఈ రెండు రంగాల నుంచి అమెరికాకు ఎగుమతులు పెరిగాయని ఇంజనీరింగ్ ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ తెలిపింది.



## మీకోసం

మెత్తగా దంచిన వాము చూర్ణాన్ని ఒక గ్లాసు మజ్జిగలో కలిపి తీసుకుంటే కఫం పలచబడుతుంది. శ్వాస మార్గాలు శుభ్రం అవుతాయి.

## జీవన సౌరభం


పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది.

# చిలుకమ్మ మాట



**మా**ధవ్, సుమతిల గారాలపట్టి గోపిక. తను చాలా గడసరి పిల్ల. ఒకరోజు సుమతి ఇంటి పెరట్లో ఉన్న జామచెట్టు దగ్గర గోపికకు కథలు చెప్తుతూ అన్నం తినిపిస్తోంది. ఆ జామచెట్టుపైన ఒక చిలుక జామపండు తింటూ కనబడింది. గోపిక ఆ చిలుక కావాలని మారాం చేసింది. 'నువ్వు అల్లరి చేయకుండా అన్నం తిన్నావంటే ఆ చిలుక నీతో మాట్లాడుతుంది' అని సుమతి గోపికకు అన్నం తినిపించింది. గోపిక అన్నం మొత్తం తిన్నాక చిలుకతో మాట్లాడింది. కానీ చిలుక తనకి బదులు చెప్పకపోవడంతో ఏడుపు మొదలుపెట్టింది. సుమతి ఎంత ప్రయత్నించినా గోపిక ఏడుపు ఆపడం లేదు. చిలుక కావాలి అని మారాం చేసింది. 'నాన్న సాయంత్రం వచ్చేటప్పుడు మాట్లాడే చిలుకను తెప్పిస్తా ఏడవకు' అని గోపికను ఓదార్చి మాధవ్‌కి ఫోన్ చేసి మాట్లాడే చిలుక బొమ్మ తెమ్మని చెప్పింది. మాధవ్ సాయంత్రం ఒక మాట్లాడే చిలుక బొమ్మను తెచ్చి గోపికకు ఇచ్చాడు. గోపిక ఎంతో సంతోషంతో చిలుకను తీసుకుని మాట్లాడటం లేదేంటి అన్నట్టు చూసింది. అప్పుడు చిలుక 'గోపిక నేను రామచిలుకను. మనిద్దరం ఇప్పటినుండి మంచి స్నేహితులం. నువ్వు ఏది చెప్పినా తిరిగి నీతో మాట్లాడతాను. కానీ నువ్వు ఎప్పుడూ అమ్మానాన్నలని బాధపెట్టకూడదు. అన్నం తిననని మారాం చేయకూడదు' అని చెప్పింది. గోపిక సరే అని చెప్పి చిలుక బొమ్మతో మాట్లాడటం మొదలుపెట్టింది. గోపిక ఏది చెప్పినా ఆదే విషయాన్ని చిలుక తిరిగిచెప్పేది. అప్పటినుండి గోపిక అల్లరి చేయకుండా బుద్ధిగా చిలుక బొమ్మతో ఆడుకుంటోంది. గోపికలో ఈ మార్పుకు సుమతి సంతోషించింది. చిలుకబొమ్మతో గోపిక మాట్లాడినప్పుడల్లా తను సమాధానం చెప్పేలా మాధవ్, ఓ చిప్‌ని అందులో అమర్చిన సంగతి వాళ్లెవరికీ తెలియదు.

– పుల్లట సంతోష్,
కవిటి, శ్రీకాకుళం జిల్లా.



## జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని చేప బొమ్మలు ఇచ్చాం. అయితే అవి రెండు భాగాలుగా చీలిపోయి ఉన్నాయి. మీరు జత చేయండి చూద్దాం. క్లూ ఉంది చూడండి.

## నేను గీసిన బొమ్మ





కె. అశ్వత్,
7వ తరగతి
జి.ప.ఉ.పా.నర్సింహులపల్లి,
పెద్దపల్లి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# ట్రోల్స్‌కి బ్యాట్‌తో సమాధానం

ప్రపంచ కప్ లక్ష్యం.. వాళ్లకి అడుగు దూరంలో ఉంది. ఐసిసి మహిళా వన్డే ప్రపంచకప్ కోసం తాజాగా జరిగిన సెమీఫైనల్లో మన క్రికెటర్లు అద్భుత ప్రతిభ చూపి ఫైనల్‌కి దూసుకుపోయారు. ముఖ్యంగా ఈ విజయంలో కీలక భూమిక పోషించిన జెమీమా రోడ్రిగ్స్ పేరు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మార్మోగిపోతోంది. అయితే మ్యాచ్ ముగిసిన క్షణం.. గ్రౌండ్‌లో జెమీమా తీవ్ర భావోద్వేగానికి గురైంది. జలపాతాల్లా కిందికి రాలుతున్న కన్నీళ్లని తుడుచుకుంటూ ప్రేక్షకులకి అభివాదం చేసింది. సాధారణంగా ఫైనల్ మ్యాచ్ దక్కించుకున్నప్పుడు క్రికెటర్లు అంతలా భావోద్వేగానికి గురవ్వడం ప్రేక్షకులకి కొత్త కాదు. కానీ జెమీమా పరిస్థితి అలా కాదు. ఆమె అంతలా ఏడ్వడానికి కారణం.. తన చుట్టూ ముళ్ల కంపలా చుట్టుముట్టిన ట్రోలింగ్స్.





**సో**షల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే జెమీమాని గతంలో అనేకసార్లు చాలా దారుణంగా ట్రోల్ చేశారు. 'మ్యాచ్ ఓడితే నవ్వుతోందని, క్రికెట్ బ్యాట్ కంటే గిటార్‌కే ప్రాధాన్యత ఇస్తుంది కాబట్టి తను క్రికెట్ స్టార్ కాదని, 'గిటార్ స్టార్' అని ట్రోల్ చేశారు. సోషల్ మీడియాలో ఎక్కువగా గడుపుతుందని 'సోషల్ మీడియా క్రికెటర్' అన్నారు. ఇన్ని అవహేళనల మధ్యే జెమీమా తన అభిరుచులతో పాటు తన చిరకాల ఆకాంక్ష అయిన క్రికెట్ కూడా తనకి ఎంతో ఇష్టమని నిరూపించిన ఆట ఇది. అందుకే ఆమె ఇంతలా భావోద్వేగమైంది.

**ఆల్‌రౌండర్..**

ముంబయిలో 2000 సంవత్సరంలో జన్మించిన జెమీమా నాలుగేళ్ల నుండే క్రికెట్ ఆటపై మక్కువ పెంచుకుంది. 2018 టీ 20 మ్యాచ్ ఆమెకి తొలి ఆట. ఆ సంవత్సరమే వన్డే క్రికెట్‌లో కూడా ఆడింది. క్రికెట్ ఒక్కటే కాదు, హాకీ, రేసింగ్, గిటార్.. ఇలా అన్నింటిలో ఆమె ఆల్‌రౌండర్. తన తండ్రే ఆమె క్రికెట్ తొలి గురువు. అందుకే 'నా మొదటి హీరో మా నాన్నే' అని ఎప్పుడూ చెబుతుంది. హాకీలో మహారాష్ట్ర నుండి అండర్ 17, అండర్ 19 జట్లకి ప్రాతినిధ్యం వహించింది. బాస్కెట్ బాల్, ఫుట్ బాల్ కూడా ఆడుతుంది. వంట చేయడం కూడా తనకి ఎంతో ఇష్టం. రేసింగ్‌లకి వెళ్లడం తనకి అలవాటు.

**పుస్తకాలు చదువుతుంది..**

'జీవితం అంటే సాదాసీదాగా బతకడం కాదు' అన్నది జెమీమా పాలసీ. అందుకే 'ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తూ బతకాలి' అని చెబుతుంది. తీరిక దొరికినప్పుడల్లా ప్రయాణాలు చేస్తుంది. ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం. 'ప్రకృతిలో గడపడం ఇంకా ఇష్టం' అంటుంది. బీచ్‌లో సూర్యోదయం, సూర్యాస్తమయం చూస్తూ ఎంజాయ్ చేయడం తనకి అలవాటు. పుస్తకాలు ఎక్కువగా చదువుతుంది. ఫ్రెండ్స్‌తో కలిసి సోషల్‌మీడియాలో రీల్స్ చేస్తుంది. కుటుంబానికి ప్రాధాన్యత ఇస్తుంది. గిటార్‌పై తనకిష్టమైన పాటలని ప్లే చేస్తుంది. పెంపుడు జంతువులంటే వల్లమాలిన ప్రేమ.

**క్రికెట్.. అభిరుచులు వేరు కాదని..**

'రన్ బనానా రన్..' అంటూ ఆమె ఆటతీరుని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తూ సోషల్ మీడియాలో అదే పనిగా కామెంట్లు వచ్చిన ప్రతిసారీ ఆమె ఏడ్చింది. అయితే తన బాధనంతటినీ మనసులోనే అదిమిపెట్టుకుంది. ఎప్పుడూ సరదాగా, నవ్వుతూ, తుళ్లుతూ తన అభిమానులకి ఫేవరేట్ స్టార్‌గా ఉండిపోయింది. క్రికెటర్‌గా ఉండడం, తన అభిరుచులని ఆస్వాదించడం ఎప్పుడూ విరుద్ధం కాదని నిరూపించాలనుకుంది. ఈ మ్యాచ్.. ఆమె పరుగులు చేయగలదు. రీల్స్ చేయగలదు. గిటార్‌పై పాటలు పాడగలదు అని నిరూపించింది. అందుకే అంతలా భావోద్వేగమైంది. ఆ కన్నీళ్ల వెనుక ఉన్న కథ ఇది. ఇది అంత తేలికైనది కాదు.

**ప్రతి అడుగూ శక్తిమంతంగా..**

2017లో భారత మహిళా క్రికెటర్లలో ఝులన్ గోస్వామి, మిథాలీ రాజ్ పేర్లు శిఖరం అంచున ఉన్న రోజులు. హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన పేర్లు కూడా అప్పటికి ఇంకా బయటికి రాలేదు. ఆ సమయంలో జెమీమా క్రికెట్ ప్రపంచం వైపు చిన్నగా అడుగులు వేస్తోంది. ఆ అడుగులు.. ఇప్పుడు టీమ్‌ని విజయం వైపు దూసుకెళ్లే శక్తిమంతమైనదిగా మారాయి. 2022లో ప్రపంచకప్‌లో ఆమెకి చోటు దక్కలేదు. ఈ ఏడాది మూడు వన్డే మ్యాచ్‌లు ఆడింది.

**తన కోసం పోరాడింది..**

గురువారం జరిగిన మ్యాచ్‌లో జెమీమా బ్యాట్‌తో కొట్టిన ప్రతి స్ట్రోక్‌కి బాల్ మైదానంలో గింగిరాలు కొట్టింది. బహుశా ఆ బంతి తనకెదురైన ప్రతి చేదు అనుభవంలా ఆమె భావించి ఉండొచ్చు. అందుకే అంత శక్తిమంతంగా పోరాడింది. ఈ విజయం తన కోసమే కాదు. తనలా అవమానాలు పడే ప్రతి మహిళా వాటిని ఎలా ఎదుర్కొనాలో చెప్పే పాఠం..


ప్రపంచం ఆమెని రీల్స్ క్వీన్, డ్యాన్స్ క్వీన్, గిటార్ క్వీన్ అని పిలిచింది. ఆ మాటల ధాటికి ఆమెలో ఎంతటి తుపాను ఉందో కొద్దిమందికే తెలుసు. చిరునవ్వుతో ఆమె చేసిన ప్రతి రీల్ వెనుక కన్నీటిని ఆపుకుంటూ ఆటపై తను చూపించిన ప్రేమ ఉంది. ఈ మ్యాచ్‌లో ఆమె పరుగుల కోసమే పోరాడలేదు. తన కోసం పోరాడింది. అందుకే ప్రత్యర్థి ఆటగాడు ప్రపంచ మేటి ఛాంపియన్ అయినా దీటుగా ఎదుర్కొంది. మ్యాచ్ గెలిసిన క్షణం కట్టలు తెంచుకు వచ్చిన కన్నీళ్లు అప్పటి కప్పుడు వచ్చినవి కావు. అవి ఎన్నాళ్ల నుండో తనని పట్టిపీడిస్తున్న అవహేళనలు. ఆ క్షణం ఆమెకి తను కొట్టిన శతకాలు, రికార్డులని గుర్తు చేయదు. అది ఆమె కన్నీళ్లని, గడిపిన నిద్రలేని రాత్రులని గుర్తుచేస్తుంది.

జెమీమా సాధించిన ఈ విజయానికి ఇప్పుడు ప్రపంచం ఆమెకి నిరాజనాలు పడుతోంది. అభిమానులే కాదు, రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు, క్రికెటర్లు ఆమె చేసిన పరుగులని అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఇప్పుడు ఎక్కడా జెమీమాపై విసిరిన ట్రోల్స్ కనిపించవు. వినిపించవు. ఎందుకంటే ఆ ట్రోల్స్‌కి ఆమె తన బ్యాట్‌తో సమాధానం చెప్పింది.



# టీమిండియా తడబ్యాటు

- నిప్పులు చెరిగిన హేజిల్‌వుడ్
- ఆస్ట్రేలియా చేతిలో ఆరు వికెట్ల తేడాతో పరాజయం
- ఎనిమిదిమంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితం
- అభిషేక్ అర్ధసెంచరీ



**మెల్‌బోర్న్:** రెండో టి20లో టీమిండియా బ్యాటర్లు తేలిపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ(68), హర్షిత్ రాణా(35) మినహా.. మిగతా ఏ ఒక్క బ్యాటరూ కనీసం రెండంకెల స్కోర్‌ను అందుకోలేక పోయారు. ఆసీస్ స్టార్ పేసర్ జోస్ హేజిల్‌వుడ్ నిప్పులు చెదిరే బంతులతో టాపార్డర్ మూడు వికెట్లు పడగొట్టి టీమిండియా నడ్డి విరిచాడు. శుభ్‌మన(5), సూర్యకుమార్(1), తిలక్ వర్మ(0)లను హేజిల్‌వుడ్ ఔట్ చేశాడు. మరోవైపు ఎల్లిస్‌కూడా రాణించడంతో టీమిండియా 45పరుగులకే 5వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆసీస్ పేసర్ల ధాటికి ఇండియన్ టాపార్డర్ విఫలమైనా... ఓపెనర్ అభిషేక్ శర్మ, ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా టీమిండియాఉ ఆదుకున్నారు.. అభిషేక్ శర్మ 37 బంతుల్లో 8 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 68 పరుగులు చేసాడు. టి20ల్లో అభిషేక్‌కు ఇది ఆరో అర్ధసెంచరీ. ఇక హర్షిత్ రాణా 33 బంతుల్లో 35 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో మూడు బౌండరీలు, ఓ సిక్సర్ ఉన్నాయి. అభిషేక్, హర్షిత్ ఆరో వికెట్‌కు 56 పరుగులు జోడించారు. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియ 18.4ఓవర్లలో 125పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 13.2ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఆస్ట్రేలియా గెలుపులో పేసర్ జోస్ హేజిల్‌వుడ్(3/13) కీలకపాత్ర పోషించాడు. హేజిల్‌వుడ్ 4 ఓవర్లలో 13 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. బార్ట్‌లెట్, ఎల్లిస్ చెరి రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం మిచెల్ మార్ష్(46) మెరుపులతో విజయానికి చేరువైన ఆసీస్‌ను ఆఖర్లో జస్ప్రీత్ బుమ్రా(2/26) వరుస వికెట్లతో భయపెట్టాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్లో మార్కస్ స్టొయినిస్(6 నాటౌట్) రెండు పరుగులు తీయగా ఆతిథ్య జట్టు నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో ఐదు టి20ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇరుజట్ల మధ్య మూడో టీ20 నవంబర్ 2 ఆదివారం రోజున హోబర్ట్ వేదికగా జరగనుంది.

**స్కోర్‌బోర్డు..**

**ఇండియా ఇన్నింగ్స్:** శుభ్‌మన్ (సి)మార్ష్ (బి)హేజిల్‌వుడ్ 5, అభిషేక్ (ఎల్‌బి)ఎల్లిస్ 68, సంజు (ఎల్‌బి)ఎల్లిస్ 2, సూర్యకుమార్ (సి)ఇంగ్లిస్ (బి)హేజిల్‌వుడ్ 1, తిలక్ వర్మ (సి)ఇంగ్లిస్ (బి)హేజిల్‌వుడ్ 0, అక్షర్ (రనౌట్)టిమ్ డేవిడ్ (బి)ఇంగ్లిస్ 7, హర్షిత్ ఆణా (సి)టిమ్ డేవిడ్ (బి)బార్ట్‌లెట్ 35, దూబే (సి)ఇంగ్లిస్ (బి)బార్ట్‌లెట్ 4, కుల్దీప్ (సి)అబాట్ (బి)స్టొయినీస్ 0, వరుణ్ చక్రవర్తి (నాటౌట్) 0, బుమ్రా (రనౌట్)ఎల్లిస్ 0, అదనం 3. (18.4ఓవర్లలో ఆలౌట్) 125పరుగులు. **వికెట్ల పతనం:** 1/20, 2/23, 3/32, 4/32, 5/49, 6/105, 7/109, 8/110, 9/125, 10/125 **బౌలింగ్:** హేజిల్‌వుడ్ 4-0-13-3, బార్ట్‌లెట్ 4-0-29-2, ఎల్లిస్ 3.4-0-21-2, స్టొయినీస్ 4-0-24-1, ఓవెన్ 1-0-13-0, కుహ్నేమన్ 2-0-14-0.

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** మార్ష్ (సి)అభిషేక్ శర్మ (బి)కుల్దీప్ 46, హెడ్ (సి)తిలక్ వర్మ (బి)వరుణ్ చక్రవర్తి 28, ఇంగ్లిస్ (ఎల్‌బి)కుల్దీప్ 20, టిమ్ డేవిడ్ (సి అండ్ బి)వరుణ్ చక్రవర్తి 1, ఓవెన్ (సి)సంజు (బి)బుమ్రా 14, స్టొయినీస్ (నాటౌట్) 6, షార్ట్ (బి)బుమ్రా 0, బార్ట్‌లెట్ (నాటౌట్) 0, అదనం 11. (13.2ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 126పరుగులు.

**వికెట్ల పతనం:** 1/51, 2/87, 3/90, 4/112, 5/124, 6/124 **బౌలింగ్:** బుమ్రా 4-0-26-2, హర్షిత్ రాణా 2-0-27-0, వరణ్ చక్రవర్తి 4-0-23-2, కుల్దీప్ 3.2-0-45-2.

## ప్రొ కబడ్డీ టైటిల్ విజేత దబాంగ్ ఢిల్లీ

- ఫైనల్లో పుణేరి పల్టన్స్‌పై గెలుపు



**న్యూఢిల్లీ :** ప్రొ కబడ్డీ సీజన్-12 టైటిల్‌ను దబాంగ్ ఢిల్లీ కైవసం చేసుకుంది. త్యాజరాజ్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఫైనల్లో ఢిల్లీ జట్టు 31-28పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్స్‌ను చిత్తు చేసింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి కేవలం 2పాయింట్లు ఆధిక్యతను సంపాదించిన ఢిల్లీ రెండో అర్ధభాగంలో ఆచి తూచి ఆడింది. మ్యాచ్ ముగియడానికి 40 సెకన్ల ముందు 29-28పాయింట్లతో పుణేరి జట్టు ఢిల్లీకి చేరువ కాగా.. రైడ్‌కు వెళ్లిన పుణేరి రైడర్ ఆదిత్య షిండేను ఢిల్లీ జట్టు ట్యాకిల్ చేయడం ఫలితం ఢిల్లీవైపు మొగ్గింది.

హోరాహోరీగా సాగిన ఈ పోటీలో ఢిల్లీ రైడర్లు నీరజ్(9), అజింక్యా పవార్(6), ఆషు మాలిక్(2)కి తోడు డిఫెండర్లు సుర్జీత్, సౌరభ్ నందన్, ఫజల్ అత్రాచేలి రాణించాడు. ఇక పుణేరి జట్టులో ఆదిత్య షిండే(10), పంకజ్ మోహిత్(4) డిఫెండర్ గౌరవ్(3) రాణించారు. దీంతో దబాంగ్ ఢిల్లీ జట్టు రెండోసార్లు ప్రొ కబడ్డీ టైటిల్‌ను చేజిక్కించుకుంది. తొలిసారి 2021-22తో దబాంగ్ ఢిల్లీ జట్టు టైటిల్‌ను సాధించింది.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68